# నవల
# స్వరూప సమాలోచనం

మాదిరాజు రంగారావు

2013
రసధుని - సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Literary Criticism

**NAVALA - SWARUPA SAMALOCHANAM**

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2013

Price : 100/-

For Copies :
**Navodaya Book House**
‘X’ Roads, Kachiguda,
Hyderabad - 27.
Ph : 040 - 24652387

**Vishalandhra Book House,**
Bank Street,
Hyderabad ` 500 001.

Printed at

*Presented to*
*my brother*
***Dr. M. Hari Kishan Rao***
Grismsby, U.K.
*with affection*

# నవల
# స్వరూప సమాలోచనం

**సూచిక :**

1. నవల - పరిచయం ......................................................05

2. నవల - లక్ష్యం.........................................................18

3. వస్తువు.....................................................................29

4. ఇతివృత్తం ...............................................................33

5. పాత్ర స్వరూపం.........................................................44

6. వాతావరణ పరికల్పనం..................................................59
(స్థలం కాలం పరిసరాలు)

7. సంభాషణ................................................................ 66

8. శైలి...........................................................................73

9. దృష్టి కోణం................................................................81

10. ప్రతీక.......................................................................90

11. చైతన్య ప్రవంతి.........................................................100

12. ఉద్దేశం - నిర్దేశం.......................................................112



## 1. నవల - పరిచయం

నవల ఎంతో స్వతంత్రమైందీ. విస్తృతమైన అవకాశం కలిగిందీ. జీవితాని కత్యంతమూ సన్నిహితమైందీ. ఇది ఎక్కువ మందిని ఆకర్షించేది కావడంతో ఒక స్థాయిని కాపాడడంలో రచయిత బాధ్యత గురుతరమైంది. ఏదో వినోదం కోసం కాకుండా దీన్ని అధిగమించి, ఉదాత్తమైన ఆలోచనకూ ఉన్నతమైన ప్రయోజనానికీ ఉద్దేశింపబడడంతో, రచయిత ప్రతిభచేత కవిత్వమూ నాటకంతోపాటు అమోదయోగ్యమౌతూంది. ఇది వచనంలో ఉండడం మూలంగానూ నిర్ణీత నియమాలు అంతగా లేకపోవడం వల్లనూ రచయితలనూ ప్రేరేపిస్తూంది. విస్తృతమైన జీవితం ఆధారంగా ముఖ్యంగా సుగమత్వం అనుకూల్యం వల్ల పాఠకులనూ ఆకర్షించగలుగుతూంది. ఇందులోని వస్తువు సమాజ మానవ జీవితాన్నీ అనుక్షణం భావింపజేస్తూంది, రచయిత దర్శించే మనో జగత్తుకు దగ్గరితనాన్ని కలిగింపజేస్తూంది.

పాశ్చాత్య సాహిత్యంలో 1700 ప్రాంతంలో ఈనాడు మనం అనుకునే విధంగా నవల వ్రాయడం ఆరంభమైంది.

“A ficitious prose narrative of considerable length in which characters and actions, representative of real life and portrayed in a plot of more or less complexity.”

Boccoccio మున్నగువారు వ్రాసిన, చిన్న కథారూపమైన ఇటాలియన్ నావెల్లా, క్రమంగా సుదీర్ఘమైన కథతో వాస్తవమైన జీవితంలోని వ్యక్తులు పాత్రలుగా, సంఘటనలు సన్నివేశాలుగా ఆలోచనాత్మకమైన వచన రచనగా రూపొందింది. నవల మధ్యతరగతి జీవితాలతో జర్నలిజం వాతావరణంలో ఉదయించింది. అయినప్పటికీ ఈనాడు క్రమక్రమంగా అన్ని తరగతులవారి జీవితాలతో అందరికీ అందుబాటులోకి వచ్చింది. పూర్వం తీరిక ఉన్న పైతరగతివారే ఎక్కువగా చదివేవారు. వారి సమస్యలే

ఉండేవి. విద్య బాగా వ్యాప్తి చెందడం, సామాజికమైన అవగాహన ఎక్కువ కావడంతో దీని విషయ విస్తృతి అధికతరమైందని చెప్పవచ్చు. ప్రాముఖ్యమూ సంతరించుకుంది.

తెలుగులో స్వతంత్రమైన నవల అవతరించి వంద సంవత్సరాలైంది. 1872లో గోపాలకృష్ణమచెట్టి "శ్రీరంగరాజ చరిత్ర", 1878లో కందుకూరి వీరేశలింగం "రాజశేఖర చరిత్ర" ఈ ప్రక్రియలో ఆరంభ ప్రేరక రచనలుగా స్థిరపడినాయి.

ఇంగ్లీషు, బెంగాలి భాషల ప్రభావంతో, ఇతర ప్రాంతాల వ్యక్తులతో సంబంధాల వల్ల తెలుగు సాహిత్యంలో ఆధునిక వాతావరణానికి క్రొత్తదనం వచ్చింది. సమాజంలో వచ్చే మార్పులు, కవిత్వం తరువాత ఇతర ప్రక్రియలపైకన్నా నవల కథపై ఎక్కువగానూ వేగంగానూ ప్రసరించడంలో ఆశ్చర్యంలేదు. ఇది సమాజమూ వాస్తవికమూ ఐన మానవ జీవితాని కత్యంత సన్నిహితం కావడమే.

కవిత్వంలో శబ్దాల ఎన్నిక, వీటి సంయోజనం, సాంద్రమైన భావన, ఆపైన అలంకారాలూ, ఇంకా ఛందస్సు, అర్థాంతరం ఇతర సామగ్రీ సంభారం అవసరం. నవలలో విశిష్టమైన శైలిని సంపాదించేంత వరకూ వాక్య విన్యాసంలో శిల్పానికి సంబంధించిన మెలకువ అవసరం. ఇంకా ఎక్కడైనా వర్ణన, ఒక్కొక్కచోట మానసిక స్థితి చిత్రణం భావ బంధురత భాషా వైచిత్రి చోటు చేసుకోవచ్చు. కాబట్టి ఈ సృజనశిల్పం వేరు. మౌలికంగా కవిత్వం చదివేటప్పుడు అనుభూతి రీతీ, నవల చదివేటప్పుడు అనుభూతి రీతీ వేరు. ఆ విమర్శ పద్ధతికీ, ఈ విమర్శ పద్ధతికీ భేదం ఉంది. స్థూలంగా, నవల చదవడానికి పాఠకులకు కవిత్వం కన్నా తక్కువ నేపథ్య సామగ్రి ప్రయత్నమూ రూపము అవసరం. నవల చాలా కొద్ది నియమాలతో ఎక్కువ స్వాతంత్ర్యం కలిగింది. విస్తృతమైన వైవిధ్యంతో కూడిన జీవిత చిత్రణానికి ఎక్కువ అవకాశమూ కలిగింది. ఈ కారణంగా రచనకు కొంత సులభత లేకపోలేదు. రచయితకు సంపూర్ణమైన స్వేచ్ఛ ఉంది.

అత్యుత్తమమైన నవలలు ఏ విధంగానూ ఉన్నతమైన ఆలోచనలో గాఢమైన భావనలో కవిత్వ నాటకం ప్రక్రియలకు తీసిపోవు. ఒక విషయం, లోకంలో నియమాలు తక్కువగా ఉండి స్వేచ్ఛ ఎక్కువగా ఉన్నప్పుడు, వ్యక్తి బాధ్యత పెరుగుతుంది. ఎంతో



వివేకం వివేచనం అవసరం ఎక్కువౌతుంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో సమాజం పొందే మార్పుల్నీ మలుపుల్నీ బట్టీ, ఈ ప్రక్రియవైపు ఎక్కువగా ప్రజల దృష్టి మరలడం సహజం. ఇది వాళ్ళ ఆశలూ ఆశయాలు. బింబించే సాహిత్య రూపంగా, సాన్నిహిత్యం పొందడానికీ ఎన్నో సమస్యల్ని గురించి భావించడానికీ వీలైంది.

కవిత్వం, నాటకం గురించి జరిగినంతగా, శాస్త్రీయమైన ఆలోచన, లక్షణ వివేచన నవల గురించి జరుగలేదు. దీనికి కారణాలు – ఇది బాగా ఇటీవలి ప్రక్రియకావడం, పేరెన్నికగన్న సాహిత్యవేత్తలు దీనికంతగా ప్రాధాన్య మొసగక పోవడమూ. కవిత్వం నాటకంతో పోల్చి చూస్తే, దీని ప్రభావ రూపం గురించి సమాలోచనం ఇంకా బాగా జరగవలసి ఉంది. నాటకం, అందునా కవిత్వం, కొన్ని వందల సంవత్సరాల క్రితం నుండి బాగా వ్రేళ్ళుదన్నుకొని ఉందన్న విషయం, ఆ పైన సమాలోచనం శాఖోపశాఖలుగా విస్తరించిన సంగతి, మరువరానిది. నవల గురించి సిద్ధాంతపరంగా విమర్శనా దృష్టితో, వీటితో సమానమైన ప్రక్రియా వ్యవస్థ ఏర్పడడానికి, ఇంకా వ్యవధి అవసరమన్న భావం పూర్వం ఉన్నది. ఈనాడు సాహిత్యం పట్ల పెంపొందుతూన్న అభిరుచి, ఇతర సాధనాలు అందుబాటులోనున్న తీరూ తెన్నూ దృష్ట్యా దీన్ని కొంత వేగవంతం చేసే అవకాశమూ ఉంది. మానవ జీవితంలో బహు విధాలైన స్థితుల్నీ, ప్రవర్తనా రీతుల్నీ విస్తృతమైన ఇతివృత్తంలో లభించే అవకాశాన్ని బట్టి ప్రతిబింబింపచేస్తూ, పురా రూపాల్నీ, వర్తమాన స్థితుల్నీ దర్శింపజేస్తూ 'నవల ఈనాడు' కావ్యమూ నాటకమూ ప్రక్కన నిలబడే స్థాయికి చేరుకోవడం గొప్ప విషయం.

భారతీయ భాషల్లో, కొన్ని పదుల సంవత్సరాల కాలంలో నవలా సాహిత్యంలో, కొన్ని రచనలు తలలెత్తుకొని శిఖరాల్లా నిలబడడం చూస్తే, ఈప్రక్రియకు గల అనన్యమైన వర్ధమాన జీవశక్తి ఎంతటిదో స్పష్టమవుతుంది.

## II

ఆధునిక జీవితంలో అన్ని రంగాల్లోనూ వచ్చే వేగవంతమైన మార్పులనూ, వైవిధ్య పూరితమైన వాతావరణాన్నీ ప్రతిబింబించే శక్తి, నవలకు సంపూర్ణంగా ఉంది.

ఇది ఏలాంటి వస్తువునైనా భావాన్నైనా సులభంగా తనలో ఇముడ్చుకోగలది బహు విస్తారమైన అవకాశాల్ని కలిగింది. హెన్రీ జేమ్సుమాటల్లో –

“The house of fiction has the possibility of millions of windows, any which can be fashioned to open, on the spreading field of the human scene by the pressure of an individual will and vision.”

నవల అనేది ఒక గృహం అనుకుంటే దీనికి అనేకమైన గవాక్షాలకు అవకాశం ఉంది. వ్యక్తి ఇచ్ఛారూపం, దర్శన దృష్టి చేత విశాలమైన వైవిధ్యం గల మానవ దృశ్యాల్ని విలోకించడానికి దేన్నైనా తెరచి చూడవచ్చు.

వ్యక్తినీ, జీవితాన్నీ, సంఘాన్నీ ఒక్కొక్కక రచయిత ఒక్కొక్క విధంగా దర్శిస్తాడు. మానవ సంబంధమైన అవగాహనతో, సమాజపరమైన చిత్రణం ప్రధానంగా కలవి ఒక రకం నవలలు. వ్యక్తి ప్రధానంగా వ్యక్తిత్వంపై ప్రసార రేఖలతో, ఆంతర రూపాలను ఆవిష్కరింపజేసేవి మరో రకమైనవి. ఒక విధంలో మరో విధమూ కొన్ని రచనల్లో అక్కడక్కడా చోటు చేసుకోవచ్చు.

నవలలో వివిధ సంఘటనలతో – పాత్రల సంబంధాన్ని పురస్కరించుకొని, నిర్మాణరూపం ఉంటుంది. దీని నిర్వహణంలో కేవలం భౌతికమైన వర్ణనలకే కాక, బయటికి కన్పించని వ్యూహాలతో, ఆంతరమైన మానసిక రీతులపై ఈనాటి రచయితల శిల్ప దృష్టి కేంద్రీకృతమైంది, ఇది మనస్తత్వ విశ్లేషణకు ప్రాధాన్యం ఇస్తూంది.

కేవలం సమాజ స్వరూప చిత్రణమే కాకుండా, పైకి కన్పించని, అంతర్గతమైన వాస్తవశక్తులూ, మానసిక రీతులూ వీటి సమన్వయంలోని స్థితి (situation)నీ, సంఘర్షణలోని గతి (movement)నీ కలిగిందీ. ఈ విధంగా స్థితికీ, గతికీ కారణమైన అదృశ్యశక్తుల్ని గుర్తించే ప్రయత్నంలో, పామాజిక శాస్త్రమూ, రాజకీయ శాస్త్రమూ, మనస్తత్వ శాస్త్రమూ, ఇంకా తదితరమైన విషయాలకూ సంబంధించిన అంశాలతో పరిచయం అవసరం. రచయితకు సృజనలో లోతు కోసం అనుబంధ శాఖల పరిచయం అవసరమైతే, విమర్శకునికి రచనలో లోతు తెలుసుకోడానికి వీటి అవగాహన అవసరం.



ఏ రచన ఐనా గాఢమైన భావనతో రూపొందిన రచనా శిల్పం లేకపోవడం వల్ల అనుకున్న ప్రభావాన్ని నేరపలేకపోతుంది. కళాత్మకత లోపిస్తుంది. ప్రయోజన విస్తృతి తత్పరత (Involvement) దెబ్బతింటుంది. మరీ ముఖ్యంగా, వచన రూపం ఐన నవలలో మధ్య మధ్య అభిలాషను నిలిపే కళాత్మకమయిన ఇతర రక్షణ శ్రేణి లేకపోవడం వల్ల, ప్రభావ శక్తిని కోల్పోతూంది. కవిత్వంలో ఐతే, పద్య రచన చేతనో, శబ్దాలంకారం చేతనో, వర్ణనలు కాస్త పెంచో, ఈ స్థితిని కొంత సేపు నిలపడానికి అవకాశం ఉంది. నవలలో కొంత హాస్యమూ, వినోదమూ, ఉండవచ్చు. శైలిచేత సాధించవచ్చు. కథన శిల్పం చేత ఉత్సుకతను నిలపవచ్చు. ప్రతి అంశాన్నీ కళాత్మకంగా మలచుకొనే తీరులో, ప్రయోజనపరంగా సంయోజించే విధంలో కళాత్మకత జాగరూ అయింది.

ఒకొక్కక్క విధమైన నవల వ్రాసేప్పుడు ఆయా విషయాల పరిజ్ఞానం ఎంతో ముఖ్యం. ఉదాహరణకు, చారిత్రకమైన వృత్తం తీసుకున్నప్పుడు, ఆ కాలంలోని చారిత్రక రాజకీయ సాంఘిక వ్యవస్థ, ఆచార వ్యవహారాలు, వేష భూషణాదులూ నివాస దృశ్యాలూ చిత్రించే అంశాలతో, కథ యోజితం కావాలి. సాధ్యమైనంత వరకు అప్పటి వాతావరణానికి తగిన సమాచారంతో నిర్మించాలి. అవసరమైతే, ఆయా స్థలాలు సందర్శించవలసి ఉంటుంది.

అలాగే, ఒక సమస్యగురించీ, ఒక పాత్రగురించీ, పలుకు తీరూ ప్రవర్తనా రీతులూ మనస్తత్వమూ – ప్రత్యక్ష సమాచారంతో సంబంధంతో క్షుణ్ణంగా పరిశీలించి చిత్రించినపుడే, సహజత్వమూ వాస్తవికతతో ఆకట్టుకుంటుంది. కొంత న్యాయమూ చేకూరుతుంది. ఏదో కల్పనతో కాలక్షేపం చేయడం వల్ల, ఒక నవలకూ, మరో నవలకూ, జీవన భూమికలో వైవిధ్యం లోపించి అనుభవ ప్రపంచంలో చెప్పుకోదగ్గ భేదం లేకపోగా సాధికారత (ఆథంటిసిటి) లోపిస్తుంది. పాఠకులకు విసుగూ కలుగుతుంది. సాధారణ స్థాయిలో ఉండిపోతుంది.

వ్యక్తి – సమాజం – చరిత్ర – సంస్కృతీ – ఆలోచన – అనుభవం – సమన్వయం – సంఘర్షణ – మొదలైన విషయాలపై అవగాహననూ, దృక్పథాన్నీ

కలిగించే ముఖ్యమైన సాధనం నవల. అందువల్ల రచయితలో గురుతరమైన ప్రభావం ఉంది. ఇది చేతి నుండి సులభంగా జారిపోయే ప్రమాదం ఉంది. ఇది ఇటీవలి ప్రక్రియ కావడం వల్ల, ఒక్కొక్క సమయంలో తక్కువ స్థాయికి చెందిన రచనలు పరంపరగా రావడంతో ఈ అపోహకు అవకాశం బాగా ఉంది. రచయితపై దార్శనికతలేని, కళాత్మకత తగ్గిన, విలువలు కోల్పోజేసే కొన్ని ఒత్తిడులవల్ల, అతనిలో అనుకోకుండా గాఢత్వం సన్నగిల్లి, దృక్పథం విశ్లథమై, ఫార్ములా రచనల విహారం అనివార్యం అవుతూంది.

నవల మానసికంగా వికాసాన్నీ ఆనందాన్నీ కలిగిస్తూనే, ఆలోచననూ ప్రేరేపించాలి, మంచి పరివర్తనకు దారి తీయాలి. ఒక ప్రమాణంలో సాగాలి, పాఠకుల మనస్సుపై చెరగని ముద్రవేయాలి. ఒక కదలికను తేవాలి, అంతకుముందులేని ఏదో క్రొత్తను కలిగించాలి, సామాజిక గతికి తోడ్పడాలి.

రచయిత రచనలో పాఠకునికి పరచయం లేని క్రొత్త ప్రపంచాన్ని అనుభవంలోకి తేవడానికీ, పరిచయం ఉన్న పాత ప్రపంచం గురించి ఆలోచింపజేయడానికీ ప్రయత్నించాలి. ఆలోచనకూ అనుభవానికీ విస్తృతినీ, వైవిధ్యాన్నీ, గభీరతనూ ప్రయోజనాన్నీ కలిగించడంలోనే ఆతని ప్రతిభాస్పర్శ ఉంది.

## III

ప్రతి వ్యక్తీ, ఒక స్థలంలో, ఒక కాలంతో, ఒక సాంఘిక రాజకీయ ఆర్థిక నైతిక వైజ్ఞానిక వ్యవస్థలో భాగం. ఒక స్థలంలో నివసించి, ఒక కాలంలో పెరిగి, తోటి వ్యక్తులతో పరస్పర సంబంధం కలిగినపుడు, ఇతని వ్యక్తిత్వం ఎన్నో అంశాల ప్రభావంతో నిర్మితమవుతుంది. ఎందరో వ్యక్తుల ఉనికితో, ప్రభావంతో, అవసరంతో ఏర్పడిన సమాజం నుండి, రచయిత, కథలో తన రచనకు ఉపయోగకరమైందీ, దారాలుగా లాగి సాలీడు గూడు వలె నిర్మిస్తాడు. నవల మానవ జీవితానికి ప్రతిరూపం అనడంలోని యాథార్థ్యం ఇదే. సమాజంలోని వ్యక్తి వలెనే ప్రతి పాత్ర, నిర్మాణరూపాన్ని పొందుతుంది. ఈ పరంపరలో ఆశ, నిరాశ, ఆవేదన, ఆరాటం, ఆనందం, విషాదం,



సుఖమూ, శాంతి మొదలుగా అనేక బింబాలు, ఒకదానితో మరొకటి, కలిసి మనల్ని ఆకర్షిస్తాయి. మానసికమైన అనుబంధాన్ని నెరపుతాయి.

రచయిత భావనలో ఒక రూపం పొందడంలో, కొంత కల్పన ఉండవచ్చు. అయితే ఎట్టి పరిస్థితులలోనూ, జీవన వాస్తవికతకూ, మానవీయ సంబంధాలకూ, మానవత్వపు విలువలకూ భంజకంగా ఉండకూడదు. రచయిత చూచిందీ, విన్నదీ ఎంత చిత్రిద్దామనుకున్నా వాస్తవమైన అనుభవ బింబంలో ఎంతో కొంత కల్పన తప్పదు. దీన్ని ఒక సంఘటన లేదా పాత్ర రూపంలో ఒదిగింపజేసి కళాకృతి రచయిత శక్తిని బట్టి దృక్పథాన్నీ విశిష్టతనూ తెలుపుతాయి.

కథావసరాన్ని బట్టీ, రచయిత దృక్పథంతో పాత్రలు తీర్చబడతాయి. రచయిత అభిప్రాయాన్ని బట్టి లక్ష్యం ఉంటుంది. 1) సమాజంతో అతడు సమన్వయ భావం పొంది ఉండవచ్చు. 2) లేదా వ్యతిరేకభావం కలిగి ఉండవచ్చు. 3) లేదా సమాజం నుండి తప్పుకునే మనస్తత్వం కలిగి ఉండవచ్చు. 4) తటస్థ భావంతో ఉండవచ్చు. 5) నిర్దిష్టమైన భావం కలిగి ఉండవచ్చు. రచయిత అభిప్రాయానికీ, వర్తమానకాలంలో భావాలకూ మధ్య ఎపుడూ ప్రసారరేఖలు తప్పకుండా ఉంటాయి. అయితే రచయిత దీన్ని గుర్తించి సామాజిక బాధ్యతను నిర్వహించడంపైనే రచన స్థానం ఆధారపడి ఉంటుంది. సమకాలీన సమస్యను తీసుకున్నపుడు, అందులోనూ వివాదాస్పదమైన సమస్యను ఎత్తుకున్నపుడు, ఇతని బాధ్యత మరీ గురుతరమౌతుంది. రచయిత జీవితాన్ని దర్శించి, స్పందించి, ఉత్సాహంతో తన అనుభవాన్నీ ఆలోచననూ ఇతరులకు సూటిగా స్పష్టంగా అందజేపే సంకల్పంతోనే ఈ ప్రక్రియను సమీపిస్తాడు – అతని అపూర్వకమైన వ్యక్తిత్వంతో, సర్వమూ వివేచింపబడి సారభూతమైన రూపాన్ని పొందుతుంది.

ఇక్కడ భాష విషయంలో ఒక మాట – కథనంలో సంఘటనల్ని బట్టి సంభాషణ – వర్ణన – వ్యాఖ్యానం, ఇవి వచనంలో ఆవిష్కృతమయ్యేప్పుడు కొంత శిల్పం చోటుచేసుకోక తప్పదు. వీటి నిర్వహణ కళపై సాహిత్యం విలువలు ఆధారపడి ఉంటాయి.

అన్ని సాహిత్య ప్రక్రియలవలెనే, నవల ఒక సృజన రూపం. పాఠకుల బాధ్యత కూడ ఉంది. రచనలో శక్తీ, ఆకర్షణ, లక్ష్యమూతోపాటు పాఠకునిలో అభిలాష – తృష్ణ – స్పందనమూ – ఆలోచన అవసరం. అనుభూతి విషయంలో రచయితతో సుస్వరతను పొందాలి. ఏకరూపతకు ప్రయత్నించాలి.

## IV

అవగాహనలో బోధనలో కవిత్వానికీ, నవలకూ భేదం ఉంది. కవిత్వంలో వాక్యాల్ని అన్వయక్రమంలో – శబ్ద శిల్పం మొదలుకొని అర్థాంతరం వరకూ, మనన శీలంతో ఒక్కొక్కప్పుడు ఒకటికి రెండు మూడుసార్లు చదువుతూ పోవలసి ఉంటుంది. ఇది సహృదయ స్పందనం కలిగిందీ. ఈ సమయంలో పొందే అనుభవ బింబాన్నీ, ఆలోచనా రీతినీ వివేచిస్తూ పోవడంతో విమర్శ మొదలౌతుంది. నవలలో బోధన సందర్భంలో ప్రతి పంక్తీ చదవడం కుదరదు. ఇతివృత్తం స్థూలంగా చర్చించి, సంఘటనల క్రమం, పాత్ర చిత్రణం, సంఘర్షణల తీరూ, రచయిత దృక్పథం ఇంకా రచనలో ఏమైన ప్రతీకలు ఉంటే అవీ, సిద్ధాంతపరమైన అంశాలూ, ఆలోచనకు వస్తాయి. దీనికి ముందు విద్యార్థి ఒక మారు చదువుకొని ఉంటే మంచిది. నవల చదవడానికి ప్రతి విద్యార్థికీ కనీస స్థాయిలో అభిరుచి అవసరం. దీన్ని ప్రోత్సహించి, అతనిలో సంకీర్ణంగా ఉన్న ఆలోచనలను ఒక పద్ధతిలో సుగమంగా తీర్చదానికి చర్యకు అవకాశం ఉంది. నవలకు ఉండే ప్రవేశయోగ్యమైన సౌలభ్యం వల్ల ప్రశస్తీ ప్రచారమూ సులభంగా సిద్ధిస్తుంది.

ఒక సంఘటన లేదా ఒక పాత్ర మనలను ఎందుకు ఆకర్షిస్తోంది? లేదా ఎందుకు వైముఖ్యాన్ని కలిగిస్తోంది? ఇది పాత్ర వ్యక్తిత్వం వల్ల కలుగుతుందా? రచయిత నిర్వహణం వల్లనా? ఈ ప్రశ్నలకు సమాధానం మొదలుగా రచనలో కళాసౌందర్యం నుండి సిద్ధాంతాల వరకూ ఎదురయ్యే సమస్యలను సహేతుకమైన ఆలోచన మొదలవుతుంది. దీనితోపాటుగా క్రమంగా అనుభూతి పరమైన అంశాలూ ఆలోచించడం జరుగుతుంది. కొన్ని నవలలు చదువుతూ పోయినమీదట, అభిరుచి సంస్కరింపబడి, వివేచనా గుణం ఉత్తేజితమవుతుంది. మొట్టమొదటి స్థితికీ. ఆ తరువాత



స్థితికీ భేదం నవల చదివేప్పుడు ఎవరైనా, అనుభవంలో ఇట్టే గుర్తించవచ్చు. మనస్సు ఒక విశిష్టమైన పరివర్తనకులోనవుతుంది. పాత్రలు, సంభాషణలు, సంఘటనలు, అభిప్రాయాలు అన్నీ కలసి ఒదిగిపోయిన అనుభవ ప్రపంచం స్ఫూర్తికి వస్తుంది. ఈ మనో వ్యాపారం నవల చదవడంలో – కవిత్వంలో కన్నా సులభంగా ప్రయత్న రహితంగా చాల వరకు సాగిపోతుంది. అయితే విమర్శించేప్పుడు ఎదురయ్యే ప్రశ్నలు వేరు. పాఠకునిలో బీజభూతంగా ఉన్న అభిరుచి వృద్ధి చెందుతుంది. పాఠకునిలో అసలే అభిరుచి లేకపోతే, చేసేదేమీ లేదు. కాని సాధారణంగా నవల పట్ల అలా జరగదు. తన చుట్టూ ఉన్న జీవిత ప్రపంచమే ఇందులోనూ ఉండడంతో, అనుకోకుండా మొట్ట మొదట అనుబంధం ఏర్పడుతుంది. ఆ పైన మానసికమైన బాంధవ్యం కొత్త ప్రపంచాన్ని చూపిస్తుంది.

ఒక్కొక్క రచయిత గురించీ లేదా రచన గురించీ ముందుగానే, ఏవో అభిప్రాయాలు ఏర్పడి ఉండవచ్చు. అది సిద్ధాంతపరమై ఉండవచ్చు. లేదా దేన్నో ఆశ్రయించి ఉండవచ్చు. అపుడు వస్తువుపై దృష్టితో విషయంపై సరియైన ఆలోచన జరగడానికి అవకాశం కల్పించవలసి ఉంటుంది. అవసరాన్ని బట్టి సిద్ధాంతపరమూ, కళాపరమూ అయిన దృక్పథాల మధ్యగల అంతరాన్నీ, సామరస్యాన్నీ గుర్తించడం అవసరం. రెండింటి విలువలూ ప్రయోజనమూ కలిసీ – వేరుగానూ ఏలా రచనలో, ఏ స్థాయిలో, ఏ ప్రమాణాలను కల్పించేదీ పరిశీలన చేయవలసి ఉంటుంది. సైద్ధాంతికంగా అభిమానించినా, కళాత్మకంగా రచన తక్కువ స్థాయికి చెంది ఉండవచ్చు. కళాత్మకంగా పైస్థాయికి చెందినదై సైద్ధాంతికంగా ఏకీభవించలేకపోవచ్చు. సిద్ధాంతాలకూ కళావాదాలకూ అతీతంగా మానవత – స్వేచ్ఛ మొదలైన విశ్వజనీనమైన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి ఉండవచ్చు. మనం ఆయా పార్శ్వాలపై వెలుగు ప్రసరించవలసి ఉంటుంది. ఈ ప్రయత్నంలో వివేచనాశీలంతో పాటు విశాల దృక్పథమూ ఎంతో మేలు చేస్తుంది. విశ్వసించిన సిద్ధాంతాలను వదలనవసరం లేదు. పాఠకునిలో ఆలోచనా స్వేచ్ఛను అరికట్టి బలవంతంగా అతణ్ణి ఒకవైపుకు మరలించడానికి చేసే ప్రయత్నం పనికిరాదు. ఒక్కొక్కమారు ఈ ప్రవృత్తి వల్ల వాళ్ళలో తెలీకుండా వ్యతిరేక భావానికి దారితీస్తుంది. లోకం లోనూ ఇలాంటి సందర్భాలెన్నో

తారసిల్లుతాయి. పదిమంది స్వేచ్ఛగా ఆలోచించడానికీ, ప్రకటించడానికీ, అలవాటుపడితే, ఆ తరువాత తప్పనిసరిగా ఒకరిద్దరి నుండైనా సాహిత్యానికి మౌలికమైన ఉపకృతి జరుగుతుంది.

రచయిత చెప్పే ప్రతి విషయానికీ ఒదిగిపోయి అంగీకరించనక్కరలేదు. కొన్నిటిని ప్రశ్నంచవచ్చు, మరికొన్నిటిని తిరస్కరించవచ్చు. ప్రశంసగానీ అభిప్రాయ భేదంగానీ విషయ ప్రధానంగా ఉండాలి. కొన్ని ప్రమాణాల్ని కలిగి సహేతుకంగా ఉండాలి. ప్రతి మనో రూపానికీ కొన్ని పరిమితులుంటాయి. ఒక వైఖరి ఉంటుంది. ఒక సంస్కార సంపుటి ఉంటుంది. ఒక ఆలోచనా విధానం ఉంటుంది. అభిప్రాయాలకు హద్దులుంటాయి. ఒక్కొక్క సందర్భంలో హేతువుకు లొంగకపోవచ్చు. వైయక్తికమైన అనుభవం ప్రధానం కావచ్చు. అనుభవశక్తిలో, ఆలోచనా రీతిలో అంతా ఒకే విధంగా ఉండకపోయినా, ఏకీభవించే అంశాలు కొన్ని తప్పకుండా ఉంటాయి. కొన్ని విభేధించక తప్పనివీ ఉంటాయి. ఏమైనా సదవగాహనతో పాటు చిత్త సంస్కారం, సహృదయత కొంత వరకు ఆశించిన వికాస ప్రయోజనాలకు సమీపవర్తిగా చేస్తాయి.

## V

నవలను గురించి సమాలోచనంలో ఇది ఎప్పుడూ రెండు స్థాయిల్లో రచన జరుగుతూ ఉంటుంది. మొదటిది – సమస్యల నుండి దూరంగా కాలక్షేపం కోసమో, వినోదం కోసమో ఉద్దిష్టమైంది. దేన్ని గురించీ ఇందులో గాఢంగా చింతన జరగదు. అనుభవ పరంపరను పైపైన స్పృశిస్తూ తాత్కాలికంగా తప్పుకోడానికీ, మరచి పోవడానికీ నేర్పుగా వ్రాయబడేవి. కొన్నిటిలో సమస్య – సంఘర్షణ – తావన్మాత్రంగా ఉండవచ్చు. వీటి నిర్వహణలో గాఢత్వం ఉండదు. అభిప్రాయమూ ఆవిష్కృతం కాదు. రెండవది – జీవితం గురించి అవగాహనను విస్తృతం చేసేదీ. కళాత్మకమైన విలువల్ని కాపాడేదీ, అనుభవాల లోతులు స్పృశిస్తూ నిశితంగా భావింప జేసేదీ. సమస్య సంఘర్షణ పరిష్కారం ఒక దృక్పథంతో తీర్చబడి ఉంటాయి. రచన మొత్తం మీద ఏ అభిప్రాయం ఆవిష్కృతమైనా విశిష్టమైన వ్యక్తిత్వం కలిగి ఉంటుంది. జీవితంలో వ్యక్తీ సంఘం గురించి నిశ్చయమైన అభిప్రాయాలతో లక్ష్యం నిర్దేశింపబడి ఉంటుంది. నవలలో



మొత్తం మీద ప్రతి అంశమూ ఎంత సముచితంగా ఉందీ, ఎంత వరకు ప్రమాణాలకు దోహదం చేసేదీ, ఆశించే లక్ష్యాన్ని సమకూరుస్తుందా? లేదా? అన్న ప్రశ్నలకు సమాధాన విభాగం వేరు. ఇది సమాలోచననానికి సంబంధించింది.

ఇతివృత్తం, పాత్రలు, సంఘర్షణ, సంఘటనలు, ప్రతీకలు, అభిప్రాయం అన్నీ విడివిడిగా కాకుండా అన్నిటినీ కలిపి ఏకముఖంగా ప్రసరించిన సంపూర్ణమైన ప్రభావ రూపం చివరగా నిలుస్తుంది. పాఠకుడు చదివేప్పుడు ఎక్కడికక్కడ విడివిడిగా పొందే అనుభవం వేరు. పై అంశాలన్నీ నిజానికి ఒక దానితో మరొకటి తప్పనిసరిగా సంబంధం కలిగే ఉంటాయి. ఉదాహరణకు – ఇతివృత్తానికీ సంఘటనల క్రమానికీ సంబంధం, వీటికీ పాత్రల ప్రవర్తనకీ సంబంధం తప్పనిసరిగా ఉంటుంది. లేకపోతే ఆకృతి సిద్ధించదు. నవల అనేకమైన అవయవాల సంపుటి, చివరకు కళాత్మకమైన అవయవిగా దర్శించడంలోనే అనుభవ పూర్ణత కలుగుతుంది. రచయిత అభిప్రాయమూ ఆవిష్కృతమయ్యేది దీని పైనే. నవలలో అభిప్రాయం కీలకమైంది. ఇది ప్రయోజన సంబంధి. ఇది పాత్రల సంభాషణలో మధ్యమధ్య రచయిత మాటల్లో వివరింపబడవచ్చు. లేదా సంపూర్ణమైన ప్రభావ పర్యవసాన సందర్భంలో సూచితమూ కావచ్చు.

వ్యక్తీ, సమాజమూ రెండూ ఒకదాని నొకటి స్పృశిస్తూ దాటుతూ పోయే రేఖలతో, ఎవరూ అనుకోని జీవిత చిత్రం ఏర్పడుతుంది. ఇది ముందుగా అనుకున్నది కాకపోవచ్చు. ఒక్కొక్కపుడు ఆశ్చర్యంలో ముంచి వేయవచ్చు. ఒక్కొక్కమారు అందగా నిండుగా రక్తిగా ఉత్సాహాన్ని పెంచవచ్చు. మరోమారు శూన్యంగా నిస్సారంగా బరువుగా మందంగా అనిపించవచ్చు. ఈ స్థితుల్నీ అనేకమైన కేంద్ర స్థానాలనుండి ఏర్పడతాయి. సూక్ష్మసూక్ష్మంగా జీవిత గతుల్ని స్పందింపజేసే జీవశక్తితో, చప్పున ఆకర్షించే లక్షణం నవలకు ఉంది.

జీవశక్తితో నవల స్వరూపం గురించి కొందరి మాటల్లో – ఇది వ్యాసం, జీవిత చరిత్ర, నాటకం, కవిత్వం మొదలైన అనేక ప్రక్రియా ఖండాల సంకీర్ణరూపం. ఇలా ప్రతి ప్రక్రియ విషయంలోనూ అంతో ఇంతో దొరకే ఆధారాల్ని బట్టి చెప్పవచ్చు.

స్వచ్ఛమైన కవిత్వం ఇలాంటిదని నిర్వచించడం ఎంత అసాధ్యమో, స్వచ్ఛమైన నవల విషయంలోనూ అంతే. కొన్ని ప్రక్రియలు ముందుగా, విశేషంగా అభివృద్ధి చెందినపుడు ఆ తరువాత రూపుదిద్దుకొనే మరో ప్రక్రియపై ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. ఒకటి మరోదానిపై సమాంతరమైన ప్రభావమూ నెరపవచ్చు. ఇది సహజం కూడా రచయిత వ్యక్తిత్వంలో ఇష్టాన్ని బట్టీ, ఇతర లక్షణాలు చోటు చేసుకోవచ్చు. అంతమాత్రాన ఒక దాని వ్యక్తిత్వానికి మరొకటి క్షతికా కలిగించదు. ఇలాంటి అభిప్రాయా లేవేవో ఉన్నా ఒక విధంగా నవల విషయంలో ముందుగా ఏవో కొన్ని నిర్దిష్టమైన నియమాలతో క్రమబద్ధం చేయబడకపోవడం వల్ల ఒక విధంగా మేలే జరిగిందని చెప్పవచ్చు. లేకపోతే ఇంత త్వరగా సమగ్రంగా అభివృద్ధి దశకు చేరుకునేది కాదేమో! ఆ నియమాల్లోనే వ్రాయవలసి రచనలో వైవిధ్యం లోపించేది. ఒక లోపం కాలాంతరాన అలవాటుగా మారితే ప్రమాదకరం. ప్రవాహకత లోపిస్తుంది, జడత ఏర్పడవచ్చు.

నవల విలువలకు ప్రమాణం ఇరువురు – ఒకరు పాఠకులు, మరొకరు విమర్శకులు. మొదట ఏ రచనకైనా పాఠకులే ఉంటారు. శ్రోతలూ ఉండవచ్చు. తరువాత వచ్చేది విమర్శకులు. లోకంలో రచన ప్రచారం పొందడానికీ ప్రతిష్ఠ కలగడానికీ వీరిరువురూ కారకులు. పాఠకుడు సాహిత్యాభిలాష అభిరుచి కలిగి వైయక్తికమైన అనుభవం ప్రభావంగా ఆనందిస్తాడు. అది అభిప్రాయ రూపంలో బహిర్గతమౌతుంది.. సంస్కార సంపన్నులయిన ఉత్తమ పాఠకులే సహృదయులు. విమర్శకుడు వివేచనా లక్షణం కలిగి ఉంటాడు. వివిధాంశాల నొక పద్ధతిలో విశ్లేషించి, ఆలోచనచేస్తాడు. ఇదీ అవగాహనతో కూడింది. పాఠకుడు, విమర్శకుడు కొంతదూరం సాగి విడిపోయే రేఖలవలె కన్పిస్తారు. వీరిరువురూ కలిసే స్థానం ఉంది. అదే వివేకం గ్రహణపూర్వమైంది, సహృదయ సమర్పకమైంది సహృదయశీలం అనుభవపరమైంది.

ఒక నవల చదవడం వల్ల ప్రయోజనం ఏమిటి? అంటే మనం ఏ ప్రయోజనాన్ని ఆశించి చదువుతున్నామో దాన్ని బట్టి ఉంటుంది. ఆనందం కోసమా?



సంస్కరణం కోసమా? పరివర్తనం కోసమా? కాలక్షేపం కోసమా? అది అందులో దొరికితే నచ్చినట్లు. ఒకవేళ నవల చదవడానికి మొదటి ప్రయోజనం ఆనందం అనుకున్నాం అనుకోండి! ఉదాహరణకు (Oscar Wilde Picture of Dorian Gray) ఆస్కార్ వైల్డ్ రచన – పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే కళ కళ కోసమే అన్న సిద్ధాంతానికి ఆదర్శమైంది. మనం అధికంగా ఆనందించగలిగిందేది? ఇక్కడ దీనికి ఆనందాన్ని ఇచ్చే శక్తి ఉందా? సరే! ఏ ప్రమాణంలో ఉంది? ఏ విధంగా ఉంది? అన్న భావపరంపర మనస్సులో సమాధాన స్పర్శతో అంతర్లీనమై ఉంటుంది. నవల చదివేప్పుడు ప్రయాణం గురించికాక ప్రయాణించేప్పటి అనుభవాన్ని పొందడం జరుగుతుంది. ఆనందంతోపాటు సమాజ ప్రయోజనమా అనుకోకుండా జరగవచ్చు. తదితర లాభాలూ కలగవచ్చు. అందువల్ల రచన అంతస్వరూపం రచయిత అనుకున్నట్లుగాను ఉండకపోవచ్చు. ఇదే సృజన రహస్యం. దాని ప్రభావం ఊహించిన విధంగా ఉండకపోవచ్చు. ఇది సాహిత్య లోక విచిత్రం.

వర్తమాన జీవితంలో వచ్చే ప్రతి పరివర్తనా తరంగాన్నీ ఇట్టే సులభంగా వేగంగా విలీనపరచుకొని, పురాదశనుండి ఇప్పటి స్థితి వరకూ, మానవ సంస్కృతీరూపాన్ని ప్రస్ఫుటంగా ప్రతిబింబించే ప్రక్రియ ఇది. నవలలో కళారూపం ఆనందానికీ, దృక్పథం సంస్కారానికీ, అభిప్రాయం పరివర్తనకూ దార్శనికత లక్ష్యానికీ హేతుమూర్తులు. వ్యక్తి స్థాయి నుండి సమాజ స్థాయి వరకూ ఉపయోగకరంగా అభివృద్ధి చెందుతూంది. ఉత్తమమైన నవల ఆలోచనను స్వనింపజేస్తుంది. అనుభవాన్ని వెలిగిస్తుంది. కర్తవ్యాన్ని ప్రబోధిస్తుంది. లక్ష్యాన్ని సూచిస్తుంది.

"Novel is the brightest book of life"

- D.H. Lawrance

## 2. నవల - లక్ష్యం

మానవ జీవిత లక్ష్యమే నవలలో లక్ష్యం. మరే ప్రక్రియాకూలేని సౌలభ్యం ఒకటి దీనికుంది. ఎన్నో విషయాలను ఏదో ఒక విధంగా సమీకరించడానికి అవకాశం ఎక్కువ. కవిత్వంలో నాటకంలో ఎక్కువగా కొన్ని పరిమితులవల్ల నియతం కావలసి ఉంటుంది. కథ, వ్యాసం, నాటకం, కవిత్వం, జీవిత చరిత్ర మొదలైన అనేక ప్రక్రియల సమాహారభూతమైన విశిష్ట ప్రక్రియగా కొందరు భావించడంలో వాస్తవం లేకపోలేదు. ఈ అవకాశం వల్ల కొన్నిటి ప్రభావం అనివార్యం. దీనివల్ల అధిక పరిజ్ఞానానికీ అనుభవ విస్తృతికీ అవకాశం ఎక్కువగా ఉంటుంది. కథలోని సందేహం, వ్యాసంలోని చింతన  నాటకంలోని సమస్య. పాత్ర చిత్రణం – కవిత్వంలోని అనుభూతి సాంద్రత – భావ చిత్రణం – ఇంకా ఆయా ప్రక్రియలకు సంబంధించిన అనేకాంశాలు నవలలో అక్కడక్కడా అనుభవానికి రావచ్చు. అయినప్పటికీ, సృజనాత్మక సాహిత్యంలో గొప్ప విజయాన్ని సాధించిన ప్రత్యేకమైన ప్రక్రియా రూపంగా స్థిరపడింది. ఈ కారణంగా నవల లక్ష్య సాధనలోనూ క్షేత్ర విస్తృతిని పొందడం సహజం. నవలను, కవిత్వం నాటకంతో పోల్చిచూస్తే పాఠకులైన సహృదయుల కత్యంత సమీపవర్తిగా కనిపిస్తుంది. చారిత్రకంగా పరిశీలించి చూస్తే, చాలా స్వల్పకాలంలో, ప్రశస్తమైన స్వతంత్రమైన ఆధునిక సాహిత్య శక్తిగా రూపొందడం విశేషం. దీనికి కారణం – ఆధునిక యుగంలోని అవసరాలకు ఎంతో సరిపడింది కావడమే.

జీవితంలోని విస్తృతి, వైవిధ్యం, ఉన్నతి, లోతు మార్పుల్ని సంగ్రహరూపంలో చిత్రించడానికీ వ్యాఖ్యానించడానికీ అవకాశం ఎక్కువ ఉండటంతో, జీవితంపై అభిరుచి, ఆసక్తి, ఆరాటం ప్రయోజనం ఉన్నంత వరకూ, నవల తన అవసరాన్ని నిలుపుకునే అంటుంది. ఏ మాత్రం ప్రాముఖ్యాన్ని కోల్పోదు. ఎవరి సహాయం లేకుండా, పెద్ద పాండిత్యంతో అవసరం లేకుండా, సాధారణ సాహిత్య పరిజ్ఞానంతో వ్రాయవచ్చు. చదవవచ్చు. అందరికీ అందుబాటులో ఉండడానికి కారణం సులభమైన యోగ్యమైన



రూపం కలిగి ఉండడమే. ఇది దీని విస్తృతమైన వ్యాప్తికీ ఆకర్షణకూ ప్రశస్తికీ దారితీసింది. రచనలో కళాత్మకత చేత నిలిచింది.

ఎంతో సులభంగా పైకి కన్పించినప్పటికీ, దీని నిర్మాణం కొంత క్లిష్టమైందే. చాల విస్తృతమైన పరిధి కలిగి ఉండడం వల్ల, దొరికిన స్వేచ్ఛను ఎంతో బాధ్యతా యుతంగా రచయిత ఉపయోగించుకోవలసి ఉంటుంది. దీన్ని విజయవంతంగా సాధించాలంటే, తనకు లభించిన మేరలో జీవితాన్ని నిశితంగా పరిశీలించిన మీదట, సూక్ష్మమైన స్థితిగతుల్ని అవగతం చేసుకోవలసి ఉంటుంది. తరువాత, ఒక దృక్పథాన్ని అలపరచుకొని, దర్శనంతో సమగ్రతను సిద్ధింపజేసే ప్రయత్నమూ అవసరం. దీనికి జీవితానుభవంతో నవంనవమైన ఆలోచన, చరయితలో ఒక క్రమంలో వికసించడం జరుగుతుంది. గొప్ప నవలలన్నిటిలోనూ ఈ లక్షణం అనివార్యంగా కన్పిస్తుంది. ఇది చివరకు నవల లక్ష్యానికి దారితీస్తుంది. రచయిత వ్యక్తిత్వాన్ని బట్టి లక్ష్యం రూపొందుతుంది. అదీ ఒక్కొక్క నవలలో ఒక్కొక్క విధమైన ఆవిష్కృతిని పొందుతుంది. వాస్తమైన జీవిత సదృశం  verisimilitude గా పాత్రను చిత్రించడంలో, సంఘటనలు మలచడంలో ఉద్దేశం తోడ్పడుతుంది. ఇతివృత్తంలో ఏర్పడే సంఘర్షణ నుండి పాత్ర వికాసంలో ఉద్దేశం సూచితమవుతుంది.

వచనంలో ఉన్న విశాలమైన సుదీర్ఘమైన వాస్తవ జీవిత రూపమే నవల. దీని ఉద్దేశం పాఠకుణ్ణి అలరింపజేయడం కాకుండా, విలువల్నీ సంతరింపజేయాలి. ఒక దృక్పథాన్ని భావింపజేయాలి. దార్శనికతను సిద్ధింపజేయాలి. ఇది ఎన్నో యుగాలుగా సంస్కృతీ పరంపరతో ఈనాటి నాగరక దశకు చేరుకున్న మానవునికి, జీవితంపై విశ్వాసాలన్నీ నిలుపుతూ పురోగతికి దారితీసేదిగా ఉండడం గొప్ప నవల లక్షణం. కవిత్వంలో కంటే ఇందులో ఒక సౌలభ్యం ఉంది. పదాలకు అర్థాలూ అన్వయమూ వెతుక్కోనవసరం లేదు. దేని కోసమే అన్వేషణలో కాలం గడపనక్కరలేదు. సులభంగా మనకు నిత్యమూ పరిచయం గల వాతావరణ నిర్మాణంతో అవగతమవుతుంది. అయితే దీన్ని గురించి ఆలోచనలో శ్రమ ఉండదని కాదు. దీని స్వరూపం వేరు. అనుభవ సాంద్రతలో భేదం ఉంది. నిర్మాణ రూపంలో భేదం ఉంది.

ఇది కళాత్మకంగా చూస్తే రచనలో వివృతమైన పరచబడిన ప్రభావ ప్రసారం కలిగింది. అందువల్ల ఏ మాత్రం రచనా శిల్పమున్నా పాఠకుణ్ణి మొదలు పెట్టగానే చివరి వరకు ఏదో ఒక విధ,గా లాక్కొనిపోతుంది. ఈనాడు అభిప్రాయాల వ్యాప్తికి, దృక్పథాల ప్రసారానికి, సిద్ధాంతాల ప్రచారానికి, మంచి సాహిత్య సాధనమైంది. జీవితంలోని విస్తృతినీ లోతునూ ఖండఖండాలుగా అక్షర రూపంలో చూపిస్తుంది. మానవుని ప్రస్థానంలో వివిధ సంస్కృతీ ముఖాలను, వర్తమాన భూమికలో దర్శించే అవకాశాన్ని కలిగిస్తుంది. కాబట్టే చాలా స్వల్ప కాలంలో అశేషమైన పాఠక ప్రపంచాన్ని నిర్మించుకోగలిగింది. ఇందులోనూ రచయితలో వారి వారి సంస్కార సంపదను బట్టి అనుభవ శక్తిని బట్టి ఎన్నో శ్రేణులకు చెందిన వారు ఉన్నారు. రచనలో ఆయా వ్యక్తిత్వాల ప్రతిఫలనం సహజం.

## II

పాత్రల్ని వాస్తవం చేత పరిపుష్టం చేయడంవల్ల మానవ స్వభావం – సమాజ గతి రూపం, మనస్సులో కొత్త ప్రపంచం అవతరింపజేస్తుంది. జీవితంలోని నిజ జీవన ప్రతిఫలనం నవల యొక్క సహజమైన అస్తిత్వాన్ని నిలుపుతుంది. జీవితం నుండి ఏదీ రచనలో యథాతథంగా దింపడం కుదరదు. కొంత కల్పన అనివార్యమవుతుంది అయినప్పటికీ, ఇది వాస్తవ రేఖల్లోనే ఒదిగి ఉండడం అవసరం. హద్దులు దాటకూడదు. నవల లక్ష్యం మానవ జీవిత సత్యానికి సన్నిహితంగా తీర్చడమే. కాబట్టి సాధారణం అసాధారణం వాస్తవం కాల్పనికం మధ్య గల అంతరాన్ని ప్రయోజనాన్నీ రచయిత గుర్తించగలగాలి. ఈ రెండింటి మధ్య ఒక స్థితిలో సమత్వాన్ని సాధించగలగాలి. అసాధారణం మనలో ఔత్సుక్యాన్ని పెంపొందిస్తుంది. అభిలాషను తీవ్రతరం చేస్తుంది. వాస్తవికం, కాల్పనికం – రెండు ప్రపంచాలూ అందరిలో ఉండేవి. మనిషి మనసులో ఆలోచన మొదలుకాగానే కల్పనకు స్థానం లభిస్తుంది. దీన్ని పూర్తిగా తుడిచిపెట్టడమూ అసంభవం, ఈ రెండూ ఏ పాళ్ళలో ఉండాలో, రచయిత నిర్వహణంలో ఇతివృత్త ప్రయోజనాన్ని బట్టి అవసరాన్ని బట్టి రూపొందించు కోవలసి ఉంటుంది. ఇది వాస్తవానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. వాస్తవాల్ని ప్రకాశింపజేస్తుంది. కాల్పనికాంశంతో సమన్వితమైనప్పటికీ, అది హేతు సహితంగా



నిర్మితం కావాలి తప్ప హేతు రహితంగా ఉండకూడదు. ఈ దృష్టితో చూస్తే కాల్పనికమైన వాతావరణాన్ని సంపూర్ణంగా పరిహరించడం కుదరదన్నమాట. అసాధారణమైన స్థితి ఎదురైనపుడు దీనికి ఊహాత్మకమైన సందర్భాల్లో కాల్పనికతకు ఎక్కువ అవకాశం ఏర్పడుతుంది.

ఏ జీవితాన్నీ ఇదమిత్థమని మనం ఒక సూత్రక్రమంలో ఎవరూ బంధించలేరు. అలాగే నవల విషయం కూడా సజీవతత్వానికీ, ప్రవాహ శీలానికీ, నిదర్శనం. అనుకోని మార్పులతో, అనుభవాలతో, అన్వేషణలతో జీవితం ముందుకు క్రమిస్తుంది. ఒక జీవితం ఉన్నట్లు మరో జీవితం ఉండదు. ఒకే జీవితంలో ఒకే విధమైన పరిస్థితిలో ఒక్కొక్క విధంగా చర్య ప్రతి చర్య అనుచర్య ఉంటాయి. వేరు వేరు పర్యవసానాలు ఉంటాయి. కారణం ఇక్కడ పనిచేసేది, ఆయా వ్యక్తుల మనస్తత్వమూ ప్రయోజనమూ. ఇది నవలలో కళారూపాన్ని ధరిస్తుంది. రచయితలను బట్టి కళాపరంగానూ ఉద్దేశాలు భిన్నంగా ఉంటాయి. ఈ సందర్భంలో నవల చదివేప్పుడు, గుర్తించవలసిన అంశాలు మూడు – 1) యథార్థమైంది. 2) రచయిత అనుకుంది. 3) పాఠకుని మనస్సులో ఉన్నదీ. రచయిత ఏది వ్రాసినా వీటి ప్రభావం అంతో ఇంతో పాఠకులపై ఉంటుంది. వివిధ రకాలైన పాఠకులు, వారిని బట్టి భిన్నాభిప్రాయాలు సహజం. నవల్లో ఒక కథ విషాదంతో ముగిసిందా? ఆనందంతో ముగిసిందా? అనే ప్రశ్నకాదు ముఖ్యం. అలా జరగడంలో అనేక సంఘటనల క్రమంలో సహజమైన గతి, అనేక పాత్రలవర్తనం, ప్రతివర్తనం – వీటి సమన్వయంలో హేతుయుతమైనధోరణి, ఔచితీవంతమైన సంస్థితి మొదలైన అంశాలు నిర్మాణంలో పరీక్షకు గురి అయ్యే ఎన్నో అంశాలున్నాయి ఈ పట్టున సమర్థించడం, సమర్థించకపోడవం, అంగీకరించడం అంగీకరించకపోవడంతో సాగే ఆలోచన చివరకు ఉద్దేశాన్ని స్పృశిస్తుంది. ఉద్దేశం స్థానంలో నుండి అన్నిటికి పరిష్కారమార్గాలు బయలుదేరుతాయి. అంటే లక్ష్యం తెలిస్తే సమాధానాలు అన్వేషించడం సులభమన్నమాట. లక్ష్యం లేదా ఉద్దేశం అనేది నవలల్లో ఎక్కడో ఒక చోట కాకుండా, రచన అంతటా సర్వాంగాల్లో వ్యాప్తమై కాంతి ప్రసారంలా స్ఫూర్తికి వస్తూ ఉంటుంది. చివరలో దాని స్వరూపంతో ప్రయోజనం కలిసి బింబంగా ప్రకాశిస్తుంది.

## III

మనిషికీ, సమాజానికీ గల పరస్పర సంబంధంతో వివిధ స్థితుల్లో రచయిత అభిప్రాయం ప్రస్ఫుటమౌతుంది. ఇది వ్యక్తికీ వ్యక్తికీ, వివిధ వలయాలతో ఏర్పడే సంఘానికీ మధ్య అనుబంధాలు సంబంధాలతో, వస్తువును బట్టి నియతమవుతూ నవలలో ప్రత్యేకరూపాన్ని సంతరించుకుంటుంది. ఈ లక్షణం 1) సామాజికంగా చూస్తే – మానవుల ప్రవర్తనారీతులూ, సామాజికమైన నీతి, నియమాలూ, మత ప్రస్థానం, తాత్త్విక చింతనమూ, రాజకీయధోరణులూ. 2) వైయక్తికంగా చూస్తే – స్వంత ఆలోచనలూ, మనస్తత్వ రీతులూ అనుభూతి స్పందనలూ అన్నీ కలసి లక్ష్యం వెనుక నుండి పని చేస్తాయి. వ్యక్తి – కుటుంబం – సమాజం అనే మూడు పొరలతో మనస్సు అభిలాష అనుబంధం ఆకర్షణతో జీవితాన్ని ప్రభావితం చేయడం జరుగుతుంది. దీని చిత్రణమే నవలలో దర్శనమిస్తుంది. ఇది స్థూల సూక్ష్మస్థాయిల్లో విశ్లేషణ కందుతుంది.

ప్రతిభ, పరిజ్ఞానం, అనుభవం ఉన్న రచన, సామాన్యమైన ఆలోచనల్ని అతిక్రమించిన అనుభవ పరంపరలో ముంచేస్తుంది. ఒక్కొక్కపుడు ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది. ఈ దృష్టితో చూస్తే ఉత్తమ నవల పరిజ్ఞానాన్ని పెంచుతుంది. అనుభవాన్ని విస్తృతం చేస్తుంది. ఆలోచనకు లోతు నిస్తుంది. అందుచేత నవల లక్ష్యానికి అవధులు నిర్ణయించడం కష్టం. మన జీవితం వలె ఎప్పటికీ ఎంత చెప్పినా అసంపూర్ణమే. అందుకని నవలతో వస్తువు పాతబడి పోవడమంటూ ఉండదు. ఈ వ్యాసంగం సాగుతూనే ఉంటుంది. కాలం గడిచేకొద్దీ మార్పు కోరే కొత్తను ఆశించే మానవుని ప్రస్థానం వలె, దీనికీ సమాప్తి రేఖ లేదు.

జీవితం ప్రతిక్షణం మారే స్వభావం కలది. అంటే ఇప్పుడున్న సమీకరణం, యోజనం, స్థితి, గతి, రీతితో, ఆకృతి ఎన్ని అంశాలతోనో ఏర్పడింది. ఇట్లా ఆ తరువాత ఉండదు. ఈ విధంగానే ప్రకృతి గురించి చెప్పవచ్చు. అందువల్ల మనకు కన్పిస్తున్న సమాజాన్ని మొదట పరిశీలించడం ముఖ్యం. తరువాత అందులోని



అంశాలను ఎన్నుకోవాలి. ఆపైన అభిరుచి, విచక్షణ, శిల్పం ఈ సందర్భంలో జ్ఞాపకం వస్తాయి. కళాత్మకతకు వెనుక నుండి సృజన శక్తి పనిచేయంది, ఏ రచన సాధ్యం కాదు. పరిశీలనం – ఎన్నిక శిల్పం మూడూ కలసి ఒక లక్ష్యాన్ని ఉద్దేశించి పనిచేయడంలో దార్శనికత చేకూరుతుంది. ఉత్తమ రచనల్లో నీతి – సత్యం – ధర్మం మొదలైన సాధారణ విషయాలతోపాటు జీవన తత్త్వం స్పష్టంగానో, సూచనగానో, ప్రపంచితమౌతుంది. ఇది అనేకమైన విశ్వాసాలూ, అభిప్రాయాలూ, ఆలోచనలూ, చింతనమూ, ఆదర్శాలూ సిద్ధాంతాలను బట్టి రూపొందుతుంది. తెలుగు సాహిత్యంలో, నవలా ప్రపంచంలో కందుకూరి, ఉన్నవ, విశ్వనాథ, చలం, బుచ్చిబాబు, కొడవడిగంటి, గోపీచంద్, రాచకొండ మొదలైన ప్రముఖ రచయితల్లో ఈ లక్ష్యరూపాన్ని సులభంగా గుర్తించవచ్చు. నవల లక్ష్యం ఉల్లాసం కలిగించడమైనా, పరిజ్ఞానం కలిగించడంతోపాటు జీవనతత్త్వ దర్శనంలోకి ప్రవేశించడంతో, క్షేత్రపరిధి విస్తృతిని పొందుతూంది, లక్ష్యానికి ఉదాత్తత చేకూరుతూంది.

దర్శనం కొత్త ప్రపంచంలోకి తీసుకొని వెళ్ళుతుంది. జీవిత లక్ష్యం గురించి నిశ్చయ భావంతో ఆలోచింపచేస్తుంది. ఒక్కొక్కపుడు మనల్ని ఆలోచనా స్థితి నుండి, క్రియోన్ముఖుల్ని చేస్తుంది. సంస్కారంతోపాటు మార్పునూ ప్రవేశపెడుతుంది. రచయిత సృజన ప్రతిభ చేత దార్శనికంలో తాత్త్వికమైన రూపానికీ కళాత్మకమైన భావనకూ మధ్య సామరస్యం చెడకుండా ఉన్నతమైన ప్రమాణంలో సుస్థితిని సాధించడం జరుగుతుంది. నవల ఈనాడు ఇతర సృజన ప్రక్రియలతో సమానమైన గౌరవాన్ని పొందడానికిది ముఖ్యహేతువుల్లో ఒకటైన ఈ అంశాన్ని విస్మరించడానికి వీలులేదు. ఈ రకం నవల, తమ లక్ష్యాన్ని నిర్దిష్టం చేస్తూనే, మనల్ని ఆలోచింపజేస్తూనే, నిర్మాణ శిల్పం చేత ఇతివృత్తం – పాత్ర, వాతావరణం మొదలుగా రమణీయమైన యోజనతో ఆనందాన్ని కలిగింపజేస్తూంది. మొదటిది సమాజపరమైంది. రెండోది వ్యక్తిపరమైంది. మొదటిది, సమాజాన్ని గురించి దాని స్థితిగతుల్ని గురించి ఆలోచన చేస్తుంది. ప్రతిక్రియను భావింపజేస్తుంది. మార్గాన్ని రూపొందిస్తుంది. రెండోది, రచయితలోని రచనాశక్తి ప్రసారంతో మొదటిది దాని ఆవిష్కారాన్ని ఆకర్షణీయచేస్తూ, నవల మొత్తం

మీద వైయక్తికమైన అనుభూతిని కలిగిస్తుంది. ఇది సాహిత్యం విలువల దృష్టితో ముఖ్యమైంది. మొదటిది లక్ష్యం యొక్క క్షేత్ర విస్తృతి దృష్ట్యా సామాజికమైన శ్రేయస్సుకు కారణమైంది. ఒక్కొక్క రచయితను బట్టి, ఆయా రచనలను బట్టి వివిధ నిష్పత్తుల్లో ఈ రెండిటి సమ్మేళనం ఉంటుంది.

"కళ కళ కోసమే" అనే వాదం పందొమ్మిదవ శతాబ్ది చివరి పాదంలో వ్యాప్తమైంది. సామాజిక సమస్యల నుండీ, సందేహాల నుండి దూరంగా స్వతంత్రంగా ఉండాలని వీరి అభిప్రాయం. కళను, నీతి నియమాల నుండి దూరం చేసి, సామాజిక వాస్తవాలకు అందని ఎత్తులో ఉంచాలని వీరి ప్రయత్నం. కళకూ సామాజిక వాస్తవికతకూ వీడని సంబంధం ఏమీ లేదనీ ఈ రెండూ కలిసే అనివార్యత ఏమీ లేదనీ వీరి విశ్వాసం. ఆస్కార్‌వైల్డ్ "పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే" ఈ కోవకు చెందిందే.

కళాకారుడూ సమాజంలో సభ్యుడే. సమాజానికి దూరంగా ఉండజాలడు. ఒక సమస్య ప్రభావం తాము కోరే స్థితి పైన చేరే యత్నంలోనూ ఉంటుంది. అందరితోపాటుగా ఇతడు ఆలోచనా జీవి అవడం వల్ల, మరింత అభిలాషతో దాన్ని అవగతం చేసుకునే ప్రయత్నం చేయాలి. సామాజికమైన బాధ్యతను విస్మరించకూడదు. ఈ దృష్టి అతని సృజనాత్మక శక్తికి కొత్త రూపాన్ని ఇస్తుంది. దీన్ని నిరాకరించడంలో కృత్రిమత్వం చోటు చేసుకొంటుంది. ఈ విధమైన అభిప్రాయమూ బలంగా క్రమక్రమంగా మరోవైపు నుండి వీస్తూ, రచయితల్లో సామాజిక స్పృహను ఉద్బుద్ధం చేసే యత్నమూ జరిగింది. నిబద్ధతనూ ప్రేరేపించింది. ఇంకా కళాకారుణ్ణి సామాజికంగా ఒక సిద్ధాంతానికీ ఆదర్శానికీ లక్ష్యానికీ నిబద్ధం చేసే వాదమూ ఇటీవల బాగా వ్యాప్తిలోకి వచ్చింది. ఈ సందర్భంలో నైజీరియన్ విమర్శకుడు Kolawole Oggungbesan మాటలు పరిశీలనార్హాలు :-

"The writer is a member of society and his sensibility is conditioned by the social and political happenings around him.. These issues form a part of the substance of life within which his instinct of a writer must struggle"



"రచయిత సమాజంలో సభ్యుడు. అతని సూక్ష్మమైన ఇంద్రియానుభవ స్పందనం తన చుట్టూ ఉన్న సామాజిక రాజకీయ పరిణామాల చేత నియతమవుతుంది. ఈ సమస్యలు (వివాదాంశాలు) జీవిత రూపంలో భాగమవుతాయి. ఈ స్థితిలో రచయిత యొక్క సహజ జ్ఞానం ఎదుర్కోవలసి ఉంటుంది, సంఘర్షించవలసి ఉంటుంది."

నవల యాథార్థ జీవితం నుండి దూరంగా ఉండదు కాబట్టి దాని స్వభావంలోనే ఈ "ఏకాంత ధోరణి" కే మాత్రం అవకాశం లేదు. అలా అయితే దానికి మరో పేరు పెట్టవలసి ఉంటుంది. నవలా రచయిత సామాజిక బాధ్యతను ఒక లక్ష్యంతో నిర్వర్తించినపుడే, దానికి యోగ్యత ఏర్పడుతుంది. ఈ సందర్భంలో కళాత్మకమైన విలువల్ని పరిహరించవలసిన అవసరం లేదు. అయితే లక్ష్యాల్లో భేదం ఉండవచ్చు. మనం అంగీకరించవచ్చు, అంగీకరించకపోవచ్చు. అది వేరే విషయం.

ఇక ఈ లక్ష్య వివేచనం తరువాత ఒక్కొక్క లక్ష్య విభాగాన్ని స్థూలంగా పరిశీలించవలసి ఉంది.

**1. మానసికంగా ఉల్లాసం, ఉపశమనం, తృప్తి, ఆనందం –**

మనిషి పుట్టింది మొదలుకొని చిన్నప్పటి నుండి మనసులో నిలచిపోయిన అనేకమైన కోర్కెల సంచారానికి, తృప్తికి అవకాశం కావాలి. ఉదాహరణకు పగటి కలలు కనడమూ, మానసికంగా ఈ స్థితి వల్లనే. పిల్లల్లో ఇది స్పష్టంగా కన్పిస్తుంది. పిల్లలు ఉపాధ్యాయులుగా, బూచివాండ్రుగా, ఇంకా అనేక రూపాల్లో జంతువులుగా, నటిస్తూ అనుకరిస్తూ కాలక్షేపం చేస్తారు. పెద్దలు సామాజికమైన కొన్ని అవరోధాల వల్ల సభ్యతకు భంగం కలుగుతుందన్న భావంతో మనసులోనే కల్పించుకొని పగటి కలలు కంటారు. కల్పనలు చేస్తారు. మనోజగత్తులో నిర్నిబంధంగా జరిగే స్వేచ్ఛాయుతమైన ఈ కల్పనా సంచారం, వ్యక్తికి మానసికమైన తృప్తిని చేకూరుస్తుంది. ఇది ఎవరికీ అపకారం చేసేదికాదు. కేవలం వైయక్తికమైంది. నవల ఒక సంగ్రహ ప్రపంచం. ఇందులో ఒక కథ – ఎన్నో పాత్రలు, సంఘటనలు, సమస్యలు, ప్రతిఘటనల

ఉల్లంఘనం, ఆశ, నిరాశ, జయం, అపజయం, ఆదర్శంతో పాఠకునికి ఒక తృప్తినీ ఆనందాన్ని కలిగిస్తుంది. నవలలో అనేకమైన అంశాలు, తన మనస్సులో అణగిన, లేదా దాగిన రూపాలతో విభేదాన్నో ఐక్యాన్నో, తిరస్కారాన్నో, ఆరాధననో పొందుతాయి. మానసికంగా ఏర్పడిన పెద్ద అఖాతాన్ని, ఆలోచనాత్మకంగా పూరించుకొని, ఆశ్వాసాన్ని పొందడం జరుగుతుంది. ఈ లక్ష్యం రచయిత కావాలని ప్రవేశపెట్టింది కాదు. రచనలోని సహజ లక్షణం వల్లనే సిద్ధించేది. ఇది పాఠకుడు అత్యంత సులభంగా మానసికమైన ఉద్రేకానికి, పొందే రక్షణకవాటం (సేఫ్టీ వాల్వ్) లాంటిది. ఉత్తమ నవల చదివేప్పుడు ఈ ప్రభావ రూపాన్ని ప్రతి వ్యక్తీ స్పష్టంగా గమనించవచ్చు. నవల జీవిత సత్యంతో వాస్తవం ఎక్కువగా సాదృశ్యం పొందడం చేత మరీ దగ్గరగా, చేరి ఇంచు మించు దానితో సంపూర్ణమైన సహయోగాన్ని పొందడం జరుగుతుంది.

**2. వాస్తవాల అవగాహన, చిత్రణం, ఆదర్శం –**

వాస్తవాన్ని సరిగా అవగాహన చేసుకొని, పరిశీలించి, విశ్లేషించి, అవసరమైంది ఎన్నుకొని చివరకు ఈ వస్తు సముచ్చయాన్ని దర్శన శక్తితో చిత్రించగలిగినపుడు నవలకు పరిపూర్ణత సిద్ధిస్తుంది. ఇది రచయిత సామాజికమైన స్పందనతో, కళాదృష్టితో అవసరమైన లక్ష్య సాధనాన్ని భావింపజేసేది.

**3. జీవిత దర్శనంతో దృక్పథాన్ని కలిగించడం, తత్త్వాన్ని నిర్దేశించడం –**

ఉత్తమ నవలలో ఈ అంశానికి ప్రాముఖ్యం ఉన్నమాట వాస్తవం. సమాజంలో ఎన్నో సంక్లిష్టమైన సమస్యలు ఎదుర్కోవలసి వచ్చినపుడు వాటి పరిష్కార సాధనలో – సామాజికమైన సువ్యవస్థకూ, సౌభాగ్యానికీ, ఒక్కొక్కరూ ఒక్కొక్క ఆలోచనా స్వరూపాన్నీ, క్రియా వైఖరినీ ఎన్నుకొంటారు. అలాగే వ్యక్తివికాసం, జీవన సమున్నతి విషయంలోనూ ఇది జాతీయ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయిదాకా, ఆర్థిక, రాజకీయ, తాత్త్విక, సాంఘిక క్షేత్రాల్ని స్పృశిస్తూంటుంది. సమస్యకు ఒక పరిష్కార మార్గాన్ని సూచిస్తుంది. జీవితంపై ఆశారూపాన్నీ కలిగిస్తుంది. ప్రయాణానికి దిక్సూచిలా ఉపకరిస్తుంది. వ్యక్తి శ్రేయస్సు నుండి సమాజ భవితవ్యం – స్పష్టంగా ఆవిష్కృతమౌతుంది. రచయిత వ్యక్తి – సమాజం పట్ల అభిప్రాయాన్నీ, అందులో తన పాత్రను సక్రమంగా



స్పష్టంగా నిర్వహించే విశ్వాసాన్ని భావింపజేస్తుంది. ప్రతి గొప్ప నవలలోనూ దృక్పథమూ– తత్త్వమూ ఉంటాయి. అది సనాతన ధర్మ ప్రపంచనం కావచ్చు – ప్రజాస్వామ్యం విలువల్ని స్థాపించేది కావచ్చు. సామ్యవాద సమ సమాజ నిర్మాణం కాంక్షించేది అవచ్చు. దీని వెనుక ఎంతో చరిత్ర – సంస్కృతి యొక్క పరిశీలనం, వర్తమాన స్థితి సమీక్షణం, భవిష్యత్తును గురించి స్పష్టమైన అవగాహనతో దృఢమైన దార్శనిక నిశ్చయం ఉంటుంది.

**4. నిఖిల మానవ సంస్కృతీ పరిణామంలో భాగం –**

నవలలో వాతావరణ పరికల్పనంతో పాటు మానవీయమైన రూపకల్పనమూ తప్పని సరిగా ఉంటుంది. ఇది సమాజాన్ని ఆశ్రయించి, దాని చిత్రణలో అంతస్సూత్రంగా మనల్ని ఆకర్షిస్తుంది. ఎన్నో మతాలు, జాతులు, వర్ణాలు, కులాలు, దేశ పరిధులు సంకుచిత వలయాలు అధిగమించిన మానవీయ భావన ఏలాంటి నవలలోనూ అంతో ఇంతో ఉండక తప్పదు. ఉత్తమకోటికి చెందిన నవలలో దీనికి సరియైన స్థానం ఉండి తీరుతుంది. ఆకలి దారిద్ర్యం, మోసం, అన్యాయం, అవినీతి, అధర్మం, బాధ, కారుణ్యం, సమస్య, త్యాగం, క్రౌర్యం, ఉదారత ఈ విధంగా అనేకంగా నిత్య జీవితంలో ఎన్నో విషయాల్లో ప్రపంచంలో మానవులందరూ ఏ భేదం లేకుండా పంచుకునే అంశాలున్నాయి. ఇది అందరినీ కలిపే మానవతా సూత్రం. జాతి, భాష, దేశం వేరైనా ఎన్నో ఉత్తమ రచనలు చదివి ఆనందించి ప్రయోజనం పొందగలిగే ఉదాత్త లక్షణం, ఈ మానవీయ భావనా కేంద్రం నుండి ఆవతరించిందే.

మానవుణ్ణి మానవుడుగా చూచే ఉదార భావాన్నీ, గౌరవించే సంస్కార రూపాన్నీ కలిగిస్తూ, నిఖిల మానవ సంస్కృతీపరిణామంలో భాగంగా వ్యక్తిని భావింపజేసేది. భౌతికంగా చూస్తే – తిండి, బట్ట, ఆశ్రయం, మానసికంగా చూస్తే – ఆర్ద్రత, అనురాగం, ఆవేదనతో ప్రతివ్యక్తి, జాతి, దేశం సౌభాగ్యాన్నీ, సౌహార్దాన్నీ, శాంతినీ కాంక్షిస్తూ – మానవుని ప్రస్థానంలో ఒక భాగంగా దర్శనమిస్తుంది. ఒక్కమారు పర్యాలోకనం చేస్తే, నవల లక్ష్యం – సమాజంలో భాగంగా, వ్యక్తిత్వం గల మానవుడుగా అటు సామాజిక బాధ్యతనూ ఇటు వ్యక్తిత్వ స్ఫూర్తినీ కలిగిస్తుంది. చైతన్యవంతంగా

వికసింపజేస్తుంది. నిజజీవితంలో రెక్కలు ముడుచుకొన్న ఆలోచనల్ని ఎగిరేట్లు చేసి, అనుభవ పరిధిని విస్తృతం చేస్తుంది. అనేకమైన సంఘటనలతో పాత్రలతో సంక్షిప్తమైన జీవితంతో సాదృశ్యంగా ఇందులో మనమే ఉన్నది “మన కథే చెబుతున్నట్లుగా”, ఐక్యభావాన్ని స్పందింపజేస్తుంది. వాస్తవ జీవితంలో మనకు లభ్యంకాని కోర్కెలతో, అణగిన ఆశలతో, ఏర్పడిన లోటును, మానసికంగా తృప్తినిస్తూ, కళాత్మకంగా పరిపూర్ణం చేస్తుంది. వ్యక్తిలో అనుభూతితోపాటు ఆలోచనా వికాసానికీ, ప్రసారానికీ దారి తీస్తుంది. మానవీయ సంబంధాలను దృఢతరం చేసి, విశ్వమానవ భావన నావిష్కరించేందుకు ప్రయత్నిస్తుంది. ఒక దృక్పథంతో, సిద్ధాంతత్వంతో వ్యక్తిలోనే కాక సామాజికంగానూ సంస్కారానికీ పరివర్తనకూ దోహదం చేస్తుంది.

సమాజంలో వ్యక్తులు, కుటుంబం, బయటి లోకం, ఇందులోనూ నిత్యమూ పరిచితమైందీ, అపరిచితమైందీ – అన్నీ కలిసిన సమాజ రూపం నవలలో, జీవిత భాగాల్లో చిత్రితమై నిర్మాణ రూపాన్ని పొందుతుంది. ఈ భాగాల్లోనూ ఎన్నో అరలు, పొరలు. ఒక్కొక్కటీ ఒక్కొక్క చిన్న ప్రపంచమే అనవచ్చు. వీటితో తప్పనిసరిగా సంబంధాలుండే మనుషులు, అనుబంధాలు, ఆలోచనలు, ప్రవర్తనలు, అనుభూతులు, అనుభవాలు, ఎన్నెన్నో మానవత్వపు విలువలతో, సంస్కార దృష్టితో పరివర్తనా రూపాన్ని, స్పందించే సమాజ వాస్తవ రూపం నవల.



# 3. వస్తువు

వస్తువు లేదా విషయం నవలలో ఆధార సూత్రం. రచయిత మూలభూతమైన అభిప్రాయానికి మిక్కిలి సంగ్రహమైన, సారభూతమైన ప్రతిపాదనారూపం. దీనినుండే ఇతివృత్తం సాగి పరచుకుంటుంది. ఒక విధంగా రచనను అదుపులో ఉంచి, రచయితను స్థూలంగా లక్ష్య సీమల్లో ఉంచేదీ, అనుక్షణం అతనికి జ్ఞాపకం చేసేదీ, దీన్ని గురించి చెప్పేప్పుడు సాధారణంగా పాత్రల ప్రసక్తి ఉండదు. వాటి పేర్లూ పేర్కోనవసరం లేదు. ఇది ప్రధాన కథకు కేంద్రస్థానం. నవలలో ఉండే వివిధాంశాలన్నింటినీ సమైక్యపరచేది. రచనలోని వస్తువు గురించి భిన్నాభిప్రాయాలు ప్రకటితం కావచ్చు. మొదట వ్యక్తి నుండి వస్తువు ఉద్గమిస్తుంది. ఇది వృత్తంలో సంఘటన క్రమంతో వికాసాన్ని పొందుతుంది. చివరకు పాత్రలో పరిపూర్ణతను సాధిస్తుంది. వ్యక్తి, ఇతివృత్తం, పాత్ర – ఈ మూడింటి నుండి పరిణామాన్ని పొంది అస్తిత్వాన్ని సంపాదించుకుంటుంది. ఈ విధంగా పరచబడడంతో కథ ప్రయోజనం ఒక దిశ వైపుకు క్రమిస్తుంది. జీవిత లక్ష్య నిర్దేశంతో సమస్యలోని మూలభావాన్ని స్పృశిస్తుంది. మానవజీవితం గురించి సాధారణమైన అభిప్రాయ ప్రకటనంలో నైతికమైన ఉపదేశ స్ఫూర్తి ఉండవచ్చు.

నవల ఆరంభించే ముందు ఏదో ఒక భావం లేదా ఘటన మనస్సులో మెదలుతుంది. దీన్ని అనుసరించి వ్యక్తులు ప్రత్యక్షమౌతారు. ఒక్కొక్కపుడు వ్యక్తులు మొదట మనస్సులో రూపొందుతారు. భావం దాన్ని ఆశ్రయించి సాగుతుంది. ఆ వ్యక్తుల విధం ఎటువంటిది? ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు? ఆ విధంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? అదే ప్రశ్నల నుండి వస్తువు రూపొందుతుంది. నవల్లో ఈ విధమైన ప్రశ్నలకు సమాధానాలు సంఘటనల్లో క్రమంగా చర్యలు ప్రతిచర్యల్లో విస్తృతమౌతూ, పాత్రల నిర్మితి రూపొందుతుంది. అయితే ప్రధానమైన పాత్రలో వస్తువు స్థూల రేఖ నిక్షిప్తమై ఉంటుంది. కొన్ని నవలల్లో పాత్రలు ఒకటి కన్న ఎక్కువగానూ ఉండవచ్చు. ఇది జీవిత క్షేత్రాన్ని విస్తృత పరిధిలో గ్రహించినపుడు జరుగుతుంది. నవల రచనలో అవలంబించే సంవిధానాన్ని బట్టీ ఉంటుంది. వీటిలో ఒకటి సాధారణంగా ప్రధానమైందీ, మిగతావి సహాయకారులుగానూ ఉంటాయి. ప్రధానమైన దానికి అప్రధానమైనవి పోషకాలుగా ఉంటాయి. ఒక నవలలో ప్రతిపాదించిన విషయం

గురించి వివిధమైన అభిప్రాయాలూ ఉండవచ్చు. మాలపల్లి నవలతో 1) గాంధీజీ నాయకత్వంతో, భారత దేశంలో స్వాతంత్ర్యోద్యమ్యంతో వచ్చిన పరివర్తనం, సమాజానికి క్రొత్త రూపాన్ని ఇచ్చింది. 2) సమాజంలో వ్యక్తులందరూ సమానమే. భౌతికంగా మానసికంగా అంతా వికాసాన్ని పొందినపుడే జాతి శక్తివంతంగా రూపొందుతుంది. 3) జీవితం అనేక సమస్యలతో సంఘర్షణలతో నిండి ఉంటుంది. అహింస, శాంతి సమానత్వం మానవత్వం మానవజాతికి అత్యంతావశ్యకాలు. 4) వర్ణ వ్యవస్థ మానవ నిర్మితమైంది. దీన్ని పరిస్థితుల కకుగుణంగా మార్చి రూపొందించే శక్తి మనలో ఉంది. దీనికి బలమైన సంకల్పం, తీవ్రమైన కృషి జాతి పురోగతికి అవసరం. హామ్లెట్ నాటకం తీసుకుంటే 1) మనస్సు స్తిమితంలేని వ్యక్తి ఏ పనీ సరిగా చేయలేడు 2) మానవాతీతమైన శక్తి మనస్సు పై ప్రభావాన్ని నెరపి ఆలోచనలో ప్రవర్తనలో విపరీతమైన మార్పు తెస్తుంది. 3) చెడుకీ మంచికీ, అవినీతికీ నీతికీ జరిగే సంఘర్షణలో చివరకు జీవితంలో చెడు, కుటిలత అవినీతి ఓడి పొందుతాయి. ఈ విధంగా ఒక్కొక్క రచనలో వస్తువును అనేక విధాలుగా వ్యక్తి కేంద్రంగా ఆలోచన చేసే అవకాశం ఉంది. ఉదాహరణకు 'వేయిపడగలు'లో ధర్మారావు పాత్రనూ అసమర్థుని జీవ యాత్రలో సీతారామారావు పాత్రనూ గమనించవచ్చు. ఇందులో ఏదీ అనుచితం కాదు. అన్నీ కథతో సంబంధం ఉన్నవే. పరిశీలకుడు చూచే దృష్టిని బట్టి ఒక్కొక్క విధంగా వస్తువు ముందుకు వస్తుంది. పలువురు ఒక్కొక్క విధంగా భావించడానికి కారణం కథలో ఒకదాని కొకటి సంబంధించిన అంశాల్లో ఒక్కొక్కరు ఒక్కొకకటి ముఖ్యం అనుకోవడమే. అన్నిటిలో ఒకటే శిఖరం వలె స్పష్టంగానూ కన్పించవచ్చు. ఒక్కొక్కటి ఒక్కొక్కరిని ఆకర్షించడంతో అన్నీ యథార్థాలే ఐనా, వేరు వేరుగా ఉంటూనే, పరస్పర సంబంధంతో రచనలో సంపూర్ణతకు దోహదం చేసేవి. ఒక్కొక్కరు ఒక్కొక్కటి ప్రధానం చేసుకొని వ్యాఖ్యానానికి పూనుకోవచ్చు. ఇది నవల యొక్క వైవిద్యాన్నీ, వివిధ పార్శ్వాలతో కూడిన రూపాన్నీ భావింపజేస్తుంది.

నవల లోని ప్రధానాంశాల్లో ఇతివృత్తం ఒకటి. ఇందులో అనేక సంఘటనలు ఉంటాయి. ఇవన్నీ ఇతివృత్త పరిణామానికి దారితీసేవే. అన్నీ ఏదో ఒక కేంద్ర బిందువుతో ముడిపడి ఉంటాయి. ఆ కేంద్ర స్థానమే వస్తువు. వస్తువులో కన్పించని ఎన్నో అంశాలు ఇతివృత్తంలో నిర్మాణ రూపాన్ని బట్టి దృశ్యమానమవుతాయి. ఇది



ఇతివృత్తమనేది వస్తువు నుండి క్రమంగా పరిణామాన్ని పొందే లక్షణాన్ని స్పష్టం చేస్తుంది. ఏదో ఒక తీరులో సంఘటనల అల్లిక లేదా కూర్పును బట్టి అవగతికి వస్తుంది. ఈ పరిస్థితి వస్తువు నుండి దూర దూరం జరిగిపోతూ, నవలలో పరిశీలనార్హమైన మరో ప్రత్యేక విషయంగా రూపొందుతూంటుంది. వస్తువుకూ ఇతివృత్తానికీ మధ్య ఆనుగుణ్యం అవసరం. లేకపోతే దేని దారి దానిదే అవుతుంది. వస్తువు ఎంతో ఉదాత్తమైనదైనా స్థితుల అమరిక అవాస్తవికంగా అసంబద్ధంగా ఉంటే వస్తువు సరియైన ప్రకాశాన్ని పొందలేదు. మానవ జీవితంతోని అగాథాన్నీ విస్తృతినీ సూక్ష్మతనూ వైవిధ్యాన్నీ వైచిత్రినీ ప్రదర్శించే వివరించే విమర్శించే ప్రయత్న రూపం కాబట్టి, వస్తువులోని అంతర్యాన్ని యథార్థంతో సహేతుకంగా ఆవిష్కరించేదిగా ఇతివృత్తం ఉండటం అవసరం.

నవల చదివాక మొత్తం మీద సారభూతంగా సాధారణగుణంతో సార్వజీననమైన వస్తురూపం గోచరించాలి. సరియైందనిపించాలి. గొప్ప రచనలో వస్తువులో అవకాశం గల పార్శ్వాలన్నీ బయటతీసి చూపే విధంగా, విభిన్న కోణాల నుండి సమాలోచిత మౌతూ, ఇతివృత్తం యోజిత మవుతుంది. ఈ విధంగా వస్తువుకూ ఇతివృత్తానికీ గల సంబంధం బలమైంది. వస్తువు విస్తరణరూపమే ఇతివృత్త పరిణామం. దీని ఐక్యతారూపమైన కేంద్రీయ విషయమే వస్తువు. మానవజీవితానికి సంబంధించిన సత్యాన్ని బింబించే వాస్తవమైన ఆలోచనా రూపం, పాత్రపరంగా ఆవిష్కృతమౌతుంది. కథలో పాత్ర ఎదుర్కొన్న సమస్యకూ ఏర్పడే పరీక్షకూ సంబంధించి ఉంటుంది. వస్తువుకూ పాత్రకూ గల సంబంధమూ స్వల్పమైంది కాదు. ఒక విధంగా వస్తువు ఉన్మీలనంలో వికాసంలో పాత్ర ఆధారభూతమైంది. ఇతివృత్త పరిణామంతో పాత్రచిత్రణంలో వస్తువుకు సంపూర్ణమైన ఆకృతి వస్తుంది. కథలోని నైతికమైన విలువలూ, అభిప్రాయాలూ, సిద్ధాంతాలూ ప్రకటిత మయ్యేందుకు వీలౌతూ, వస్తువుకు దీప్తిని చేకూరుస్తాయి. దీనిలో వస్తువు ఎంతో అర్థవంతంగా శక్తి వంతంగా మూర్తికడుతుంది.

వస్తువు ఒక్కొక్కపుడు నవల పేరులో సూచితం కావచ్చు. ఒక భాగంలో విస్ఫుటంగానో, లేదా మొత్తం మీద పర్యవసాన రూపంగానో స్ఫూర్తి కట్టవచ్చు. ఇది సాంఘిక రాజకీయ నైతికమైన అనేకాంశాల పరస్పర ప్రభావ భాసురంగా

రూపొందుతుంది. వస్తువు ఎన్నికలో దాన్ని నిపుణంగా మలచి ఆవిష్కరించడంలో ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ రచయిత వ్యక్తిత్వం స్ఫూర్తికి రాకమానదు.

వస్తువులో సంఘర్షణ చాలా సాధారణంగా ఎంతో స్థూలంగానూ సూచనాత్మకంగానూ ఉంటుంది. ఇదే ఇతివృత్తంలో అనేకమైన సంఘటనల పరంపరతో – పాత్రల ప్రవర్తనా రీతులతో అనేకమైన పార్శ్వాలను సంతరించుకుంటుంది. కథలో సంఘర్షణ ఏదో ఒక విధంగా ఉండాలి. అట్లా ఉన్నప్పుడే ఉత్సుకత నిలుస్తుంది. అభిలాష పెంపొందుతుంది. ఈ సంఘర్షణ 1) వ్యక్తికీ వ్యక్తికీ మధ్య 2) వ్యక్తికీ బాహ్య శక్తులకూ మధ్య 3) వ్యక్తికీ అంతరంగానికీ మధ్య జరుగుతుంది. ఇది వస్తువులో బీజ భూతంగా నిక్షిప్తమై ఆకర్షణీయంగా ఉంటుంది. ఇదంతా చెప్పడం ఎందుకు జరిగిందంటే, ఇతివృత్త నిర్మాణం, పాత్ర చిత్రణం రెండూ ఎంతటి ప్రధాన లక్షణాలైనా, ఇవి వస్తువు నుండి ఉద్గమించేవీ, వస్తువులో ఒదిగి పోయేవీ, అని సూచించడం కోసమే. వీటిని గురించి యోజనమూ చిత్రణమూ పట్ల శ్రద్ధ చేత వస్తువుకు అసాధారణమైన గౌరవం లభిస్తుంది. వస్తువు, మానవుల్ని గురించీ జీవితాల్ని గురించీ సాధారణమైన ప్రకటనం మాత్రమే.[1] ఇతివృత్తం చేతనో లేదా పాత్ర చేతనో ప్రేరణపొంది, కేవలం శిల్ప దృష్టితోనే సాగే వస్తువుకు అనుకున్నంత ప్రాధాన్యం లేని నవలల్లో, వస్తువు సుప్తంగా ఉంటుంది. సూక్ష్మంగా నిక్షిప్తమై ఉంటుంది. ఇందులో వస్తువు వెంటనే స్ఫుటంగా కన్పించనంత మాత్రాన వస్తువు లేకుండా ఉండదు. గొప్ప రచయితలందరూ జీవితాన్ని గురించి ఆలోచన చేసినవారే ఎన్నో జటిలమైన సమస్యలను సూక్ష్మసూక్ష్మంగా పరిశీలనం చేసి వివేచనతో వాటి పరిష్కారం అన్వేషించే ప్రయత్నమూ జరిపారు. ఇక్కడి నుండి రచయిత అభిప్రాయాలూ సిద్ధాంతాలతో దర్శన శక్తి నుండి "జీవితతత్త్వం" అనే లక్షణం ప్రవర్తిస్తుంది. వస్తువులో దీనికి కావలసిన కేంద్ర బిందువులుంటాయి. ఇందులో సాధారణమైన నవలకు సంబంధించిన వాస్తవమైన ప్రతిపాదనం ఉంటుంది. జీవిత తత్త్వంలో దీని ఆధారంగా ఉత్పన్నమైన సమస్య దాని పరిష్కారం వివరింపబడుతుంది. నవలా రచనకు జీవితమే వస్తువు, ఈ ప్రపంచమే ఆధారం.

1. Theme is simply a statement about human beings or about life - Anatomy of Novel.



# 4. ఇతివృత్తం

ఇతివృత్తం అంటే పరస్పరమూ సంబంధం గల సంఘటనల పరంపరా రూపం. ఇది కథలో సంఘర్షణ మరియు మానసికమైన ఒత్తిడులతో (స్తంభనం టెన్షన్‌తో) కూడింది. ప్రధానపాత్ర తన కష్టాల నుండి బయట పడే అన్వేషణలో అనుసరించే మార్గంగానూ నిర్వచితమైంది.[1] సంఘర్షణ అనేది కథలో ఎక్కడపడితే అక్కడ రచయిత ప్రవేశపెట్టేది కాదు. దీని స్థితి పాత్రల ప్రవర్తనలతో ఏర్పడుతుంది. కథానిర్మాణమే ఇతివృత్తం అని సంప్రదాయగతంగా వస్తూన్న నిర్వచనం.[2] ఇతివృత్తం చిన్న చిన్న కథాభాగాలతో, ఉపకథలతో, సంఘటనలతో నిర్మితమై ఉంటుంది. దీన్ని జర్మన్ సాహిత్యంలో 'కంపోజిషన్' అనీ, రష్యన్ సాహిత్యంలో 'మోటివేషన్' అనీ అంటారు. కథ మొత్తం మీద లేదా విడదీయదగిన ప్రతి ముఖ్యమైన భాగం లేదా విషయం విడివిడిగా ఒక ఇతివృత్తం కలిగి ఉండవచ్చు. అయితే అన్నీ కలిసి వస్తువు (థీమ్)లో సమైక్యస్థితిని పొందుతాయి.

జీవితంలో ఎదుర్కొనే సంఘర్షణలో వ్యక్తి ఏ విధంగా ప్రతిక్రియ నెరపుతున్నాడు? ఎట్లా పరిణామం చెందుతున్నాడు? ఆ క్రమం ఏమిటీ? పరిణామం ఏమిటి? చివరకు పరిణత స్థితి కెట్లా చేరుకుంటున్నాడు? ఎదుగుతున్నాడా? పతనమవుతున్నాడా? అనే అంశాలు నవలలో ఇతివృత్తంలో ప్రస్తుతమౌతాయి. సంఘర్షణ స్వరూపం వ్యక్తి శీలం చేత నిర్ణీతమౌతుంది. మానవుల విభిన్న మానసిక స్థితులూ వాళ్ళ అభిలాషలు ఉద్దేశం సంఘర్షణలో రూపొందే అనేక సంఘటనలతో ఇతివృత్తం ఒక క్రమరీతి (డిజైన్)ని పొందుతుంది. సూక్ష్మంగా పరిశీలిస్తే దేని తీరు దానిదే. పాత్ర ప్రమేయం లేకుండా ఏ సంఘటనకూ ఆకృతి లభించదు. ఇతివృత్తంలో

1. Plot can be defined as a series of connected incidents all filled with tension and conflict that path of a lead character takes in his search for a way out his difficulties.

- William C. Khott - The Craft of Fiction

2. A narrative Structure of the play, tale or novel has traditionally been called plot.

సంఘర్షణకు ఉద్దేశం, పర్యవసానం అనేవి రెండు ముఖ్యమైన అంశాలు. ఇవి పాత్రను ఆశ్రయించకుండా రాణించలేవు. ఇతివృత్తానికీ పాత్రకూ గల సంబంధం చాలా సన్నిహితమైంది. ఇ.యమ్. ఫాస్టర్ ఇతివృత్తానికన్నా పాత్రకు ప్రాధాన్యం ఇస్తాడు. హెన్రి జేమ్స్ ఇతివృత్తానికీ పాత్రకూ మధ్య అంతరాన్ని పాటించడు. నవలను గురించి సాహిత్య విమర్శ ఎక్కువౌతున్న కొద్దీ కథావస్తువు – ఇతివృత్తం, పాత్ర చర్యల మధ్య భేదాన్ని విశ్లేషిస్తూ చాలా సూక్ష్మసూక్ష్మంగా వివేచనచేయడం కన్పిస్తుంది. ఇతివృత్తమూ, పాత్ర చర్య అనేవి పరస్పరం పోషకాలుగా ఉంటూ నవల అవయవైక సంపూర్ణరూపానికి దోహదం చేస్తూనే, ఒక్కొక్కటీ తమ ప్రత్యేకతను నిలుపుకొనే ధోరణిని కలిగి ఉంటాయి. మంచి నవలలో ఇవి చక్కని గుర్తింపును పొందడమూ గమనించవచ్చు.

ఇతివృత్తం అనేది కథలో యోజితమైన కొన్ని సంఘటనల క్రమ రూపం. ఇందులో కథన శిల్పం వర్ణనం వ్యాఖ్యానం వాతావరణ కల్పనం వదిలేసి కథకు ప్రధానమైన యోజనా రూపం మాత్రమే గ్రహింపబడుతుంది. ఇందులో ప్రధానమైన పాత్ర ఆలోచనా ధోరణి వ్యక్తం కావచ్చు. కథలో ఏం జరిగేది దీన్ని బట్టి చెప్పవచ్చు. అంటే కథలోని గమనం స్పష్టంగా కన్పిస్తుంది. ఇతివృత్తానికి ఆరంభం మధ్య సమాప్తి అనేవి ఉంటాయి. పాత్ర జీవితానికీ మూడు దశలు పుట్టుక మధ్య చివర ఉంటాయి. ఈ పద్ధతి సర్వసాధారణమైంది. ఇది పురాతన ఐతిహాసిక నిర్మాణసూత్రాన్ని జ్ఞాపకం చేస్తుంది. ఆధునిక కాలంలో కొత్త కొత్త సంవిధాన మార్గాలచేత ఈ క్రమంలో ఎన్నో మార్పులు తీసుకొని రావడం జరిగింది.

ఇతివృత్తాన్ని శరీర రూపానికి అస్థిపంజరం వలె నవలకు ముఖ్యమైందిగానూ, జీవం స్పందించడానికి అవసరమైన మృత్తికగానూ కొందరు విమర్శకులు భావించారు. కాని ఇతివృత్తం స్థూలమైన నిర్మాణరూపం మాత్రమే కాదు. అనేకమైన అంశాలతో సంబంధం కలిగి ముఖ్యంగా పాత్ర వైఖరి సంఘటన స్థితి అభిప్రాయంచేత పుష్టమౌతూ, రచనలో అవసరమైన దాన్ని మొత్తం మీద ప్రత్యంక్షగానో పరోక్షంగానో అనుభవానికి రావడానికి సహకరిస్తూ, తన అస్తిత్వాన్ని భావింపజేసే స్వరూపం కలదిగా స్థాపితమైంది. ఇందులో 1) అనేక సంఘటనల పరంపరలు రచయిత రచనా ప్రణాళిక ననుసరించి అవసరమైన క్రమంలో ఉంటాయి. 2) కాలాన్నీ లేదా హేతువునూ ఆశ్రయించిన



గమనం ఉంటుంది. 3) దీనికి మొదలు మధ్య చివర ఉంటుంది. 4) వివిధ భాగాలుగా పర్యాప్తమై ఉన్నా (ఇతర అంశాల సంబంధం చేత) అవయవ సమాపూర్ణమై ప్రత్యేకంగా గుర్తింపదగిన రూపాన్ని కలిగి ఉంటుంది. 5) రచనలో సమైక్యస్థితిని నిలిపే ఆధార నిర్మాణ రూపాన్ని పొంది ఉంటుంది.

## II

నవలలో, పాత్ర, చర్య, ఆలోచన, అనే అంశాల సమన్వయ కథా నిర్మాణరూపం ఇతివృత్తంలో బాగా కన్పిస్తుంది. కథలో గమనం వల్ల కాలం యొక్క ప్రసక్తి తప్పనిసరిగా ఉంటుంది. ఒక సమయంలో సంఘటన జరగాలి. ఒక చోట పాత్ర ఉండాలి కాబట్టి కాలంతోపాటు స్థలమూ సూచితమవుతుంది. లేదా ఈ విధంగా కాలమూ స్థలమూ ఇతివృత్తంలో ప్రసక్తమవుతాయి. దీని పరిశీలనం నవలలో మరో లక్షణానికి దారితీస్తుంది. అది కాలం స్థలంతో పాత్ర ఏవిధమైన సంబంధం కలిగిందీ. ప్రవర్తించేదీ, ప్రభావాన్ని నెరపేదీ తెలియజేస్తుంది. ఒక లక్షణం మరో లక్షణానికి సరిస్తూ అనుబంధంతో అన్నీ పరస్పరం అక్కడక్కడా కలుస్తూపోతాయి. ఒక అల్లిక ఏర్పడుతుంది. నవల సమగ్ర రూపంగా ఆవిష్కృతం కావడం జరుగుతుంది. మానవుల కార్యకలాపాల చిత్రణల్ని ప్రభావితం చేసే దిశలో "ఉద్దేశమూ" ఆలోచనల్ని ప్రసరింపచేస్తుంది. ముందు ఏమి జరుగుతుంది? పాత్ర ఎదుర్కొనే సమస్య ఏమిటి? అది ఎలా ఆవిష్కృతమౌతుంది? అనేవి తెలుసుకోవాలనే ఉత్సుకతను ఇతివృత్తం నిలపగలగాలి. పాత్ర అనుభవానికి వస్తూ కార్యరూపం ధరిస్తూ పోయే అనేకమైన సంఘటనల క్రమ నిర్మాణ రూపానికి ఆధారం ఇతివృత్తం అవుతుంది. ఇది రెండు విధాలుగా యోజితం కావచ్చు.

ఒకటి కాల క్రమం రెండు, హేతుక్రమం. 1) కాల క్రమంలో కథలో జరిగే అనేక సంఘటనలు వరుసగా పరిణమించే కాలం క్రమంలో యోజితమైన గతి స్వరూపాన్ని కలిగి ఉంటాయి. మొదటి నుండీ తరువాత ఏమి జరుగుతుందో నన్న అభిలాషను అంకురింపజేసే లక్షణమూ కలిగి ఉంటుంది. పూర్వకాలపు నవలల్లో సాధారణంగా అవలంబించే విధానం ఇది. 2) హేతు క్రమంలో – కథలో జరిగే

సంఘటనలు, ఆ వెనుక నున్న హేతువు ననుసరించి ఏర్పడే క్రమంలో యోజితమై గతిస్వరూపాన్ని పొందుతాయి. ఒక విషయం తరువాత మరో విషయం హేతు సహితమైన శిల్ప దృష్టితో ప్రవృత్తం కావడంలో ఏమి జరుగుతూందన్నదే కాకుండా, ఇట్లా ఎందుకు జరుగుతూందన్న ఆలోచననూ ప్రభవింపజేస్తుంది. ఇంకా ఏమి జరుగుతుందో నన్న సందేహంతో పాటు దీనికి కారణమూ వివరణమూ ఇతివృత్తానికి ఆలోచనా స్థాయిని కలిగిస్తాయి. పూర్వా పరక్రమం; మారడంతో ఇతివృత్త నిర్మాణంలో తెలిసిన దారిలోనే పోకుండా, కొత్త దారులలో చేకూరిన నవ్యత, ఆకర్షణీయమైన రూపాన్ని సిద్ధింపజేస్తుంది. కథలో ఏమి జరుగుతుందో నన్నదే లేకపోతే ఉత్సుకత ఉండదు. ఎందుకు జరుగుతుందన్నదే లేకపోతే ఆలోచన లేదు. నవల విశిష్టంగా కొత్త పద్ధతిలో నిర్మితం కాకపోతే ఆకర్షణ కోల్పోతుంది. కార్య కారణ సంబంధంతో పాత్రల చర్యపై దృష్టితో సంఘటనల్ని యోజనచేసే విధానం, శిల్పం దృష్ట్యా ఉన్నతకోటికి చెందిందే. దీన్ని విజయవంతంగా నిర్వహించడానికి రచయితకు కథా గమనం పైన, పాత్ర చర్యల పైన సంపూర్ణమైన ఆధిపత్యం ఉండాలి. ఇంకా తను తీసుకవెళ్ళే దిశ గురించి స్పష్టమైన అభిప్రాయం నిశ్చయమైన లక్ష్యం కలిగి ఉండడంతో పాటు, నేర్పు కూడా ఎంతో అవసరమవుతుంది.

బలమైన ఇతివృత్తం పాఠకులను అభిలాషలో ఆలోచనలో ఆకర్షణలో ఉంచడమే కాకుండా కథను ఒక ప్రణాళికా రూపాన్ని ఇస్తుంది. విశిష్టమైన మార్గంలో ఉంచుతుంది. దీని వల్ల నవలకు బాహ్య నిర్మాణంతో పాటు అంతరమైన వ్యవస్థ కూడా రూపొందుతుంది. ఒక్కొక్క విధమైన నవలలో ఇతివృత్తం ఎంతో ప్రాముఖ్యం వహిస్తుంది. ఒక సమస్యను తీసుకున్నప్పుడు, కొందరు వ్యక్తులు ఆధారంగా ప్రత్యేక పరిస్థితుల చిత్రణంతో దానికి అనుకూల్యం, ప్రాతికూల్యం గల సామాజిక స్వరూపం అవసరమవుతుంది. ఇతివృత్తానికీ ప్రాబల్యం కలుగుతుంది. పాత్ర అనేక జ్ఞాపకాలను పురస్కరించుకొని, వెనుకటి కథ చెప్పడం, స్వీయ చరిత్రాత్మకం లేఖలు డైరీలు ఆధారంగా ఇతివృత్తం నిర్మాణంలో వైవిధ్యాన్ని సంతరించుకుంది. కొంత భాగం కాల క్రమం మరికొంత భాగం హేతు క్రమం ఆవలంబించి అవసరమైన చోట్ల ఇతివృత్తంలో విశిష్టతను ప్రదర్శించడమూ ఉంది. ఇవన్నీ నవల గురించి విశ్లేషణ పరిధిలో,



వివేచన వల్ల మరింత అభివృద్ధిని సాధించడానికీ ఉపకరిస్తాయి. ఎన్ని మాటలు చెప్పనా ఇతివృత్తం గురించి, అన్నీ ప్రయాణని కవసరమైన మార్గాన్ని చూపించే పటం వలె వివరణం వలె ఉపయోగపడతాయన్న అభిప్రాయంలో కొంత వాస్తవం లేకపోలేదు. అయితే ప్రయాణం మొదలు పెట్టగానే అప్పటికప్పుడు ఎదురయ్యే పరిస్థితుల్ని బట్టి అవసరమైన మార్పులు జరగవచ్చు. కొత్తవి చోటుచేసుకోవచ్చు. రచయిత వీటిని ఉపయోగించుకొనే తీరును బట్టి నిర్వహించే సామర్థ్యాన్ని బట్టి ఆకర్షణ చేకూరుతుంది. ప్రభావం కలిగి ఉంటుంది. ఒక స్థాయిలో శక్తిమంతంగా రూపొందుతుంది. ఈ విషయంలో రచయితకు ఎంతో స్వేచ్ఛ ఉంది. ఇది ఒక్కొక్క నవలలో ఒక్కొక్క విధమైన ఇతివృత్త నిర్మాణాన్ని పొందే అవకాశాన్ని కలిగిస్తుంది.

## III

ఇతివృత్తాన్ని విమర్శకులు పలు విధాలుగా వర్గీకరించారు. ఒక విధంలో మొదటిది, ఇతివృత్తనిర్మాణంలో ఐక్యతాసూత్ర బట్టి రెండు రూపాల్లో ఉండవచ్చు. 1) సాధారణం 2) మిశ్రమం – అనేవి

1) సాధారణం (సింపుల్)లో ఇతివృత్తం కొన్ని పంక్తుల్లో సంగ్రహించడానికి వీలుగా పాత్ర అనుభవాలు సంఘటనలతో వరుసగా సూటిగా చిత్రితమౌతాయి. ఇది ఒక కథతోనూ లేక రెండు లేదా అంతకన్న ఎక్కువ కథల సమాహారంగానూ ఉండవచ్చు. 2) మిశ్రమం (కాంపౌండ్)లో ఇతివృత్తాన్ని వెంటనే సంగ్రహించడానికి వీలులేకుండా ఎన్నో పాత్రల అనుభవాలు సంఘటనలు రచనలో హేతుదృష్టితో ప్రత్యేక క్రమంలో యోజితమౌతాయి. అక్కడక్కడా చెదరి ఉన్నట్లు కన్పించే వివిధ భాగాలు ఐక్యతా సూత్రం చేత ఒక చోట నిబంధింపబడి నవల సమగ్రతను కలిగి ఉంటుంది. మధ్య మధ్య ఎన్నో స్వతంత్రమైన అంశాలు ప్రవేశిస్తూ ఉంటాయి. రచయిత వీటిని నవల మొత్తం మీద దృష్టితో సమభావంతో నిర్వహించవలసి ఉంటుంది. ఇందులో ముఖ్యంగా ఇతివృత్తంలోని వివిధ భాగాల మధ్య, దేని కది విడివిడిగా ఉన్నట్లు అనిపించకుండా సంయోజనంలో సమన్వయ స్థితి స్థాపితం కావాలి. ఇది రచయిత కళాదృష్టినీ నైపుణ్యాన్నీ ప్రదర్శిస్తుంది.

మరో విధంలో, కథకు సంబంధించిన ముడి పదార్థాన్ని ప్రణాళిక కవసరమైన యోజనచేసే పద్ధతిని బట్టి రెండురకాలుగా ఇతివృత్తాన్ని విభజించవచ్చు – 1) విశ్లథం 2) సమైక్యం – అనేవి.

1) విశ్లథం (లూజ్) – ఎన్నో అవసరమైన సంఘటనలు పరస్పరం అంతగా సంబంధంలేనివి అనేకమైన ఉపకథలతో యోజితమవుతుంది. నవలలో కథాసమైక్యతకు చెందిన చర్యలపై ఆధారపడకుండా, కేంద్రస్థానీయంగా ఒక వ్యక్తిపై ఆధారపడి ఉంటుంది. అక్కడక్కడా ప్రధాన కథతో సంబంధలేని అనేక సంఘటనలు ఉపకథలు, ఒక చోట నాయకునికి కట్టివేయబడతాయి. ఇతివృత్తం సర్వమూ ఒకే పాత్రను ఆశ్రయించి ఉంటుంది. అక్కడక్కడా ఆసక్తికరంగా ఏదో సంబంధం ఉన్నట్లు కన్పించవచ్చు కాని మొత్తం మీద ఒక సమన్వయ స్థితి లోపిస్తుంది. ఒక వికీర్ణ స్థితినీ విశ్లథత్వాన్నీ తలపిస్తుంది. ఒక దృశ్యం మరో దృశ్యానికి దారితీస్తూ, పాత్రలు ఒక దానిని మరొకటి క్రాస్ చేస్తూ, ఇతివృత్త నిర్మాణం బలహీనంగా రూపొందుతుంది. ఇందులో రచయిత ముందుగానే అంతా సిద్ధం చేసుకొని, పర్యవసానాన్ని కూడా నిర్ణయించుకొని, తన అభిప్రాయాని కభిముఖంగా సర్వమూ పరిణమింపజేసే ప్రయత్నం స్పష్టంగా కన్పిస్తుంది.
2) సమైక్యం (ఆర్గానిక్) – అక్కడక్కడా ఉన్న ఉపకథలు సంఘటనలు సహజంగా ఉంటాయి. సముచితంగా ప్రవేశ పెట్టబడతాయి. ఇది అవసరం మేరలలో యోజితమై ఇతర పాత్రల చర్యలతో సమైక్యస్థితిని కలిగి ఉంటాయి. వివిధ పాత్రలు ఉండవలసిన స్థితిలో ఉనికిని కలిగి ఉంటాయి. నవల మొత్తం మీద అమరికలో హేతుయుతంగా సావయువ సంపూర్ణంగా ఇతివృత్త నిర్వహణం ఉంటుంది. హేతు సమన్వయం చేత అవయవ సమగ్రతను పొంది రచన కళాత్మకంగా రూపొందుతుంది. వీటిలో సామాన్యం లేదా సాధారణం, విశ్లథం అనేవి సూక్ష్మ పరిశీలనలలో మాత్రమే అందుతాయి. మిశ్రమం, సమైక్యం అనేవి విశేష వివేచనలో మాత్రమే దృష్టికి వస్తాయి.

ఇతివృత్తాన్ని సాంఘికం, పౌరాణికం, రాజకీయం, అనీ విభజించడమూ ఒక పద్ధతి. నార్త్‌రోప్‌ఫ్రై విమర్శకుడు కథలో ప్రత్యక్షమయ్యే నాయకుని బట్టి, దేవతలూ ఉన్నత ప్రకృతి గల మానవులూ, సామాన్య మానవులూ, అధమ ప్రకృతిగల నాయకులూ



కల ఇతివృత్తాలుగా విభజించాడు. ఇంకా మోదాంత, విషాదాంతం అనీ పూర్వం నుండీ వాడుకలో ఉన్నది. ఉంది. ఒక్కొక్క కాలంలో ఒక్కొక్కరు తమ దృష్టిని బట్టి అనేక విధాలుగా సృజన రూపాన్ని విశ్లేషించారు. ఇవి నవలపై ఉత్తమ విమర్శకు ఎంతగానో దోహదం చేసాయి.

## IV

పాత్ర, చర్య, ఆలోచన ప్రధానంగా, నార్మన్‌ఫ్రైడ్‌మాన్ మొదలైన విమర్శకులు ఇతివృత్తాన్ని మూడు విధాలుగా విశ్లేషించడం జరిగింది. 1) పాత్ర ప్రధానమైనవి 2) చర్య ప్రధానమైనవి 3) ఆలోచనా ప్రధానమైనవి.

పాత్ర (క్యారెక్టర్) ప్రధానమైన ఇతివృత్తంలో పాత్ర ప్రముఖంగా కన్పిస్తుంది. మంచి కోసం పాత్రలో మార్పు వస్తుంది. పాత్ర ఆలోచనలో మొదటి నుండీ మార్పు కనుగుణంగా సంస్కార లక్షణం రూపొందుతూ ఉంటుంది. ఉదాత్తమైన ఆశయాలు నెరవేరడానికి ముందుగా క్లిష్ట పరిస్థితిలో జరిగే పరీక్షలకు తట్టుకొని విజయాన్ని సాధించడం జరుగుతుంది. ఒక్కొక్క పాత్ర ఆశయాలు, ఆశలు కూలిపోవచ్చు లేదా ఆ తరువాత ఏదో మార్పు వచ్చి కొత్త జీవితం ఆరంభం కావచ్చు. ఇందులో అవాంతర భేదాలను బట్టి 1) పరిణతం 2) పరీక్షాత్మకం 3) సంస్కరణం 4) ప్రక్షీణం అనీ నాలుగువిధాలుగా ఉంది.

చర్య లేదా క్రియా (ఏక్షన్) ప్రధానమైన ఇతివృత్తం – సర్వసాధారణంగా పూర్వం నుండీ వస్తూన్న ఇతివృత్త స్వరూపమే ఇది. కథలో తరువాత ఏమి జరుగుతుందన్న అభిలాషను కలిగించేదిగా ఉంటుంది. ఇందులో పాత్రగతమైన ఆలోచనకు తక్కువ అవకాశం ఉంటుంది. చర్యకు ప్రాధాన్యం కలిగింది. ఆలోచన ఉండదని కాదు. ఇది చర్యను ముందుకు నడిపించగలిగినంత మాత్రంలో కనీసపు అవసరాలకు తగినట్లుగా ఉంటుంది. ఇందులో అనుమానం, నిరీక్షణం ఆశ్చర్యం లక్షణాలతో మౌలికమైన విషయం లేదా సమస్య చుట్టూ ఇతివృత్తం వ్యవస్థీకృతమౌతుంది.

ఇందులో అవాంతర భేదాలను బట్టి – 1) కారుణ్య 2) శిక్షా 3) విషాద 4) ప్రశంసా 5) అనురాగం అనీ – ఇందులో క్రమంగానో లేదా హఠాత్తుగానో పాత్ర పరిస్థితిలో సంపూర్ణమైన మార్పు వస్తుంది. పాత్ర ప్రవర్తనం ఆలోచనారూపం చేత ఒక నిశ్చయరూపాన్ని పొందుతుంది. ప్రభావితమూ ఔతుంది. ప్రధాన పాత్ర వెనుక నుండి నైతిక శీలం చేపట్టే చర్య చేత ప్రేరితమవుతుంది. స్పష్టమైన ఆవిష్కారాన్ని పొందుతుంది.

ఆలోచన (థాట్) ప్రధానమైన ఇతివృత్తంలో ఆలోచన లేదా భావనలో మార్పును కోరే ఆశయం, అభిప్రాయం, సిద్ధాంతం ప్రపంచితమౌతుంది. ఇది ఇటీవల బాగా ప్రసిద్ధిలోకి వచ్చింది. ఒక సమస్యకు పరిష్కారం పాత్రలో నిశ్చితమైన ఆలోచనా ప్రపంచంతో నిర్దిష్టమవుతుంది. వ్యక్తి లేదా సమాజం శ్రేయస్సు దృష్ట్యా దీని తీరు తీర్చబడుతుంది. పాత్ర ప్రవర్తనలో చెప్పుకోదగిన మార్పు ఉండదు. పాత్రథోరణి ఒక్కొక్కపుడు విపరీతంగానూ ఉండవచ్చు. ఇతి చింతనా ప్రధానంగా, లక్ష్య నిర్దేశకంగానూ ఉంటుంది. ప్రధాన పాత్రలో వచ్చే మార్పు, పరిణామం ఆలోచనా ప్రపంచానికి దోహదం చేసేదిగా ఇతివృత్తం నిర్మితమౌతుంది. ఇందులో అవాంతర భేదాలను బట్టి నాలుగు విధాలు – 1) విజ్ఞానాత్మకం 2) సత్యప్రకాశనం 3) ప్రభావ శీలం 4) నిరాశామయం. సాహిత్య విమర్శలో

ఈ వివేచనం ఇతివృత్తాన్ని చాలా నిశితంగా పరిశీలించి ఉత్తమ విమర్శ చేత ఆలోచనా పరిధిని పెంచేందుకూ, అనుభూతి సాంద్రతకు అవకాశమిచ్చేందుకూ, తోడ్పడుతుంది. ఉన్నదానిపై అభివృద్ధిని సాధిస్తూ సాహిత్య ప్రమాణాల్ని కాపాడుతూ నవలా సమాలోచనకు బాగా ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. వీటిలో చర్య ప్రధానమైన ఇతివృత్తానికే చాలా మంది ప్రాముఖ్యం ఇవ్వడం జరిగింది. ప్రతి మంచి నవలలోనూ ఇతివృత్తానికి ప్రధాన పాత్రతో విడదీయరాని సంబంధం స్పష్టంగా గుర్తించవచ్చు. ఇతివృత్తంలో పాత్ర అనుబంధంతో చర్య మూడు దశలుగా పరిణమిస్తుంది. 1. ఆరంభం (బిగినింగ్ లేదా రైజింగ్) 2. పతాక (క్లైమాక్స్) 3.



సమాప్తి (ఎండ్ లేదా ఫాలింగ్) ఇవన్నీ నిర్వహణ శిల్పంలో భాగాలుగా ఏర్పడతాయి. ఇతివృత్తంలో ఒక క్రమమైన సుస్థితిని సాధించడానికి చర్య – పాత్ర –ఆలోచన మూడిటి సంపూర్ణమైన సహయోగం అవసరం. రచయిత ఆశయాన్ని బట్టి రచనలో ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేకతతో ప్రముఖంగా కన్పించడం సహజం.

## V

ఆధునిక యుగంలో పత్రికా ప్రపంచం నవల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుంది. సీరియల్ నవలలు విరివిగా వస్తున్నాయి. సీరియల్ నవలలో పతాక స్థానాలు ఎక్కువగానే ఉంటాయి. ప్రతి వారమో పక్షమో నెలకో దశలు దశలుగా ప్రకటిత మయ్యేవి, అప్పటప్పటికి ఆశ్చర్యాన్ని లేదా ఔత్సుక్యాన్ని నిలుప గలిగే అంశంతో అగి, పాఠకుల్ని ఆరాటపెడుతూ ఉండవలసి ఉంటుంది. ఏదో సమస్య ఉత్పన్నం కాబోవడమో, ఉన్న సమస్యను గురించిన ఆలోచనతోనో అనిశ్చితమైన స్థితితోనో అనుకోని మలుపు తిరిగే స్థితి రావడమో, ఏదో మరొకటి మరొకటి జరుగుతూ పోతూ ఉంటుంది. వచ్చే సంచిక దాకా పాఠకు డెదురు చూస్తూ ఉండేట్లు ఉంటుంది. ప్రతి సంచికలో కాకపోయినా నవలలో చాలామార్లు ఈ విధంగా ఉండకపోతే సీరియల్‌లో ఆకర్షణ ఉండదు. సీరియల్‌కు ఉద్దేశించి వ్రాసినదానికి, ఉద్దేశించనిదానికీ కొంత భేదం ఉంటుంది. ఇంకా కావాలనీ, వేరే ఇతర కారణాలను పురస్కరించుకొనీ, ఆయా ప్రకాశకులు పత్రికల కోరికపైనో ప్రచారం కోసమో మధ్యలో పాఠకుల అభిప్రాయాలను మన్నించేందుకో, వారి అభిప్రాయాన్ని సేకరించి లేదా పసిగట్టి, కథ ఏవిధంగా మలపులు తిరిగితే బాగుంటుందో ఆవిధంగా ఇతివృత్త నిర్మాణంలో మార్పులు జరగడమూ అప్పుడప్పుడూ తటస్థిస్తుంది. ఇది ఇట్లా ఉండగా నవలలో ఇతివృత్తాన్ని సినిమా తీయడానికి వీలుగా తెరపై చాక్షుషమైన (విజువల్) ఆవిష్కారానికీ అనుగుణంగా వ్రాయడానికీ రచయితలు ప్రయత్నిస్తున్నారు. దీనికి ఆకాలంలో చెలామణిలో ఉన్న రీతుల్ని అవలంబించడం జరుగుతూంది. కొన్ని సందర్భాల్లో పుస్తక రూపంలో ఇవి చదువుతూంటే, మధ్య మధ్య చిన్న చిన్న అఖాతాలతో శూన్య స్థితులతో మనం

సమాధానపడలేని ధోరణి స్ఫుటంగా కన్పిస్తుంది. నవలలో అనేకమైన మనో భావాల స్పందనల్ని కలిగిన, పాత్రల చర్యలతో అప్పటికి తగిన భాషారూపంలో ఇతివృత్తం నిర్మితమౌతుంది. ఇది సినిమాతో చాక్షుషమైన భావరూపాల (విజువల్ ఇమేజస్)తో ఎక్కువగా సాధింపబడుతుంది.

సాధారణ నవలలో రచయిత దృష్టి ప్రసారం వేరుగా ఉంటుంది. ఇతివృత్తం ప్రవాహ రూపంలో ఉంటుంది. ఇతర మాధ్యమ సాధనాల సహాయంతో సినిమాలోనయితే ఇదే ఖండఖండాలుగా దర్శనమిస్తుంది. ఇందువల్ల సినిమాకు కావలసిన ఇతివృత్త రచన తీరు వేరు. నవలలో దీని పరిణామ స్వరూపం వేరుగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో గొప్ప నవలలు వాటి విశిష్ట లక్షణం చేత సినిమా తీయడానికీ తగినవిగా ఉండక పోవడం గమనించవచ్చు. సినిమా తీయాలంటే దాన్ని ఎంతో మార్చవలసి ఉంటుంది. ఇతివృత్తంలో ఈ మార్పులు ఒక్కొకపుడు అసలు నవలకు భిన్నంగా పరిణమిస్తాయి. తెలుగులో 'ఏకవీర' నవలను ఈ సందర్భంలో గుర్తుచేసుకోవచ్చు. 'వెదరింగ్ హైట్స్'ను సినిమా తీసే ప్రయత్నం జరిగింది. యథాతథంగా విజయాన్ని సాధించలేక పోయింది. విక్టర్ హ్యూగో వ్రాసిన "లేమిజరబుల్స్" నవల సినిమాలో చాలా కత్తిరింపులకూ మార్పులకూ గురి అయింది. శరత్ నవల దేవాదాసు – ఎందరో ఎన్నో మార్పులతో తీసారు. పత్రికా రంగం, సినిమారంగం నవల రచనలో ఇతివృత్త నిర్మాణంలో కొంత మార్పును తీసుకొని వచ్చాయన్న విషయమే ప్రస్తుతాంశం. పూర్వం నవలలో ఇతివృత్తం సూటిగా తీర్చిన సంఘటనలతో, పాత్రల అనుకోని మలుపులతో, అక్కడక్కడా ఆశ్చర్యకరమైన విశేషాలతో నిర్మితమయ్యేవి. మధ్య మధ్య ఏర్పడే ఒడుదుడుకులు విషమ స్థితులు సర్దుకొని, సమస్యలన్నీ చక్కబడి, చివరకు మంచికి గెలుపు లభించడం జరిగేది. ఈనాడు ఏది మంచి? ఏది చెడు? అనే ప్రశ్నకు సమాధాన మివ్వడం అంత సులభం కారు. సామాజిక ఆర్థిక రాజకీయ వైయక్తిక మనస్తత్వ పరమైన అనేకాంశాలను హేతు దృష్టితో పరిశీలించడం చేత నిర్ణయం చేయవలసి ఉంటుంది. సంప్రదాయదృష్టికి ఒక విధంగా తోస్తే, పరివర్తనా దృష్టికి మరో విధంగా తోస్తుంది. ఇది స్థూలంగా మాత్రమే. ఇంకా పాత్ర చిత్రణం మొదలుగా సూక్ష్మమైన అంశాలెన్నో దృష్టికి వస్తాయి. ఈ కారణంగా ఎప్పటి కప్పుడు ఇతివృత్త నిర్మాణంలోనూ ఎన్నోవిషయాల సమీకరణాల్లో నిష్పత్తుల్లో భేదాల వల్ల అనేక రూపాలు ఉదయిస్తాయి. వస్తువును ఎన్నుకోవడం, దాన్ని యోజనచేయడం, అది తీసుకొనే మలుపులు, పర్యవసానం, రచయిత దృక్పథాన్ని బట్టి కొత్తదనాన్ని అన్వేషించే ధోరణి ప్రబలుతోంది. ఇవి నవల పరిణామ చరిత్రలో పేర్కోదగిన అంశం.



ముఖ్యంగా రచయిత అభిప్రాయాలూ సిద్ధాంతాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇతివృత్త గమన వైఖరిపై ఎంతో ప్రభావాన్ని నెరపుతాయి. పాత్ర చర్య వల్ల ఇతివృత్తం విధ్వంసకంగానో నిర్మాణశీలంగానో రూపొందవచ్చు. అయితే ఇతివృత్తంలో మౌలికమైన అభిప్రాయానికి భిన్నంగా ఏదీ మధ్యలో చేర్చకూడదు. రచయిత సంఘటనలను స్థితులను ఎన్నుకోవడమే కాకుండా వాటిని ఆకర్షణీయమైన క్రమంలో కూర్చవలసి ఉంటుంది. ముఖ్యమైన దానితోపాటు అవాంతర సంఘటనలు, హేతుబద్ధంగా పరస్పర ప్రభావ జనకంగా తీర్చినపుడే ఇతివృత్తానికి సమగ్రత సిద్ధిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రచయిత ఏదో విధంగా పనికట్టుకొని లాక్కొనిపోతూన్న భావన రాకూడదు. ఇది తప్పనిసరి అయిందీ సహజమైందీ, సముచితమైందీ అన్న అభిప్రాయమే కలుగుతూ పోవాలి. ఇది ఖండ ఖండాలుగా కాక మొత్తం మీద ఏర్పడి ఉండటానికి కళాదృష్టి అవసరం. ఈ విషయంలో రాజీ పడే ప్రశ్నలేదు. జీవితానుభవం రోజు రోజుకూ జిజ్ఞాసాత్మకంగా ఎంతో వైవిధ్యోపేతంగా విస్తృతి చెందే నేటి సమాజంలో, రచయితలో ఆధునిక దృష్టిలో అన్వేషణాతత్పరతతో ప్రయోగ నైపుణి పెరుగుతూంది. కొత్త పార్శ్వాలతో ఇతివృత్తం రూపొందుతూంది. ఇది రచయిత ప్రత్యేకంగా శ్రద్ధ వహింపదగిన ప్రధాన లక్షణాల్లో ఒకటి.

# 5. పాత్ర స్వరూపం

అక్షర రూపంలో జీవింజే వ్యక్తుల రూపాలే నవలలో పాత్రలు. బహిర్ అంతర్ వ్యక్తిత్వ దర్శనమే పాత్ర చిత్రణం. నిత్య జీవితం నుండి ఉద్గమించిన వాస్తవ స్వభావ రేఖలతో స్పందిస్తుంది. అక్కడక్కడా ఎంతో కల్పన చోటుచేసుకోవడమూ జరుగుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ మానవీయ సంబంధాలను కాపాడుతూ జీవిత యథార్థాన్ని ప్రతిఫలింప చేయడం దీని లక్షణం. రచన చదువుతూంటే పాత్రల మనస్తత్వం, ప్రవర్తనం, ఆదర్శం పట్ల ఎంతో అభిలాష కలుగుతుంది. వాటి చర్య అనుచర్య ప్రతిచర్య ఉద్దేశం ప్రయోజనం పట్ల ఆసక్తి పెరుగుతుంది. కొన్ని పాత్రల్ని ప్రేమిస్తాం, మరికొన్నిటిని ద్వేషిస్తాం. ఒకే పాత్రను ఒకప్పుడు గుండెకు హత్తుకొని, మరొకప్పుడు తీసిపారేయవచ్చు. ప్రపంచంలో వ్యక్తుల పట్ల కలిగే అభిప్రాయమే నవలలోనూ పాత్రల గురించి ఏర్పడుతుంది. వీటి అడుగు నుండి ఎన్నో వలయాల్లో శ్రేణులు శ్రేణులుగా యథార్థ సదృశమైన మానవ జీవితం నిర్మితమౌతుంది. ఈ నిర్మాణాల పరిశీలనం అంటే మానవ జీవిత భాగాలతో పరిచయం చేసుకోవడమే.

ప్రపంచంలో వ్యక్తు లెన్ని విధాలో, పాత్రలూ. అన్ని విధాలుగా ఉంటాయి. దీనికి కల్పన కొంత జోడింపబడుతూ కొత్త రూపాన్ని పొందడమూ జరుగుతుంది. నవల చదివాక ఇతివృత్తంతో పాటు జ్ఞాపకం ఉంచుకోదగిన పాత్రల్ని సృష్టించడం సామాన్యం కాదు. మన స్మృతి పథంలో నిలిచిపోయి, సంభాషణలో ఏదో ఒక సందర్భంలో ప్రసక్తికి వచ్చేంతగా కొన్ని పాత్రలు ప్రసిద్ధిచెందుతాయి. పాఠకుని మనస్సు పాత్ర ప్రభావానికి గురికావడం రచయిత ప్రతిభకు ఒక్కటే గీటురాయి. మంచి పాత్రా? చెడు పాత్రా? అనేది వేరే ప్రశ్న. ఇది మంచి పాత్ర, ఇది చెడు పాత్ర అని విభజించడాన్ని ఆధునిక విమర్శకులు అంగీకరించరు. ఇటువంటి భావాన్ని కలిగించే పాత్ర చిత్రణం, రచయిత పాక్షికమైన వైఖరినీ, ఒక్కొక్కప్పుడు పలాయన మనస్తత్వాన్నీ ప్రకటిస్తుందని ఒక అభిప్రాయం. జీవితంలో ఇది మంచి ఇది చెడూ అనే నిర్ణయం జీవిత పథాన్ని నిర్దేశిస్తుంది కాబట్టి, ఈ విభజన తిరస్కరణీయం కాదని సమర్థించే వారి అభిప్రాయం. అభిప్రాయ భేదా లెట్లా ఉన్నా నిజ జీవితంలోనూ ఎన్నో విషయాల్లో సులభంగా



నిర్ణయాలు చేసి, గీతలు గీసినట్లు మంచినీ చెడునూ విభజించి ఏర్పాటు చేయడం కుదరదు. ఇట్లా చూడ వలసిందీ కాదు జీవితం. ఒక దృక్పథాన్ని బట్టి ఏర్పరచుకొన్న కొన్ని విలువల్ని బట్టి, కొన్ని పరిమితుల్లో ఒదిగిపోవడం జరుగుతుంది. ఆ దృక్పథాన్నీ విలువల్నీ ప్రశ్నలకు గురిచేసినపుడు పరిమితులు పెరిగినపుడు వస్తుంది చిక్కు. పాత్రల మంచి చెడుల నిర్ణయంతో ప్రమేయం లేకుండా రచయిత పాఠకులకే నిర్ణయాన్ని వదిలి వేయడం సమంజసమన్న శిల్పదృష్టి, నేటి సాహిత్య లోకంలో బాగా వ్యాప్తిలో ఉంది. తాననుకొన్న "మంచి" పేరుతో ఒక పాత్రను పైకెత్తడం, కొన్నిటిని కిందికి దించడం. "చెడు" పేరుతో తక్కువచేయడం కన్నా రచయిత వివిధ పాత్రల మధ్య ఒకదానితో మరొకటి పనిచేసే తీరులో చర్య, అనుచర్య ప్రతిచర్యను పురస్కరించుకొని సంఘర్షణను నిలుపుతూ, సమగతిని కాపాడుతూ, హేతుయుతంగా సమానదృష్టి కలిగిన జీవిత చిత్రణకు ప్రయత్నించవలసి ఉంటుంది. ఇది సముచితమైంది.

లోకంలో మంచి చెడు సత్యం అసత్యం ధర్మం అధర్మం విషయంలో ఒక నిర్ణయానికీ రావడ మంత సులభం కాదు. దీని వెనుక నున్న పరిస్థితుల ప్రాబల్యం, పైకి తెలీని రహస్యాలు, అదుపులేని అవ్యక్త చైతన్యం, ఇతర పాత్రల ప్రవర్తనం, ప్రతివర్తనం, అనుకోని దిశల్లో పని చేస్తాయి. ఈ కారణంగా రచయిత పాత్ర చిత్రణంలో ఏదో స్థూలమైన నిర్ణీతమైన అభిప్రాయం కన్నా సూక్ష్మ సూక్ష్మంగా వివేచన చేసి యథార్థాన్ని ప్రకాశమానం చేసే దృష్టినీ, సమభావాన్నీ రచయిత అలవరచుకోవడం వల్ల పాత్రకు న్యాయం జరిగే అవకాశం ఉంది. అపుడే నవల జీవితానికత్యంత సన్నిహితంగా ఉంటుంది. ఎట్టి పరిస్థితిలోనూ సహజత్వాన్ని కోల్పోదు. ఏ పాత్రకు ఆ పాత్ర ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో జీవిస్తుంది.

మానవ జీవితం ఎంతో సంక్లిష్టమైంది. నవలలో దీని ప్రతిఫలనం అనివార్యం. మనిషిలోని స్పర్థ, ఆశ మొదలైన లక్షణాలచేత ఆలోచన ప్రవర్తనం నిరంతరం అనేకమైన మార్పులకు లోనవుతూ ఉంటుంది. జీవితం ఎప్పుడు ఏ మలుపు తీసుకునేదీ నిశ్చయంగా చెప్పడం కష్టం. ఇది వ్యక్తికీ వ్యక్తికీ భేదిస్తుంది. ఒకే వ్యక్తి ఆలోచన, ప్రవర్తన వివిధ సందర్భాల్లో భిన్న భిన్నంగా ఉండవచ్చు. ఏవో కొన్ని సూత్రాలు నిర్దేశించి, అందులో నిబంధించిన ఆదర్శరూపాన్ని చూపడం కుదరదు.

సామాజిక రాజకీయ పరివర్తనం వల్ల ఎంతో కాలంగా నెలకొని ఉన్న విలువల్లో మార్పు వచ్చింది కొత్త దృక్పథం ఏర్పడింది నవలల్లో పాత్రచిత్రణకు సంబంధించిన ఆలోచనా వైఖరిలో ఎంతో మార్పు వచ్చింది. దీని వివేచనతో పాత్రలో కలిగే వివిధ సమ విషమ గతుల్ని చిత్రించడంతోపాటు, పాత్రలో నిలకడకు భంగం వాటిల్లే పరిస్థితినీ నిరోధించవలసి ఉంటుంది. ఇది పాత్ర చిత్రణలో రచయిత బాధ్యతను స్మరింపజేస్తుంది.

జీవితం గురించి ఎంతో పరిశీలనతో ఎన్నిక చేసి నిర్మించిన అనేక విషయాల సంకలన రూపమే పాత్ర. ఇది ఒక తీరులో శిల్పం చేత యోజితమై వ్యక్తిత్వంగా ప్రకాశిస్తుంది. నిజ జీవితంలో మనకు ఆసక్తి లేనివీ, ఇష్టంలేనివీ వదిలేస్తాం. ఇక తెలీనివి సరేసరి. నవలలో తప్పనిసరిగా అన్నీ చదవవలసి ఉంటుంది. దీనితో అనుభవంలోకి రాని అంశాలపై ఆలోచనకు ఉపక్రమించడ జరుగుతుంది. సాధారణమైన విషయాలు మొదలుకొని ప్రత్యేకాంశాల దాకా విస్తృతమై ఉంటుంది. ఎంతో విస్తృతమైన జీవిత క్షేత్రం ఒక ఖండ బింబంగా వివిధ పార్శ్వాల్లో మన ఎదుట సాక్షాత్కరిస్తుంది. పాత్రల రూపంలో తోటి మానవుల్ని గురించి ఎంతో తెలుసుకుంటాం. ఈ స్థితిలో మనకు సాధారణంగా కన్పించే పాత్రలు కేవలం వ్యక్తులుగానే కాక, అర్థవంతమైన అనుభవ పరంపరతో, మనలో కొత్త ప్రపంచాన్ని చూపిస్తాయి. వ్యక్తులతో లేని పరిచయం వీటితో ఏర్పడుతుంది. పాత్ర సహజత్వాన్ని కోల్పోకుండా విశేషస్ఫూర్తితో జీవితాన్ని పోలిన స్థితి చిత్రణం అనుభవంలోకి రావడానికి రచయిత పాత్ర చిత్రణను జాగ్రత్తగా నిర్వహించవలసి ఉంటుంది. ఏ ఏ చర్యల ఒత్తిడివల్ల ఏఏ పాత్రలు ప్రభావానికి గురిఅయ్యేదీ గుర్తిస్తూ మరీ ముందుకు సాగాలి. దీనికి చర్యకు అవసరమైన పరిసరాలు, పరిస్థితుల కల్పనం బాగా ఉపకరిస్తాయి.

నవలలో కథాప్రణాళికను బట్టి పాత్ర పరిమితులు నిర్ణీతమౌతాయి. కొన్ని పాత్రల్ని ఇష్టం వచ్చినట్లుగా సంచరిస్తూ, మరి కొన్ని పాత్రల్ని బలవంతంగా దృష్టి పథంలోనే లేకుండా తప్పించే ప్రమాదం జరగకూడదు. రచనలో వాటి స్థానం ప్రయోజనాల్ని బట్టి యోజితమయితే మంచిది. రచయిత ఎంత తటస్థ వైఖరి అవలంబించినప్పటికీ అతని సిద్ధాంతాలు అభిప్రాయాలు పాత్ర మలపులపై



స్థూలంగానయినా ప్రభావం నెరపకుండా ఉండజాలవు. ఇది నవలలో ఉద్దేశక్షేత్రానికి సంబంధించిన పరిధిలోకి వస్తుంది. దీనిలోనూ సహజత్వం అవసరం. ఈ స్థితి వేరు. రచయిత కావాలని పాత్రలో చొరబడి, జోక్యం చేసుకోవడం వేరు. పాత్రను తన ఇష్టం వచ్చినట్లు దాన్ని వ్యక్తిత్వం లేకుండా కుదించి, లేదా పెంచి నడపడం వేరు. రచయిత ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహిస్తేనే, చెదరని జీవిత వాస్తవంతో సహజమైన పాత్రలు ప్రభావోపేతంగా అవతరించే అవకాశం ఉంది. నవల అనేది ఎంతో ఆలోచన, అనుభవంతో చరిత్రలో అనేక ప్రస్థానాల సమాహారభూతమైన సామాజిక సంస్కృతీదశలను ఏదో ఒకవిధంగా దర్శించే అవకాశం కలిగింది. అందువల్ల వ్యక్తిత్వ చిత్రణంలో సామాజిక దృష్టి అవసరమవుతూంది. గొప్పనవల్లో పాత్రచిత్రణలో వైయక్తికమైన పరిధి నధిగమించిన సామాజిక దర్శనం ప్రకాశిస్తూ ఉంటుంది. ఇది వాస్తవ ప్రపంచంతో నిర్దేశితమైన జీవిత దృక్పథంతోనూ కన్పిస్తుంది. ఈ విషయం అట్లా ఉంచి, ఇటీవల వైయక్తికపరిధిలో సాధారణ జీవిత చిత్రణంతోపాటు మనస్తత్వపు లోతుల్లోకి దృష్టి ప్రసరించటంపై అధికమైన శ్రద్ధ కన్పిస్తుంది. ఈ అంశాలు రచనలో సృజన శక్తితో పాటు శిల్ప దృష్టితోనూ విస్తృతమైన అవకాశాలతో రాణించడాన్ని గమనించవచ్చు.

## II

నవలలో పాత్ర రచయిత మాటలతో పరిచయం కావచ్చు. సంఘటనలో పాత్రవర్తనం సంభాషణల ద్వారా ఆవిష్కృతమవుతుంది. పాత్రకు నవలలో ఒక క్రమ పరిణామ రూపం ఉంటుంది. ఇది ప్రత్యేకమైన సందర్భాల్లో హఠాత్తుగానూ, సాధారణంగా దశ దశలుగానూ లేదా కొన్ని మలుపులతోనూ వికాసాన్ని పొందుతుంది. ఈ 'హఠాత్తు'కు వెనుక ఎంతో బలమైన హేతువు ఉండాలి. ఇది సంఘటనల క్రమంలో అమరి ఉంటుంది. దీనిలో చకితం చేసే ఆశ్చర్యం, స్తంభింపజేసే టెన్షన్, ఉంటుంది. దశలుదశలుగా వికాసానికి వెనుక ఎంతో విస్తృతమైన సంఘటనల క్రమం దీర్ఘమైన కాలంపై పరచబడి ఉంటుంది. ఇందులో ఎప్పటికపుడు తొలగిపోయే ఆశ్చర్యం, సడలిపోయే టెన్షన్, కొంత విరామంతో అందుకుంటూ సాగుతాయి. ఒక ప్రవాహరూపంలో కథ ప్రసరిస్తూ ఉంటుంది.

నవల విజయం పాత్ర సృష్టిపై చాలా భాగం ఆధారపడి ఉంటుంది. రచయిత ఎంత గొప్పవాడైనప్పటికీ అతని ఇష్టానిష్టాలను బట్టి కాక, పాత్ర స్వతంత్రంగా స్వయం వ్యక్తిత్వంతో ఆవిష్కృతం అయినప్పుడే, విశిష్టతను కలిగి ఉంటుంది.[1] ఈ నవలలో పాత్ర స్వరూపం ఏమిటి? ఎట్లా ప్రవర్తిస్తోంది? ఇతర పాత్రలతో సంబంధా లెట్లా ఉన్నాయి? ఏవిధంగా మారుతున్నయి? ఏ ఏ సమస్యలను ఎదుర్కొంటూంది? వాటి ప్రత్యేకత ఏమిటి? ఇట్లా ఎందుకు జరిగింది? ఎట్లా పరిష్కరిస్తోంది? ఈ విధంగా అనేకమైన ప్రశ్నలు పాత్ర గురించి పాఠకుని మనస్సులో నిశ్శబ్దంగా సంచరిస్తాయి. నవల వ్రాసేప్పుడు రచయిత మనసులో జరిగే ప్రక్రియ, మరో విధంగా పాఠకుల మనస్సులోనూ జరుగుతుంది. ఇది ఆ క్రమంలో ఉండదు. పాఠకుల్ని బట్టీ బహువిధాలుగా భేదిస్తుంది. అందువల్ల పాత్ర చిత్రణం మొదటి నుంచీ చివరిదాకా అనేక సంఘటనల్లో పరిస్థితులతో ఇతివృత్త నిర్మాణంలో భాగమై పరిణతిని పొందుతూ ఉంటుంది. బహుముఖమైన విశిష్టతను సంతరించుకుంటూ మనలో ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను ఆ ప్రశ్నల వెనుక నుండి రూపొందింపజేస్తూ ముందుకు సాగుతుంది. అంతటా వాస్తవికతను నింపుకొని అనుభవంతో స్పందించవలసి ఉంటుంది. పాత్రకు సంబంధించిన గతిలో వేగం తగిన విధంగా కాపాడబడాలి. ఇది మరీ ముఖ్యం. దీన్ని గురించి ఆలోచన చేస్తే పాత్రకూ సంఘటనల క్రమానికీ గల సంబంధం విదితమౌతుంది. హెన్రీ జేమ్సు మాటల్లో "పాత్ర అంటే ఏమిటి? సంఘటనల నిర్ధారణం. సంఘటన అంటే ఏమిటి? పాత్ర ప్రకాశనం."[2] పాత్ర ఏదో ఒక సంఘటనతో ప్రమేయం కలిగి ఉంటుంది. నవలలో ప్రతిచర్య ముందు ఏం జరుగుతూందన్న ఉత్సుకతను నిలపాలి. ఇది పాత్ర చిత్రణలో ఆలోచన మొదలుకొని ప్రవర్తన దాకా పర్యాప్తమైంది.

1. "Character must make its own kind but not of our kind" Keanth Brook - Understanding Fiction

2. "What is Character?
The determination of Incident
What is Incident?
The determination of Character" - Henry James.



పాత్రను ఆశ్రయించి ఎన్నో స్మృతులు, ఆలోచనలు అనుభవాలు ఉంటాయి. ఇవి బాహ్యామైన ప్రవర్తనా గతంగా మానసికమైన స్థితి సమర్పకంగా తీర్చే విధంలో పాత్ర వ్యక్తిత్వం మూర్తి మత్వాన్ని పొందుతుంది. చర్య అనేది పాత్ర నిహితమైన అనేక సంఘటనలను పురస్కరించుకొని సాగుతుంది. ఎన్నో చర్యలు వివిధ స్థాయిల్లో పరిక్రమిస్తూంటాయి. వివిధ సంఘటనల స్థితుల సమాశ్లిష్టమైన క్రమ రీతుల్ని బట్టి గమనంలో వైచిత్రి ఏర్పడుతుంది. వివిధ సందర్భాల్లో సాదృశ్యంగానూ, సమంగానూ వ్యత్యస్తంగానూ విషమంగానూ సంకీర్ణంగానూ సంశ్లిష్టంగానూ అనేక విధాలుగా సాగుతుంది. జీవితంలో వలెనే సంతోషం ప్రక్కనే విషాదం, ఎత్తు ప్రక్కనే పల్లం, గుణం వెంటనే దోషం వివిధ రీతులతో ఒక్కొక్కపుడు అనూహ్యామైన పరిణామాలకూ దారి తీయడం జరుగుతుంది.

మనస్తత్వపరంగానూ మానవజీవితం యొక్క బహు పురాతనమైన పురా రూపాల (అర్కిటైప్సు) ప్రసారమూ సామూహిక అవ్యక్త చేతన లోతులు స్పృశిస్తూనూ విలసిస్తుంది. ఎన్నో అసాధారణమైన సంక్లిష్టమైన మానసిక స్థితులు రచయితకు తెలిసీ తేలీకుండా విచిత్రమైన సంఘటనలతో అనుభవ యాథార్థ్యాన్ని ఆశ్రయించిన పాత్ర వ్యక్తిత్వం నిర్మితమవుతుంది. అందువల్ల పాత్ర చర్యకూ ఇతివృత్తానికీ గల సంబంధం చాలా సన్నిహితమైంది. పాత్ర ఎదుర్కోవలసినవి, అయితే సంఘర్షణ (కాన్ఫ్లిక్ట్), స్తంభన (టెన్షన్). సంఘర్షణ ఉన్నంతవరకూ స్తంభన ఉంటుంది. సంఘర్షణ నుండి బయటపడటంలో పాత్ర వ్యక్తిత్వాన్ని పొందుతూ ఉంటుంది. ఒక విధంగా సంఘర్షణ తప్పదన్నమాట ఇది విజయవంతంగా జరగడంలో పాత్ర ఉన్నతికి చేరుకుంటుంది.

సంఘర్షణ 1) మానవుడు తోటి మానవులతో ఉండే సంబంధాలలో విభేదాలను పురస్కరించుకొని ఉండవచ్చు. ఇది సమాజపరమైంది. 2) వ్యక్తిలో జరిగే అలజడిలో అంతస్సంఘర్షణ (ఇన్నర్ కాన్క్లిఫ్ట్)కు చెంది ఉండవచ్చు. ఇది మనస్తత్వపరమైంది. పాత్రలో అవ్యక్తంగా జరిగే సంఘర్షణ కారణంగా అనుకోకుండా విపరీత పరిస్థితి ఏర్పడవచ్చు. సామాజికమైన వైయక్తికమైన మనోభావాలు పాత్రలో వివిధ పార్శ్వాలలో బహిర్గతమవుతూ, పాత్రల్ని నడిపించే శక్తి కలిగి ఉంటాయి,

ఫ్రాయిడ్, ఎడ్గర్, యుంగ్ మనస్తత్వ పరిశోధనల వల్ల రూపొందించిన సిద్ధాంతాల ప్రభావమూ, వాటి ననుసరించిన వివేచనమూ – పాత్ర చిత్రణకు మనస్తత్వపరంగా బాగా దోహదం చేసాయి. 3) మానవుడు భౌతికమైన ప్రకృతిని ఎదుర్కోవలసి వచ్చిన అనేక సంఘటనలకు సంబంధించి ఉండవచ్చు. ఈ సందర్భంలో ఒక్కొక్కపుడు రచనలో ప్రతీకాత్మకంగానూ రూపొందవచ్చు.

ఈ విధంగా ఇతివృత్తంలో అనేక సంఘటనల పరంపరలో నిక్షిప్తమైన గతిక్రమం పాత్ర చేత స్థితిని పొందుతూ, చర్య చేత వేగవంతమౌతుదన్న విషయం స్పష్టమౌతుంది. ఇతివృత్తానికీ పాత్రకూ గల సంబంధం ఇటువంటిది. 1) ఇతివృత్తం ప్రధానమైనవీ 2) పాత్ర ప్రధానమైనవీ 3) అభిప్రాయం ప్రధానమైనవీ – అని నవల విభజనం మూడువిధాలుగా జరిగినప్పటికీ ఇతివృత్తం, అభిప్రాయం ప్రధానమైన నవలల్లోనూ పాత్రకు సముచితమైన స్థానం ఉండనే ఉంటుంది. లేకపోతే కథకు నిశ్చయమైన గమన వైఖరి సిద్ధించదు. లక్ష్యానికి కేంద్ర స్థానమూ ఉండదు. ఇది బలమైన పాత్ర చిత్రణం వల్లనే చేకూరుతుంది. ఇ.ఎమ్. ఫాస్టర్ ఇతివృత్తం కన్నా పాత్రకే నవలలో అగ్రస్థానం ఇవ్వడం, ఈ సందర్భంలో గుర్తుచేసుకోవచ్చు. ఫాక్‌నర్ పాత్ర గురించి చెబుతూ సాధారణంగా తన నవల పాత్రతో మొదలౌతుందనీ, ఒకమారు పాత్ర తన కాళ్ళపై నిలబడి కదలటం మొదలుపెట్టగానే, తాను దాని వెనుక కాగితం పెన్సిలు తీసుకొని అది చెప్పేదీ చేసేదీ వ్రాస్తూ పోవడమే తన పని అంటాడు.[3]

ఇతివృత్త పరిణామంలో కొందరు వ్యక్తులు, వారి స్వభావాలు, మనోభావాలు, ప్రవర్తనలు, ఉద్దేశాలు, కలిసీ ఒక పరిస్థితిని సృష్టిస్తాయి. ఇది పరస్పరం ఆకర్షణ వికర్షణ ప్రభావాలతోనూ పరస్పరం వ్యతిరేకగుణాలతోనూ ఏర్పడిన స్వరూపం చేత సంఘటనకు సంఘర్షణనూ, స్తంభననూ చేకూరుస్తాయి. ఈ సంఘటనల నుండి క్రమించేటప్పుడు రచనలో పాత్ర వ్యక్తిత్వంలో వివిధ పార్శ్వాలనూ లోతునీ ఉన్నతినీ, అన్నిటినీ మించి రామణీయకతను సంతరించుకుంటుంది. ఇతివృత్తానికి పాత్ర అనివార్యమైంది. పాత్రకు ఇతివృత్తం అవశ్యకమైంది. నవలలో పరస్పరమూ

3. “It begins with a Character ..... all I can do is to treat along behind him with a paper and pencil” - Faulkner.



సమాశ్రయంతో యోజితమౌతాయి. పాత్ర నుండి ఇతివృత్తానికీ, ఇతివృత్తం నుండి పాత్రకూ అనేకమైన అనుభవ సంఘటనల ప్రభావ పరంపర ప్రసరిస్తూ ఉంటుంది. రచయిత సిద్ధాంతాలతో అభిప్రాయాలతో లేదా జీవితాని కివ్వ దలచుకొన్న విలువలతో పాత్ర చేతనే ఆ లక్ష్యానికి దారితీయడం జరుగుతుంది.

## III

పాత్ర చిత్రణం స్థూలంగా నవలలో రెండు విధాలుగా ఆవిష్కృతమౌతుంది. 1) ప్రత్యక్షం లేదా విశ్లేషణాత్మకం. 2) పరోక్షం లేదా – నాటకీయం.

1) ప్రత్యక్షంలో రచయిత పాత్రను నేరుగా వర్ణిస్తూనో వ్యాఖ్యానిస్తూనో చిత్రిస్తాడు. పాత్ర ఆలోచనలను అనుభవాలను స్పష్టంగా వివరిస్తాడు. అపుడపుడూ సాధికారకంగా నిర్ణయాలను ప్రకటిస్తాడు. రచయితకు పాత్రపై విశ్వాసం లేకపోవడం వల్ల ఈ విధంగా జోక్యం కల్పించుకొని తన వ్యక్తిత్వాన్ని ఆపాదిస్తాడని విమర్శకుల అభిప్రాయం. రచయిత వైయక్తికమైన ప్రభావం ఏమాత్రం లేకుండా ఉండదు. కాని పాత్ర వ్యక్తిత్వాన్ని పూర్తిగా మింగేసేదిగా, ఉండకూడదు. ఇందులో స్పష్టత ఎక్కువ. అన్నీ వివరించడానికి రచయిత తొందర పడతాడు. దీన్ని నియమించుకోవలసి ఉంటుంది. లేకపోతే కళాత్మకతకు భంగం వాటిల్లుతుంది. ఈ నవలలో పాఠకుడు నవల చదివేప్పుడు ఆ సందర్భంలో పాత్ర పొందే ఆలోచనకూ ఆవేశానికీ అనుగుణంగా ఉండకపోవచ్చు. అక్కడక్కడా పరోక్ష పద్ధతికీ ప్రవేశం లభిస్తూ ఉంటుంది. కాని దీనికి ప్రాముఖ్యం అంతగా ఉండదు.

2) పరోక్షంలో రచయిత తాను దూరంగా ఉంటూ పాత్ర తనంతటతాను ఆవిష్కృతమయ్యేందుకు ఎక్కువ అవకాశం ఇవ్వడం జరుగుతుంది. ఇది కథనంలో సంభాషణం ద్వారానూ, ప్రవర్తన వల్లనూ జరుగుతుంది. రచయిత జోక్యం లేకపోవడం వల్ల పాత్ర స్వేచ్ఛగా ప్రవర్తిస్తుంది. వెనుక నుండి అనుకోకుండా లేదా అభిప్రాయ స్థాపనంలో రచయిత స్వరం సన్నగా విన్పిస్తే విన్పించవచ్చు. కాని సహజమైన పాత్ర గతికి అవరోధం కాకూడదు. ఈ తటస్థవైఖరివల్ల పాత్ర అన్నివిధాలా స్వతంత్రమైన

వ్యక్తిత్వంతో పుష్టమౌతుంది. రచయిత చేసే వివరణం, వ్యాఖ్యానం ఏమీ లేకపోవడం వల్ల కేవలం పాత్రల సంభాషణ ప్రవర్తనబట్టి వాటి స్వరూప స్వభావాలు భావించవలసి ఉంటుంది. ఇందులో నాటకీయత కెక్కువ అవకాశం ఉంది. స్వీయచరిత్రాత్మకం, లేఖావళి నవలల్లో పాత్రల ప్రమేయం తక్కువగా ఉంటుంది. నవలలో పై ఆవిష్కార విధానాల్లో దేని కది విడివిడిగా ఉండవచ్చు. తరచుగా ఏ రెండిటి సమ్మేళనమో గోచరిస్తుంది. ఏదో ఒక దానికి ఉండే ప్రాధాన్యం దృష్ట్యా ఆవిధానానికి సంబంధించిందిగా భావితమౌతుంది. దీనిలో పాత్రల చర్యలోని గమనం, కథనమూ, సంభాషణ సాగుతుంది. ఇవి విడిగానూ, రెండిటి కలయికతోనూ రూపొందిన లక్షణం పరిశీలనాయోగ్యమైంది. రాచకొండ విశ్వనాథశాస్త్రి అల్పజీవి నవలలో ఎక్కువభాగం అంతస్సంఘర్షణకు చెందిన పరోక్షవిధానం అనుసరింపబడింది. ఆధునికరచయితల్లో చాలా మంది దీనిపై ఎక్కువ మొగ్గు కలిగి ఉండడమూ గమనించదగింది. ఇది మనస్తత్వపరమైంది. శిల్ప దృష్టితో కాస్త కష్టమైందీ, సావధానత చాలా అవసరమవుతుంది.

ఇక నవలలో రచయిత ప్రమేయం గురించి ఆలోచిస్తే, ఎంతైనా పాత్ర స్వరూపం వెనుక నుండి రచయిత వ్యక్తిత్వం ఎంతో కొంత స్ఫుటం కాకుండా ఉండడం అసంభవం. అట్లాగైతే, రచయిత అభిప్రాయాలు, ఉద్దేశాలు, సిద్ధాంతాలు, ఏవిధంగా ప్రతిపాదితం కావడానికి వీలుందనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ కారణంగా ప్రత్యక్ష పరోక్ష పద్ధతుల సమన్వయాన్ని కాంక్షించేవారూ ఉన్నారు. ఒక అభిప్రాయం :- నాటకం కన్నా భిన్నమైన ప్రక్రియ నవల. దీని ప్రత్యేకత దీనికి ఉంది. దాన్ని రచయిత నిలపాలి. తనకు మధ్య మధ్య దొరకే తన భావాల్ని వివరించే అవకాశాన్ని ఉపయోగించుకోవడంలో దోషంలేదు. నాటకాన్ని దృష్టిలో పెట్టుకొని నవలను పరిశీలించకూడదు. కాకపోతే నవల వివిధ ప్రక్రియల్లోని కొన్ని కొన్ని లక్షణాల సమాహారంగా అవతరించిన స్వతంత్రమైన విశిష్టరూపం అనుకున్నా, ఆ లక్షణాలను ఎంత వరకో అంత వరకే, తగినవిధంగా యోచన చేసి, నవల మొత్తం మీద కళా భావనతో దానికదిగా వివేచించాలనేది ఒక అభిప్రాయం. రచయిత పాత్రకు వెలుపల



నుండి నిర్వహించడంలోనే అన్ని విధాల కళాత్మకంగానూ నవలకు ఉత్తమస్థాయి చేకూరుతుంది. దీనితో నవల మొత్తం మీద నేరుగా అభిప్రాయ స్థాపనకూ భేదం ఉందనే వారి సంఖ్య ఈనాడు ఎక్కువగా ఉంది. ఏ రచన ఐనా రచయిత వ్యక్తిత్వ ప్రభావం నుండి తప్పించుకోలేదు. అట్లా ఐతే దానికి ప్రత్యేకతలు గల సృజనాత్మకలక్షణమే పట్టదు. అన్నీ ఒక విధంగా మూసపోసినట్లు ఉండకూడదనే స్వతంత్రమైన స్థితి చేకూరాలనే! అభిప్రాయం వ్యాప్తిలో ఉంది. ఏదయినా సృజన రూపానికి స్థాయిని పెంచేదిగా, విలువల్ని చేకూర్చేదిగా ఉండాలనే అభిప్రాయంలో ఎవరికీ విప్రతిపత్తి ఉండకూడదు.

## IV

నవలలో పాత్రలు రెండువిధాలుగా ఉండవచ్చు. ఒకటి సామాన్యం (సింపుల్), రెండోది సంక్లిష్టం (కాంప్లెక్స్).

సామాన్యం (సింపుల్)లో పాత్ర మంచిదనీ చెడుదనీ స్థూలంగా వేరు చేయబడి ఉంటుంది. మంచికీ చెడుకీ మధ్య ఘర్షణ ఉంటుంది. చివరకు విజయం మంచికే లభిస్తుంది. ఈ మంచి అనేది అది వరకు ఏర్పడి ఉన్న కొన్ని సిద్ధాంతాలనూ విలువలనూ ఆశ్రయించి రూపొందుతుంది. ప్రధానమైన పాత్ర సర్వ సద్గుణ సంపూర్ణంగా తీర్చబడుతుంది.

సంక్లిషం (కాంప్లెక్స్)లో వ్యక్తి ఎంత గొప్పవాడైనప్పటికీ, ఏదో ఒక లోపం వల్ల క్లిష్టమైనస్థితిని పొందుతాడు. అతనిలో లోపాలు ఉంటాయి. అవి అతని పతనానికి దారితీస్తాయి. లేదా పెద్దచిక్కుల్లో పెడతాయి. ఈ లోపం ఏదైనా కావచ్చు. అందరినీ అనుమానించే గుణం అవచ్చు. ఎక్కువగా ఆలోచనల్లో కాలం గడుపుతూ క్రియాశీలం లోపించవచ్చు. క్రియాదక్షుడై ఉండి స్వయంగా ఆలోచనాలక్షణం లేకపోవచ్చు. ఏదో మూఢవిశ్వాసం కలవాడై, వివేచన లేక కావచ్చు. మరేదో ఇలాంటిదే అయి ఉండవచ్చు. ఒక్కొక్క సమయంలో స్వల్పమైందే అసాధారణమైన స్థితికి దారితీయవచ్చు. ఎన్నో చిక్కులెదురౌతాయి. మానవ జీవితంలో వలెనే దీనితో కథ అనూహ్యమైన

మలుపులు తిరుగుతుంది. కొత్త సంఘటనలు ఎదురౌతాయి. వీటిని ఎదుర్కొనే ప్రయత్నమూ జరుగుతుంది. దీన్ని బట్టి ఇతర పాత్రల ప్రవర్తనంలో మార్పు అనివార్యమౌతుంది. ఈ పరిస్థితుల్లో వివిధ పాత్రల చర్య – ప్రతిచర్య అనుచర్యలతో ఇతివృత్తంలో మెలగే పాత్ర సంక్లిష్టంగా రూపొందుతుంది. సామాన్యంలో కన్నా సంక్లిష్టంలో పాత్ర చిత్రణం విశేష స్థితిని పొందుతుంది. సామాన్యంలో బాహ్య వివరణ దృష్టి ఉంటే, సంక్లిష్టంలో ఆంతరమైన విశ్లేషణకు ప్రాధాన్యం ఉంటుంది.

నవలలో పాత్ర మరో విధంగానూ వర్గీకృతమైంది – 1) స్థిరమూ (స్టాటిక్) 2) క్రియాత్మకమూ (డైనమిక్).

స్థిరంలో పాత్ర మొదట్లోఉన్నట్లుగా చివరివరకూ చెప్పుకోదగిన ఏ మార్పూ లేకుండా ఉంటుంది. ఇది సామాన్యంలోని పాత్రకు దగ్గరగా ఉండేది.

క్రియాత్మకంలో పాత్ర ప్రవర్తనలో చెప్పుకోదగిన మార్పులు వస్తాయి. అవి చిన్నవీ కావచ్చు పెద్దవీ కావచ్చు. ఇవి ప్రభావాన్ని నెరపుతాయి. మార్పులు, చిన్నవైనా పరిణామాన్ని గుర్తించ గలిగిన స్థాయిలో ఉండాలి. అంటే నవలలో ఇవి దృష్టిని ఆకర్షించేవిగానే కాక కథకు చైతన్యాన్ని సంతరింపచేసేవిగా ఉండాలి. ఇది ఆ పాత్ర వర్తించే పరిధిలోనే జరుగుతుంది. పాత్ర ఎదుర్కొనే పరిస్థితుల వల్ల ప్రేరితమవుతుంది. సంప్రదాయ ధోరణికి భిన్నమైంది. పాత్ర ఎదుర్కొనే మంచి – చెడు స్థితుల పరిశీలనం వాస్తవ దృష్టితో జరుగుతుంది. దీని ప్రభావం చర్య, ప్రతిచర్యపై ఎంతో ఉంటుంది. ఈ సందర్భంలో కొంత మనస్తత్వ వివేచనమూ అవసరం ఔతుంది. ఇది సంక్లిష్టం – పాత్రకూ సమీపవర్తిగా ఉంది.

ఇ.ఎమ్. ఫాస్టర్ పాత్రను రెండు విధాలుగా విశ్లేషించాడు. మొదటిది – సమం (ఫ్లాట్) రెండోది – ఆవృత్తం (రౌండ్).

మొదటిదైన సమంలో పాత్ర స్వరూపం ఒకటి రెండు లక్షణాలతో సమ రేఖలో నిర్ణీతమైపోతుంది. ఇందులో ఆశ్చర్యంగొలిపే లక్షణంగానీ ప్రత్యేకంగా పేర్కోదగిన విశేషంగానీ అంతగా ఉండదు. ఉన్నప్పటికీ హేతువుకు నిలవదు. సమాధానపరచ



లేదు. పాత్ర నిర్మితిలో జీవితంలో ఏ హఠాత్ ఘటనలతో తిరిగే ఏ మలపులు లేకుండా, ఒక వేళ ఒకటి రెండు ఉన్నా సూటిగా ఉంటాయి. సులభంగా విప్పగలిగినవై ఉంటాయి. ఎత్తుపల్లాలులేకుండా ఉంటాయి. సమంగా ఏ విషమత లేకుండా ఉండటం ఇందులోని ప్రత్యేకత. పాత్ర నిర్వహణమంతా ఎక్కువగా రచయిత మాటల్లో సాగుతుంది. మధ్య మధ్య వ్యాఖ్యానిస్తూ, విశ్లేషిస్తూ, నిర్ణయం చేస్తూ పాఠకుల్ని రచయిత తాను కోరే దిశగా ప్రవర్తింపజేసే ప్రయత్నం స్పష్టంగా కన్పిస్తుంది. ఇది దాదాపు ప్రత్యక్ష పద్ధతికి దగ్గరగా భావించడానికి వీలైంది.

రెండోదైన ఆవృత్తం (రౌండ్)లో పాత్ర పరిణామం పేర్కోదగిందిగా ఆవృత్త స్థితిని పొందుతుంది. ఇది బహు ముఖాలతో పర్యాప్తమై ఉంటుంది. అనేక సంక్లిష్ట స్థితులతో కూడి ఉంటుంది. సంప్రదాయ ధోరణికి భిన్నమైంది. నాటకీయ లక్షణాన్ని పొందుతుంది. ఈ పాత్రలు ఆవృత్తత్వం లేదా వర్తులత్వం చేతనే జీవిస్తాయి. అంటే జీవితాన్ని బహు కోణాల్లో స్పృశిస్తూ పాత్ర మలుపులు తిరుగుతూ రూపొందే లక్షణం ఉంటుందన్నమాట. దీని గమనం లేదా ప్రసారం విశేష స్థితులలో కదలుతూ పోతుంది. పేర్కోదగిన వ్యక్తిత్వ రేఖలతో గుండ్రంగా (విశిష్టంగా) తిరగడం మొదలైన చోటికి వచ్చి చేరడం ఇందులోని ప్రధాన లక్షణం. కాబట్టి దీనికి రౌండ్ (ఆవృత్త) అనే మాట సార్థకమౌతుంది.

సమమైన పాత్రలు జీవితాన్ని స్పృశించవని కాదు. ఇది చాలా కొద్ది స్థలాలకు మాత్రమే పరిమితమై ఉంటుంది. రచయిత శక్తిని బట్టి దీని లోనూ ఎంతో సమర్థవంతంగా నిర్వహించే రచయిత ప్రతిభ చేత, ఈ పాత్రలు ఎంతో ఆకర్షణ పొందే వీలుంది. అవి మనస్సుపై చెరగని ముద్ర వేసి శాశ్వత స్థానాన్ని పొందడమూ ఈ సందర్భంలో గమనించవచ్చు. నవలలో సమం (ఫ్లాట్) ఆవృత్తం (రౌండ్) రెండిటికీ స్థానమున్నవీ గమనించవచ్చు. అయితే ఒక భేదం గుర్తించవలసి ఉంది. సమం కన్నా ఆవృత్తం వెంటనే ఆకర్షిస్తుంది. క్లిష్టమైన స్థితుల నుండి ఉద్గమించే విజయ శక్తిగా పాత్ర దీపిస్తుంది. సమ పాత్రను ఎంత దూరమైనా పొడిగిస్తూ పోవచ్చు.

ఆవృత్తం విషయంలో ఎంతబడితే అంత పొడిగిస్తూ పోవడానికి అవకాశం ఉండదు. ఇది తిరిగే మలపులతో కొత్త పార్శ్వాలను పొందుతూ కొత్త ఆకర్షణకు నిలయమౌతూ ఉంటుంది. ఇతివృత్తం వ్యాస పరిధిని బట్టి స్థితిగతి ప్రవృత్తమౌతుంది. ఒకటి రెండు కన్నా ఎక్కువ ప్రత్యేకతలతో మలుపులు తిరుగుతూ వలయాకారంగా వర్తిస్తుంది. చివరకు మొదటి చోటికి వచ్చి కలవడంతో పాత్రకు సంపూర్ణత సిద్ధిస్తుంది. ఈ రెండు విధాలూ సమాజంలో రెండు విధాలైన జీవిత రూపాల్ని సూచిస్తాయి. లోకంలో ఉన్నదే! వీటిలోనూ ఉన్నది.

## V

మానవ జీవితం ఎంతో విస్తృమైందీ. గహనమైందీ, వైవిధ్య విలసితమైందీ. మన చుట్టూ ఉన్న వ్యక్తులతో సంబంధాలవల్ల కలిగే అనుభవాలు, కొత్త కొత్త సంఘటనలకు దారితీస్తూ, ఎంతో ప్రభావాన్ని నెరపుతాయి. రచయిత వీటిని పరిశీలించి ఎన్నుకోవడం, తగినవిధంగా కూర్చుకోవడం, అప్పటి అవసరం, ఔచిత్యం బట్టి ఉంటుంది. బాహ్య దృష్టితో పాటు అంతర్దృష్టితోనూ చిత్రించే పాత్ర స్వరూపంలో సంక్షిప్తంగా ఎన్నో జీవితంలోని రహస్యాలు నిక్షిప్తమై ఉంటాయి. ఇవి లోక ప్రవృత్తితో సంవదిస్తూనే, విశిష్టమైన ధోరణిలో మనల్ని ఆకర్షిస్తాయి. రచయిత సృష్టించిన పాత్ర తక్కువ కాలంలో, మనకు ఎక్కువ జీవిత ప్రపంచాన్ని అనుభవంలోకి తెస్తుంది. ఎంత గొప్ప రచయిత అయినా, ఏ నవలలోనూ మానవుని గురించీ, అతని జీవితాన్ని గురించీ ఏ పాత్రలోనూ సర్వసంపూర్ణమైన రూపాన్ని ఇవ్వలేడు. ఒక్కొక్క రచయిత ఒక్కొక్క నవలలో ఎంతో కొంత భాగం మాత్రమే బింబింపజేస్తాడు. కొద్ది పరిధినీ, కొంత లోతునీ, కాస్త ఎత్తునీ మాత్రమే స్పృశించగలడు. ఎప్పటి కపుడు ఎంతో మిగిలే ఉంటుంది. ఆ చెప్పిందే చెప్పడం కాకుండా మిగిలిన దాన్ని ఆ తరువాత వచ్చే రయితలు ఆన్వేషించవలసి ఉంటుంది. దీనికి చివర అంటూ లేదు కాబట్టి, అన్వేషణలో తెలుసుకోదగిందీ, చెప్పవలసింది. ప్రతి పాత్ర చిత్రణలో ఇంకా ఉండనే ఉంటుంది. కారణం నవలలో ఇతివృత్తంలోని పరిమితులూ, పాత్ర జీవితంలోని హద్దులూ.



ప్రతి వ్యక్తి తన ప్రపంచానికి తానే కేంద్ర బిందువు. ఒక్కొక్కరి దృష్టిలో ఒక్కొక్క విధంగా కన్పిస్తుంది. ప్రతి వ్యక్తి జీవితం ఒక స్వయం వ్యక్తిత్వ వలయం. వివిధ మనస్తత్వాలు గల అనేకమైన వ్యక్తుల ప్రవర్తనల తీరులతో సమాజం ఎంతో సంశ్లిష్టమైంది సంక్లిష్టంగా, ఉండటం సహజం. ఎక్కడి కక్కడ కొన్ని పరిమితుల్లో జీవితం గడిపే మానవుల్లో, ఎన్నో సూక్ష్మమైన ప్రత్యేకాంశాలతో పాటు అందరికీ లేదా ఎక్కువ మందికీ వర్తించే కొన్ని కొన్ని లక్షణాలూ ఉంటాయి. వేరు వేరుగా పేర్కొనవసరం లేని, ఎన్నో సందర్భాల్లో వివిధ వ్యక్తులతో పరిచయం స్నేహం బంధుత్వం ఆత్మీయతతో పాటు విరోధం వ్యతిరేకత వివిధ స్థాయిల్లో ఏర్పడుతాయి. వ్యక్తిగతంగానే కాక సామాజికంగానూ అంగీకారంలో తిరస్కారంలో కొన్ని అభిప్రాయాలూ సిద్ధాంతాలు కలిపేవీ విడదీసేవీ ఉంటాయి. ఈ వలయాలను దాటి, ఎక్కువ తక్కువలూ ప్రాంతం వర్గం దేశం భాష విశ్వాసం అభిప్రాయం మొదలయినవీ మతం సిద్ధాంతం ఆదర్శం గురించిన భేదాల కతీతంగా మానవతాలక్షణం అన్ని కాలాల్లోనూ పనిచేస్తుంది. ఈ మౌలికమైన మానవీయ భావన వల్లనే ఏ భాషకూ ఏ దేశానికీ సంబంధించిన నవలలోని పాత్రల పట్లనైనా ఆసక్తినీ అభిమానాన్నీ కలిగి ఉండడం సంభవిస్తుంది.

నవలలో రచయిత ప్రతిభకు నిదర్శనంగా నిలచే గొప్ప పాత్రల్లో సాధారణమైన అనుభవాన్ని, విశేష స్థితికి తీసుకొనివెళ్ళే ఉన్నతమైన స్థాయి ఉంటుంది. పాత్ర నిర్మాణంలో రచయిత సాంఘిక రాజకీయ నైతిక వైయక్తిక ధోరణి గల నిర్మాణ రేఖలు స్థూలంగా పని చేస్తాయి. ఇవి పాత్రలో అంతర్లీనమై ఉంటాయి. వీలును బట్టి బయటికి వస్తాయి. ఒక పాత్రలో లోకంలో ఎందరో వ్యక్తుల లక్షణాల్లో అంశాల సమాహార రూపంగా ఉండవచ్చు. రచయిత తాను నిర్మించే దాన్ని బట్టి కావలసిన లక్షణాలను ఎన్నుకోవడం జరుగుతుంది. దీని వినియోగంలో పాత్ర మనస్తత్వంపై అనుభవ స్పందనపై వెలుగును ప్రసరించడంతో మన ఊహను దాటిన స్వరూపం ఏర్పడుతుంది. ఆకర్షణకు స్థానమౌతుంది. పాత్ర సృష్టిలో కొంత కల్పనకూ వీలు చిక్కుతుంది. యోజన (ప్లానింగ్)లో రచయిత పొందిన అనుభవరూపం పైనే ఇది సాగుతుంది. రచయిత కోరే మార్పులను పురస్కరించుకొని ఉంటుంది. ఎంత

వాస్తవమైనా అనుభవమూలమైన వ్యక్తిత్వ చిత్రణం యథాతథంగా ఉండదనే అభిప్రాయం ఈ దృష్టితో వెలువడిందే. ఈ మార్పులు కథా ప్రణాళికను బట్టి ఉద్దేశ గర్భితమై ఉంటాయి. క్రమంగా పాత్రలు రచయిత ఆలోచనా ధోరణినీ, దర్శన శక్తినీ బట్టి ఏర్పడుతూ చరిస్తాయి. అందువల్ల ఒక రచయిత తీర్చే పద్ధతికీ, మరో రచయిత తీర్చే పద్ధతికీ భేదం ఉంటుంది. ఒక దానిలోకి మరొకటి మార్చలేం. ఏదీ దేనికీ ప్రత్యామ్నాయం కాదు. ఒకే రచయిత వేరు వేరు విధానాలనూ అవలంబించవచ్చు. ఏ మానవ స్వభావం మాత్రం సంపూర్ణంగా వెలుగుతో ప్రకాశించదు, పూర్తిగా చీకటితోనూ నిండి ఉండదు. వెలుగు – చీకటి, ఈ మధ్య ఛాయా భేదాలు, వివిధ వర్ణ కాంతి ప్రసారాలు, కలిగే స్థితులతో ఏర్పడే రూపాలెన్నో ఉన్నాయి. జీవితంలో వీటిని సరిగా గుర్తించడం చాలా కష్టమైన పనే. పాత్ర చిత్రణంలో రచయిత సమదృష్టితో ఈ సూక్ష్మభేదాలను గుర్తించి జీవన వాస్తవ స్ఫూర్తితో నిర్వహించే ప్రయత్నం చేయడం అవసరం.

ఇతివృత్తంలో సంఘటన – సంభాషణ – వాతావరణం – మొదలైన వివిధాంశాల నుండి పాత్ర క్రమక్రమంగా బయటపడుతూ చివరకు చేరే లక్ష్యంతో, సంపూర్ణమైన స్వరూపాన్ని పొందుతుంది. పాత్ర నవలలో ఒక ముఖ్యాంశమే అయినప్పటికీ, ఇతర లక్షణాలతో ఎక్కువ తక్కువ అనుబంధం తప్పనిసరిగా కలిగి ఉంటుంది. నవల చదివాక పాత్ర స్మృతి పథంలో నిలవాలి. మనస్సులో కొంతకాలం నిలిస్తే అది ప్రభావం నెరపిన దాని కిందే లెక్క. సాహిత్యంలో అక్షరరూపంలో నిలచే మానవ రూపమైన ఉత్తమ పాత్రను, అనుభవంలో దర్శించినపుడు పాఠకునిలో మానసికమైన శూన్య వలయం తృప్తి రేఖలతో పూర్ణమౌతుంది.

ఉత్తమ పాత్ర సృష్టికి గాఢమైన సాహిత్య గుణం, మానవ స్వభావ పరిశీలనం, వాస్తవానుభవంపైన కొంత కల్పనాశక్తి, సృజనశక్తి సమున్మేషంతోపాటు నిర్మాణ శిల్పం – నిర్దిష్టమైన లక్ష్యం అవసరం. మనలో నిరంతరం జీవించే పాత్ర, కొత్త ప్రపంచాన్ని దర్శింపజేస్తుంది. అనుభవ స్వరూపాన్ని విస్తృతం చేస్తుంది. కొత్త విలువల్ని నిలుపుతుంది. మనసును ఆలోచనకు గురిచేస్తుంది. మానసిక వికాసాన్నీ కలిగిస్తుంది.



# 6. వాతావరణ పరికల్పనం

(స్థలం–కాలం–పరిసరాలు)

మానవుని చుట్టూ ప్రపంచం ఉంది. భూమి ఆకాశం సముద్రం అడవీ ఊరు నగరం ఇల్లు ఇంకా పకృతిరూపాలు నివాస స్థానాలు అనేకమైన ప్రయోజనాలు గల భౌతికమైన వస్తువులు, అన్నీ కలిసి భౌతిక సాంస్కృతిక స్థితుల్ని భావింపచేస్తాయి ఏదో ఒక విధంగా ఉండేవీ, సంబంధం వీడనివీ, ఇంకా ఎన్నో! అనేక సమయాల్లో వీటితో మనకు గల సంబంధంతో పొందే అనుభవాల పరంపర, జీవితంతో ముడివడి ఉంటుంది. ఒక్కొక్కపుడు అనివార్యమైందీ. ఇవి నవలలో ఎంతో వివరంగా, చిత్రించే వీలుంది. నవల లక్షణాల్లో వాతావరణ చిత్రణం ఒకటి. ఇది కాలానికీ స్థలానికీ ప్రకృతికీ సంబంధించింది. కథాగమనంలో కాల స్థల ప్రకృతి రూపమే నవలలో వాతావరణం పరికల్పనం ఒక కాలంలో ఒక స్థలంలో ఎదురుపడే జీవించే వ్యక్తుల జీవిత గమనంలో ప్రకృతితో అనుబంధం విడదీయడానికి వీలులేకుండాను ఉంటుంది. పూర్వ భూమికగా దృశ్యంలో పరిసరాలు, వాతావరణం పలిల్ఫితతమవుతాయి.

వాతావరణం అనేమాట ప్రకృతిపరంగా భౌతికంగా మానసికంగా విస్తృతమైన అర్థాన్ని తనలో ఇముడ్చుకోగల పరిధి కలిగింది. ఇది నవలలో ఇతివృత్తం పాత్ర ఉద్దేశాలకు సంబంధించిన యోజనాపరమైన స్వరూపం చేత నిర్మాణ రూపాన్ని పొందుతుంది. సృజనాత్మక సాహిత్యంలో ఇతరమైన అంశాలను పురస్కరించుకొని దీని ప్రమేయమూ స్థానమూ నిర్ణీతమౌతుంది. కాలాన్నీ స్థలాన్నీ ప్రకృతినీ ఆశ్రయించిన చిత్రణం వాతావరణ పరికల్పనలో ప్రధాన లక్షణం.

కథలో గమనాన్ని ఆశ్రయించిన స్థలం మరియు కాలానికి సంబంధించిన ఈ అంశం నాలుగు విధాలుగా ప్రవృత్తమౌతుంది. 1) సామాజికం 2) భావాత్మకం 3) ప్రకృతిపరం 4) వస్తు గతం.

మొదటిది సామాజికంలో భౌతికమైన సాంఘిక రాజకీయ సాంస్కృతిక చిత్రణం ఉంటుంది. జీవితంలోని ఆచారాలు పద్ధతులు విధానాలు వర్ణితమౌతాయి. ఇవి

ఒక్కొక్క విధంగా వివిధ దృక్పథాలతో కల్పితమవుతాయి. ఫీల్డింగ్ టామ్‌జోన్స్ ఇంగ్లీషు ప్రజల జీవితాన్నీ, విక్టర్ హ్యూగో లే మిజరబుల్స్ ఫ్రెంచి జీవితాన్ని, టాల్‌స్టాయ్ వార్‌ఎండ్‌పీస్ రష్యన్ జీవితాన్నీ ఆయా కాలాల ప్రభావ ముద్రల్ని దర్శింపజేస్తాయి. తెలుగులో ఉన్నవ మాలపల్లిలో, విశ్వనాథ వేయిపడగలులో, చలం తదితరుల రచనల్లో గమనించవచ్చు. పాశ్చాత్య ప్రభావం వల్ల అన్ని రంగాల్లో వచ్చే పరివర్తనను చిత్రిస్తూ జీవితంలో వచ్చే మార్పులూ వివిధ దృక్పథాల్లో భిన్నధోరణుల్లో కనిపిస్తాయి. మాలపల్లి అట్టడుగు నుండి తలఎత్తి పైకి లేచే శిఖరాలతోనూ, వేయిపడగలు ఒక్కొక్కటీ పై నుండి కూలిపోయే శిఖరాలతోనూ సాక్షాత్కరిస్తాయి. ఈ రెండిటినీ పరిశీలిస్తే ఆకాలంలో ఆంధ్రదేశంలోని ఇంచుమించు భారతదేశంలోని సాంఘిక రాజకీయ సాంస్కృతిక వాతావరణ స్వరూపంలోని వివిధ పార్శ్వాలు విదితమౌతాయి. ఇది నవలల్లో కాలం స్థలం ప్రభావం నుండి తప్పించుకోలేని స్థితినే కాకుండా దానివల్ల రచనకు కలిగే విశాలమైన పరిధినీ పార్శ్వాలనూ భావింపజేస్తుంది. ఆధునిక నవలల్లో సామాజిక రూపంలో – మధ్య– క్రింది తరగతుల జీవన స్థితుల్లో గ్రామ నగర శ్రేణుల్లో చిత్రితమై కన్పిస్తుంది.

రెండోది భావాత్మకంలో మనోభావాలకు సంబంధించిన మానసికమైన వివిధ స్థితి చిత్రణంతో కూడి ఉంటుంది. ఈనాడు మనస్తత్వశాస్త్ర ప్రభావం వల్ల మానసికమైన స్థితి చిత్రణంతో వాతావరణ పరికల్పనం విశిష్టమైన పాత్రను నిర్వహిస్తోంది. అల్పజీవి నవల సమాప్తిలో భయకరంగానూ మనోహరంగానూ కదలే సముద్ర దృశ్యం, కేవలం ప్రకృతి వర్ణనకు మాత్రమే పరిమితమైంది కాదు. నవలలోని పాత్రల చర్య ప్రతిచర్యల పర్యవసానంగా చివరకు అగాధమైన జీవితాన్ని, ధైర్యంతో సాహసంతో తరించే మానవుని ప్రయత్నమూ ఆశాస్ఫూర్తీ దృశ్యసూచకంగా ఉంది. మనస్తత్వ సమర్పకంగా కల్పితమైంది. ఇంకా నవలలో హృదయాన్ని స్పందింప చేసే కరుణం, కంపింపజేసే భయం మొదలైనవి భావనామయంగానూ తీర్చబడినాయి. మనస్సును కలతపెట్టే విపత్తులకు సంబంధించిన విషాదంతో, మనస్సుకు ఉల్లాసాన్ని కలిగించే రాగంతో, ఉప సంహృతికి దారేతీసే



శాంతంతో, ఈ విధంగా అనేకమైన మనోభావాల సమాకీర్ణ లక్షణంతో రూపొందడం, ఈ సందర్భంలో గుర్తుకువస్తాయి. అవ్యక్తచేతనతో పాటు సామూహిక అవ్యక్తచేతనపై దృష్టి ప్రసరించడంతో రచన గభీరతను పొందుతూంది. ఈ నవలలో రచయిత శిల్ప ప్రతిభచేత సూక్ష్మమైన నిర్మాణరేఖలను సంతరించుకుంటూ ప్రసరించడం విశ్లేషణ కందుతుంది.

మూడోది ప్రకృతి పరం – వస్తుగతం.

దీనిలో ఒకటి కేవలం ప్రకృతివర్ణనం. పూర్వకాలపు నవలల్లో విరివిగా కన్పిస్తుంది. కథలో విరామంగా మనస్సును కాల్పనికమైన వాతావరణంతో అలరింపజేస్తుంది. మరొకటి కథాప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ఇతివృత్తం పాత్ర చిత్రణల్లో భాగంగా ఉంది. సంఘటన, ప్రవర్తనం ఆధారంగా బాహ్యమైన చిత్రణలో లేదా దాని సూచనతోనో ఉండే ప్రకృతివర్ణనం. ఉదాహరణకు పాత్ర ఎదుర్కొనే కష్టానికి ముందు తుఫానురావడం, రాబోయే దు:ఖానికి సూచనగా చీకటిని వర్ణించడం, ఒక్కొక్కపుడు వర్ణనలు పాత్రను ఎంతో శక్తిమంతంగా తీర్చేవిగానూ ఉంటాయి. ప్రకృతితో మానవుని సంఘర్షణలోనూ ఇది ప్రవృత్తమవుతుంది. ఇటువంటి సందర్భంల్లోనే, కాక ఇంకా అనేక సందర్భాల్లోనూ దృశ్యం ప్రతీకాత్మకతను పొందే అవకాశం ఉంది. అల్పజీవి నవల చివరలో “కదలుతూన్న సముద్రం” జీవితానికి ప్రతీకగా నిలచేది. వాస్తవ జీవితాన్ని భావింపచేసేది. నవలలో విషయ విభాగం దృష్ట్యా వివిధాంశాలు విడివిడిగా పరిశీలనం చేసినప్పటికీ, ఒక ప్రభావం మరోదానిపై ప్రసరిస్తూ, ఒకదాని ప్రమేయం మరోదాని ఆవిష్కారానికి దారితీస్తూ, ఇది క్రమంగా పరంపరగా మొత్తం మీద పరిపూర్ణమైన ఏకరూపతకు దోహదం చేస్తాయి, కాబట్టి వాటి ప్రసక్తి అనివార్యమవుతూంది. దీనితోపాటు పరిసర వస్తు సమితి వర్ణనమూ తప్పనిసరిగా చేసుకోవడమూ ఉంది. ఈ విధంగా ప్రకృతిపరమైన వస్తు – గతమైన వర్ణనం రచయిత ప్రజ్ఞను బట్టి ఉద్దేశాన్ని బట్టి స్థూల రూపం నుండి సూక్ష్మ రేఖల వరకూ వాతావరణ నిర్మాణంలో గొప్ప పాత్రను నిర్వహించే అవకాశం కలిగి ఉంటుంది.

## II

నవల లన్నిటిలోనూ వాతావరణ పరికల్పనం ఒక విధంగా ఉండదు. దేని తీరు దానిదే. ఇతివృత్తాన్ని బట్టి పాత్రల్ని బట్టి మార్పులు ఉంటాయి. ఒక దేశం నుండి మరో దేశానికీ, ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికీ, కథా రంగం మారినపుడు పరిసర వర్ణనం సంపూర్ణమైన పరివర్తనం పొందుతుంది. ఆయా దేశాల స్థలాల ప్రజల గురించి బాగా తెలియాలి. ఒక్కొక్కపుడు ప్రత్యేకమైన వృత్తికీ లేదా విషయానికీ సంబంధించి ఉండవచ్చు. మాబీడిక్ నవలలో సముద్రంపై తిమింగిలాల వేటకై చేసే, సాహస యాత్రకు సంబంధించిన ఇతివృత్తం – సముద్ర జీవనానికి సంబంధించిన వృత్తిపరమైన ప్రత్యేక వాతావరణాన్ని రూపొందించవలసి వచ్చింది. అనేకమైన వృత్తులను వాటి ప్రసక్తి వచ్చినపుడు రచయిత ఎంతో శ్రద్ధతో విషయాన్ని పరిశీలించి చిత్రించవలసి ఉంటుంది. సమాజంలో వివిధ తరగతులు, వర్ణం జాతి మతం వ్యవసాయికం – పారిశ్రామికం – బ్యూరాక్రసీ వాణిజ్యం అనేకం తమ పాత్రల్ని నిర్వహిస్తున్నాయి. ఊరు, నగరం, ఇల్లు, వీధి, ఆఫీసు, ఫ్యాక్టరి, బడి, స్టేషన్ ఎన్నో కథాభాగాల్లో సంఘటనలను పురస్కరించుకొనీ పాత్ర చర్యలను బట్టీ తటస్థపడే పరిసరాలు వేరే ఉన్నాయి. చారిత్రక నవలల్లో స్థలం కాలం పెద్ద పాత్రను నిర్వహిస్తుంది. చారిత్రక నవలా రచయిత పూర్వకాలానికి చెందిన విషయాల దృశ్య చిత్రణం పట్ల ఎంతో బాధ్యతతో ఉపక్రమించవలసి ఉంటుంది. చరిత్రకూ సంస్కృతికీ సంబంధించిన అంశాలను ఎంతో విజ్ఞానంతో నిర్వహించడం వల్ల వస్తువుకు న్యాయం చేకూరుతుంది. ఆయా స్థలాలను దర్శించి వాటికి సంబంధించిన విశేషమైన సమాచారాన్ని సేకరించాలి. సాధారణ పాఠకునికీ తెలీని అందుబాటులో లేని కాలాన్నీ దేశాన్నీ జాతినీ, మంచి ప్రయత్నంతో హేతుయుతంగా పునర్నిర్మించి అద్దంలో ప్రతిఫలించే సంగ్రహ రూపం వలె నవలలో వాతావరణం యోజితం కావాలి. కథాగమనం వెనుక నుండి స్థానిక పరిసరాల చిత్రణం స్పష్టంగా ఆవిష్కృతం కావాలి.

సాంఘిక స్వరూపం మనకందని ఎంతో పూర్వ కాలానికి సంబంధించింది కావడం చేత ఆకాలం వాటి జీవితాన్ని మళ్ళీ సృజించడమే అవుతుంది. ఇది కొన్ని సాక్ష్యాధారాలపై జరగడం వల్ల వాస్తవస్థితిని భావింపజేస్తుంది. అక్కడక్కడా చెదరి ఉన్న అనేకాంశాలను సమీకరించి ఎంతో ఆలోచనచేసి, వీటి మధ్య ఐక్యత చేకూర్చిన కళాసృష్టి కావడం చేత – కొంత కల్పన చోటు చేసుకొంటుంది. ఒక ప్రత్యేకమైన చరిత్ర సంస్కృతిలక్షణంతో జాలి జీవితాన్ని తిరిగి సృజించడం చారిత్రక నవలలో కన్పించే ముఖ్యమైన లక్షణాల్లో ఒకటి. గతానికి సంబంధించిన అనేకమైన చెదరి ఉన్న అనేకాంశాలను సమీకృతం చేసి కొంత కల్పనతో ఐక్యత చేకూర్చి, సజీవ రూపాన్ని ఇవ్వడం సులభం కాదు. దీనికి గతానికి సంబంధించిన వాతావరణసృష్టి అవసరం. జార్జి ఇలియట్ వ్రాసిన రోమలా ఇటాలియన్ సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని ఉద్దేశించింది. తెలుగులో విశ్వనాథ సత్యనారాయణ, నోరి నరసింహశాస్త్రి, ముదిగొండ శివప్రసాద్ మొదలైన రచయితల చారిత్రక నవలలోనూ ఈ పరికల్పన స్పష్టంగా కన్పిస్తుంది. స్వాభిమానాన్ని ఉజ్వలింప జేసే చరిత్ర సంస్కృతికి చెందిందీ. ఆనందాన్ని తరంగితంచేసే కళతో – రచయిత నిర్మాణ శక్తిలో కొంత భాగం వాతావరణ పరికల్పనకు ఉపయోగితం కావలసి ఉంటుంది. ఇది నవలకు కథ వెనుకనున్న నేపథ్యాన్ని పూరిస్తుంది.



## III

పూర్వకాలపు నవలలో చాలా వివరంగా స్థానికమైన అంశాలు అవకాశాన్ని బట్టి పరంపరగా చిత్రితమయ్యేవి. అడవులు పర్వతాలు నదులు వీధులు ఇండ్లు గదులూ, గదుల్లో వస్తువుల అమరిక అన్నీ విపులంగా రచయిత పరిశీలనా శక్తికి నిదర్శనంగా సాగేవి. ఈ పద్ధతిలో ఈనాడు కొంత మార్పు వచ్చింది. రచనలో మధ్య మధ్య విరామ వర్ణనలు వదిలేసి, క్లుప్తంగా వర్ణనం అవసరం మేరకు అవలంబింపబడుతూంది. వెంటనే సంభాషణ లేదా కథాగతికి అవసరమైన కథనమో వివరణమో ప్రవృత్తమౌతూంది. ఈ కాలంలోనూ పరిసరాల వర్ణనం తొలగిపోలేదు. తొలగి పోవడానికి వీలూ లేదు. కాని రచనలో ప్రయోజనం మేరకు లేదా విశేషదృష్టితో గ్రహించడం జరుగుతూంది. నవలలో సుదీర్ఘమైన వర్ణనలు కథా గమనానికి అంతరాయమనే ఒక పక్షం వాదం. ఇది పాఠకుణ్ణి మధ్య మధ్య అలరిస్తుంది.

దీనివల్ల ఏ ఇబ్బందీ ఉండదు. దీన్ని అంతరాయమనీ అనుకోకూడదని మరో పక్షం వాదం. దీన్ని నవీనులు అంగీకరించరు. ఏమైనా ఇతివృత్తంలో స్థానికమైన పరిసరాల చిత్రణం, ఇతివృత్తంలో ఆయా పరిసరాల సంబంధాన్ని బట్టి ఉంటుందన్న మాట మరచిపోకూడదు. ఏది ఎట్లా ఉండాలన్నది నవల మొత్తం మీద రచయిత ఆవలంబించే రచనా ప్రణాళికనూ బట్టి నిర్ణయించుకోవలసి ఉంటుంది. ఇది సంవిధానంలో భాగమవుతూంది. ఒక్కొక్క సందర్భంలో ఒక చిన్న వాక్యంతో దాటి వేయవచ్చు. కొన్ని వాక్యాల్లో సంగ్రహంగా చెప్పవచ్చు. సంక్షిప్తంగా ఉండవచ్చు. మరో సందర్భంలో సుదీర్ఘంగా ఉండవచ్చు. ఇది దృశ్యం (Scene) అవుతుంది. దృశ్యంలో సన్నివేశంతోపాటు నేపథ్యంగా పరిసరాల చిత్రణం సాగుతుంది. ఇవి కథాగమనంతో సంఘటనల్లో ఆయా స్థితుల ప్రాధాన్యాన్ని బట్టి అంటాయి. దృశ్యంగానూ, సంక్షిప్తంగానూ ఆయా సందర్భాల్ని బట్టి అవసరమౌతాయి. ఒక నగరం లేదా వనంలో నుండి పాత్ర ప్రయాణం సాగుతుంది. లేదా ఇతివృత్తంలో ఒక సందర్భంలో ఋతువు మారింది. అపుడు కథలోని ఏ అంశంతోనూ సంబంధం లేకపోతే దాటేయవచ్చు. ఏదో ఏ కాస్త సంబంధం ఉన్నా సంక్షిప్తంగా పేర్కోవచ్చు. సంగ్రహంగా వర్ణించవచ్చు. ఇదొక పద్ధతి. కథతో సంబంధం లేకపోయినా కల్పించుకొనీ, ఏ మాత్రం సంబంధం ఉన్నా దాన్ని అవకాశంగా తీసుకొనీ, ఆ నగరం గొప్పతనాన్నో ఆ వనం విశేషాలనో లేదా మారే ఋతువు శోభనో సుదీర్ఘంగా వర్ణిస్తూ పోవచ్చు. పూర్వ కాలపు నవలల్లో ఈ పద్ధతి బాగా కన్పిస్తుంది. ఈ విధమైన మధ్యంతర వర్ణనలను పురస్కరించుకొని రచయిత తన వర్ణనా శక్తినీ విజ్ఞాన సంపదనూ ప్రదర్శించే ప్రయత్నం జరుగుతుంది. ఈ విధంలో దోషం ఏమీ లేదని కొందరి అభిప్రాయం కూడా. పైన పేర్కొన్నట్లు పాఠకులకు కథ నుండి కాస్త విరామానికీ, కొంత విజ్ఞాన పరిచయానికీ, కాస్త ఉల్లాసానికీ ఉపకరిస్తుందని వీరి విశ్వాసం. అభిప్రాయ భేదా లెట్లా ఉన్నా, ఇది రచయిత నిర్వహణ దృష్టికి సంబంధించింది. దీన్ని కొందరు ఎంతో ఆసక్తికరంగా నిర్వహించిన తీరు కూడా ఈ సందర్భంలో గుర్తించవలసి ఉంది.

నవలలో స్థానిక పరిసరాల చిత్రణం ఇతివృత్త క్రమంలో, పాత్ర చిత్రణంలో దృశ్యంలో సుందరతకు దోహదం చేసే మాట వాస్తవం. దీన్ని ఆధునిక రచయితలు



సృజన శక్తి చేత, శిల్ప సంవిధానంలో కళాత్మకతను ప్రదర్శిస్తున్నారు. ఎంతో ప్రతీకాత్మకంగానూ రూపొందిస్తున్నారు. చివరకు మిగిలేది నవలలో ప్రకృతి వర్ణనం, కొన్ని సందర్భాల్లో కోమలి పాత్రను ఉనన్మీలితం చేసే విధంగా యోజితమైంది. దయానిధి, కోమలి, సుశీల, నాగమణి బృందం పిక్‌నిక్‌కు వెళ్ళిన సందర్భంలో దీన్ని బాగా గుర్తించవచ్చు. విశ్వనాథ 'ఏకవీర' నవల ఆరంభములో "వైగై నది క్రుంగి కృశించిన ప్రోషిత భర్తక వలె ప్రవహించుచున్న" దన్న వర్ణనం ప్రధానమైన స్త్రీ పాత్రను స్ఫూర్తి కట్టిస్తూంది. ఈ నవల సమాప్తి లోనూ వైగై నది వర్ణనం పరిశీలనార్హమవుతూంది.

వాతావరణ పరికల్పనం ఇతివృత్తంతోనూ పాత్రతోనూ ఎన్నో విధాలుగా అనుబంధ గుణంతో స్థాపితమౌతూంది. ఈనాటి రచనల్లో మనస్తత్వపరంగానూ ప్రతీకాత్మకంగానూ క్రొత్త దనాన్ని పొందింది. నవలలో బలమైన సంఘటనలకు పుష్టికొరకై ఉత్కర్షావహంగా పూర్వభూమికను నిర్మిస్తూంది. నిర్దిష్టమైన స్థలంలో, ఉద్దిష్టమైన చర్యలతో కూడుకొని ఉంటూంది. దృశ్య చిత్రణం – వాతావరణ పరికల్పనంలో భాగమవుతూంది. ఇతివృత్త గమనంతో పాత్రచర్యతో కూడి ఉండే విధంగా తీర్చడం సామాన్యం కాదు. నవలలో వాస్తవికతకే మాత్రం భంగంకలగకుండా ఉండాలి. అందువల్ల ఇది అనుభూతిని సాంద్రతరం చేసేదిగా ఆలోచనను గాఢతరం చేసేదిగా కళాత్మకమైన విలువల్ని పెంచేదిగా ఉండాలి. నవలలో ఇతర లక్షణాలతో చక్కగా అమరి రూపొందడం గొప్ప విషయం. ఇది రచయిత ప్రతిభపై శిల్పదృష్టిపై ఆధారపడి ఉంటుంది. వాతావరణ పరికల్పనం నవలలో నిర్వహణ కళాదృష్టితో సముచితమైందీ. రచయిత శ్రద్ధవహింపదగిన అంశం.

# 7. సంభాషణ

మానవ జీవితం తోటి మానవులతో సంబందాల్ని కలిగిందీ, ఎన్నో విధాలుగా ఆధారపడి సాగేదీ, ఆలోచనతో పాటు అనుభవాత్మకమైన వాస్తవ రూపం. జీవితంలో పరస్పరం ప్రయోజనాలు నెరవేర్చుకోడానికి అవలంబించే ఒక సాధనం భాష. భాషాగతంగా, నవలలో రచనారూపం ప్రధానంగా రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి కథనం, రెండోది సంభాషణం. కథనానికి అనుబంధంగా వివరణం, వర్ణనం ఉంటాయి. కథనం వివరణంలోకన్నా వర్ణనలో భాష అలంకారితను పొందుతుంది. నాటకం సంభాషణాత్మకం. నవలలో నాటకీయతను సాధించడానికి సంభాషణపై శ్రద్ధ అవసరం. ఒక భాషను ఆశ్రయించి ఒక వ్యక్తి మనోభావాలను మరోవ్యక్తికి తెలియజేసే మౌఖికమైన విధానం సంభాషణ. కథనం వివరణం వర్ణనం సంభాషణంలో భాషకు చెందిన అనుభవం వేరు వేరుగా ఉంటుంది. దీన్ని స్పష్టంగా గుర్తించవచ్చు.

వర్ణనలో కాల్పనికతకూ, సంభాషణలో వాస్తవికతకూ అవకాశం ఎక్కువ. దీనిలో వాస్తవానుభవగుణంతో పాటు సాన్నిహిత్యాన్ని భావింపజేసే లక్షణమూ ఉంది. ఇది మనలో భాగంగా అనిపిస్తుంది. మన చుట్టూ ఉన్న పరిసరాల్లో మాట్లాడేదీ, ఎక్కువ పరిచయం ఉందీ కావడం చేత తటస్థంగా ఉండడం కుదరదు. సంభాషణలో ఏదో ఒక విధంగా పరిచయ సాన్నిహిత్యం నుండి, అంతర్భాగత్వాన్నీ ఐక్యతాస్థితినీ అనుభవించడం జరుగుతుంది. ఇది పాత్ర తీరునుబట్టీ ఉంటుంది. నవలలో వివిధ వ్యక్తుల పరస్పర భావ ప్రకటనంలో నాటకీయ పద్ధతి వెంటనే ఆకర్షించే ధోరణి కలిగింది. పాత్ర స్వరూపాన్ని తెలుసుకునేందుకు ఎంతో సహకరిస్తుంది.

ఏ సంభాషణ లేకుండా, కేవలం కథన పద్ధతితోనే నవల రూపొంద వచ్చు. ఇది రచయిత నిర్వహణంలో అవలంబించే విధానానికి సంబంధించింది. కాని సాధారణంగా నవలలో సంభాషణ విధిగా ప్రయుక్తమౌతుంది. దీనికి సమాజ స్వరూపాన్నీ వివిధ వ్యక్తుల మనస్తత్వాన్నీ బాగా పరిశీలించడం అవసరం. సమాజంలో సామాన్య ప్రజలు మొదలు మేధావుల వరకూ వివిధ స్థాయిల్లో ఉన్నవారు, విభిన్న



ప్రాంతాలవారు, అంతస్థులవారు, వృత్తులవారూ మాట్లాడే తీరులోని వైవిధ్యాన్నీ ప్రత్యేకతనూ గుర్తించవలసి ఉంటుంది. రచనలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఇతివృత్త పరిణామానికీ పాత్ర చర్యలకూ సంభాషణ ఇతివృత్తంలోని వివిధావయవాల సంబంధాన్నీ స్థాపితం చేయగలగాలి. అంతేకాని ఏ సంబంధం లేకుండా లేదా ఏదో సంబంధం కల్పించుకొని వాడే సంభాషణలు ఎంత ఆనందం కలగించేవైనా ప్రయోజనం సంకుచితమైపోతుంది. పైగా ఇలాంటివి విసుగు కలిగించేవిగానో, అంతరాయాలుగానో ఉంటాయి. రచయిత ఏదో విధంగా ఇతరమైన విషయాలను చొప్పించే మనస్తత్వమే దీనికి కారణం. దీని వల్ల నవల పూర్ణ రూపంలోని సుస్వరత దెబ్బతింటుంది. కొన్ని నవలల్లో రాజకీయ తాత్త్విక సామాజికమైన అనేక విషయాలను గురించి సుదీర్ఘమైన సంభాషణలు పాత్ర నుండి వెలువడి ఆ పాత్రనే మరచిపోయే ధోరణిలో ఉంటాయి. ఇది పాత్ర చిత్రణం విషయంలో దెబ్బతీస్తుందనడంలో సందేహం లేదు.

రచయిత ఏదో విధంగా అనేక విషయాలను చొప్పించి విజ్ఞానదాయకంగా సంభాషణ తీర్చడంలో దోషం లేదనే అభిప్రాయమూ ఉంది. ఇది కళాత్మకంగా అనుచితమనీ, కొందరు వ్యతిరేకించడమూ జరిగింది. పాత్ర ప్రత్యేకతను పురస్కరించుకొని ఎక్కడన్నా సంభాషణ దీర్ఘంగా ఉండవచ్చు. కాని వీలు కల్పించుకొని విజ్ఞాన ప్రదర్శనకు పూనుకోవడం సముచితంకాదనే ఆధునిక విమర్శకుల ఆలోచన. ఈ కారణంగా పాత్రల చర్యలతో అవయవాత్మక సంబంధం పెంపొందిస్తూ సంభాషణ అర్థవంతంగా ఉండాలనడం జరిగింది. శిల్పియైన రచయిత చేతిలో సంభాషణ ఇతివృత్తాన్ని ప్రకాశింపజేస్తుంది. పాత్రను ఆవిష్కరింపజేస్తుంది. నవలలోని కళాత్మకమైన పూర్ణ స్థితికి దోహదం చేస్తుంది. సంభాషణను లోకంలో ప్రవృత్తమయ్యే దాన్ని, ఎంతవరకు స్వీకరించాలో పరిహరించాలో ఔచిత్యదృష్టితో రచయిత నిర్ణయించుకోవలసి ఉంటుంది. సృజనశక్తికి వెనుక నుండి విమర్శనాదృష్టితో చూస్తేగాని తెలియదు. ఏ భాషలోనైనా సంభాషణ నవలలో పాత్రల మనోభావాల ప్రకటనంతో జీవిత స్వరూపాన్ని యథార్థ స్థితిలో ఆవిష్కరించే ప్రయత్నంలో శక్తివంతమైన సాధనంగా ఉపకరిస్తూంది.

సంభాషణ నాటకంలో ఉంటుంది. నవలలోనూ ఉంటుంది. ఈ రెండిటికీ భేదం ఉంది. నాటకంలో సంభాషణకు కాల పరిమితి ఉంటుంది. ప్రదర్శనం

నియమితమైన కాలంలో జరగాలి. రంగ స్థలంపై నిలిచే పాత్రకూ సంభాషణకూ సమయం నిర్ణీతమై ఉంటుంది. నవలలో ఈ విధమైన కాల పరిమితి పట్ల నియతి లేదు. అంత మాత్రాన ఎంతబడితే అంత పొడిగించడమూ జరగకూడదు. కాని ఈ విషయంలో చాలా వరకు స్వేచ్ఛ ఉన్నమాట నిజం. ఈ భేదం నాటకానికీ నవలకూ సంభాషణ స్వరూపంలో ఎంతో మార్పుకు కారణమౌతూంది. విలక్షణతకు దారి తీస్తుంది. ఈనాటి నవలలో పూర్వం వలె సుదీర్ఘం కాకుండా అవసరానికి మించకుండా, క్లుప్తతతో వేగంతో సంభాషణల తీరు కన్పిస్తుంది. ఎక్కడైనా పాత్ర ప్రత్యేకతను బట్టి పొడిగింపు అవసరం కావచ్చు. సంభాషణలో సూటిదనం స్పష్టత సహజత్వంతోపాటు వాస్తవికతకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. దీని వెనుకకుండి వాతావరణం నిర్మితమౌతుంది. మానసిక స్థితీ ప్రవర్తనా రీతితో సంభాషణ పాత్ర నుండి బహిర్గతం కావడంతో కథాభాగం బాగా రాణిస్తుంది.

## II

నవలలో తరచు తటస్థ పడే సంభాషణలను సాధారణం, ప్రాసంగికం సుదీర్ఘం, సంక్షిప్తం, టెలిగ్రాఫిక్ అనీ విభజించవచ్చు.

1) సాధారణంలో పాత్ర సంభాషణ జీవితంలో వివిధ సందర్భాల్లో మాట్లాడే సామాన్యమైన ధోరణి కలిగి ఉంటుంది. ఇందులో వాస్తవ చిత్రణం. సహజత్వంతో ఎంతో సన్నిహితమైన అనుభవాన్ని కలిగించేదిగా ఉంటుంది. 2) ప్రాసంగికంలో – పాత్ర సంభాషణ ప్రసంగ ధోరణిలో ఉంటుంది. ఒక ఊపులో ఉద్రేకంతోనో సాలోచనతోనో సమాచారంతోనో వివరణంతోనో విజ్ఞాన ప్రదర్శకంగానో ఉల్లాసంగానో ఉంటుంది. సుదీర్ఘంలో పాత్ర సంభాషణ కథాంశానికి పరిమితమై దీర్ఘంగా సాగుతుంది. (ప్రసంగంలో సంభాషణ అనేక విషయాలు వివిధ పార్శ్వాల్లో స్పృశింపబడితే సుదీర్ఘంలో అన్యవిషయాల ప్రసక్తి చాలా తక్కువగా ఉంటుంది.) చెప్పే విషయం దీర్ఘంగా సాగుతుది. ఇది ఉద్రేకంతో ఆలోచనతో కూడుకొని, ఉంటుంది. రచయితలో ఏదో విషయాన్ని ఇంకా బాగా వివరించాలన్న అభిప్రాయం వల్ల, ఈ రకమైన సంభాషణ అవతరిస్తుంది. ఎదుటి పాత్రను పురస్కరించుకొని సందర్భవశంగా వివృతమౌతుంది. సంక్షిప్తంలో



పాత్ర సంభాషణ కథాగమనంలో వేగాన్ని అధికం చేసే లక్షణం కలిగింది. అవసరమైన వివరాల జోలికి పోకుండా ఆవేశాన్నీ ఉద్రేకాన్నీ ఎప్పుడూ ఒకే స్థితిలో నిలుపుతూ, ఆలోచనా స్పర్శతో సంగ్రహంగా వాక్యోపవాక్య విన్యాసం ఉంటుంది. కథలో పాత్రపై ప్రధాన దృష్టితో అవసరం మేరలో వర్తిస్తూ ఎంతో ప్రభావాన్ని నెరపుతుంది. ఎంతో వ్యంగ్య చమత్కృతినీ ప్రదర్శించే లక్షణం కలిగి ఉంటుంది. నాటకీయ ధోరణికి దగ్గరగా పాత్ర మనస్తత్వంపై ఒరపిడులతో మెరపులతో విలసిస్తుంది. టెలిగ్రాఫిక్‌లో పాత్ర సంభాషణ మరీ తక్కువగా ఉంటుంది. సంక్షిప్తత ఎక్కువగా ఉంటుంది. మనస్తత్వప్రధానమైన నవలల్లో దీన్ని బాగా చూడవచ్చు. కథలో అఖండమైన వేగంతో తీవ్రతతో చిత్రితమయ్యే పాత్ర మానసిక సంక్షోభాన్ని పూర్తిగా వ్యక్తం చేయడానికి కథలో వ్యవధానం లేకపోవడం చేత, ఈ ధోరణి అవలబించబడుతుంది. చాలా భాగం, ఈ సంభాషణలో, పదాల మధ్య, వాక్యాల మధ్య భావం పైకి అనకుండా ఎదుటి పాత్రల ఆలోచనకు వదిలివేయబడుతుంది. పదాల వాక్యాల సమన్వయమూ మనస్సులోనే ఏర్పడి భావం సందర్భాన్ని బట్టి రూపు దిద్దుకుంటుంది. ఇది సాధారణ నవలల్లోనూ అక్కడక్కడా విచిత్రమైన సందర్భాల్లో ఉపయుక్తమౌతుంది.

చైతన్య స్రవంతి, (స్ట్రీమ్ ఆఫ్ కాన్షెయస్‌నెస్,) ఆంతరవిశ్లేషణం (ఇంటర్నల్ ఎనాలిసిస్) గల నవలల్లో ఇది ఎక్కువగా కన్పిస్తుంది. ఇది కొంత నాటకీయతను కలిగి ఉంటుంది. శబ్దానికీ వాక్యానికీ మధ్య ఎంతో ఆలోచన చేయవలసి ఉంటుంది. దీని చేత సామాన్య పాఠకులకు, అన్నీ విడమరచి చెప్పాలని కోరే వారికి ప్రీతి పాత్రం కాకపోవచ్చు. ఒక్కొక్కప్పుడు వాక్యం అసంపూర్ణంగానూ ఉంటుంది. ఇలాంటి వాక్యాల పరంపర ఉండవచ్చు. ఈ ధోరణి ఒక విశిష్టమైన సంఘటనను బట్టి, ఒక విచిత్రమైన పాత్ర మనస్తత్వాన్ని బట్టి నవలల్లో ప్రయుక్తం కావడం వల్ల ఎక్కువ ఇబ్బంది పడనవసరం లేదు. సముచితంగానే భాసిస్తుంది శిల్పవంతగానూ తలచే వీలుంది. “అల్ప జీవి” నవలలో గమనించవచ్చు. నవల మొత్తంగా ఈ లక్షణం ఉన్నపుడే కొంత ఓపిక అవసరమౌతుంది. ఇలాంటివి చాలా తక్కువ.

పైన పేర్కొన్న విధాలన్నీ ఒకే నవలలో ఉండవచ్చు. దీని వల్ల సంభాషణలో వైవిధ్యం చేకూరుతుంది. అవసరాన్ని బట్టి ఉపయోగంలో ఔచిత్యంతో కూడిన ప్రయోగ

శిల్పం చేత ఆకర్షణీయంగానూ విలసిస్తుంది. ఈ ప్రత్యక్ష సంభాషణంతో పాటు నవలలో పరోక్ష సంభాషణమూ అపుడపుడూ అవసరం అవుతుంది. ఒక పాత్ర మరో పాత్రతో పరోక్షంగా సంభాషిస్తూ కథలో జరిగింది ప్రసక్తమవుతూ జరుగబోయేది సూచిస్తూ సాగే సంభాషణ పద్ధతి ఇది.

## III

సంభాషణ వాస్తవానికి దూరంగా ఉండకూడదు. భాషా సహజతను కోల్పోకూడదు కృత్రిమంగా ఉండకూడదు. సమాజంలో వివిధ తరగతులకూ వృత్తులకూ చెందినవారు భిన్న రీతుల్లో మాట్లాడే సంభాషణలనూ వాటి ప్రత్యేకతలనూ గ్రహించి, ప్రయోగించవలసి ఉంటుంది. ఏవో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే సాధారణ జీవితంలోని ప్రజల సంభాషణ యథాతథంగా స్వీకరిస్తే, ఎంతో ప్రభావయుతంగా ఉంటుంది. వాస్తవ జీవితంలో ఒక సంఘటన సందర్భంలో ఎన్నో పునరుక్తులు వినిపిస్తాయి. రచనలో అవసరమనిపించని భాష మనకు వినబడుతుంది. నవలలో లేదా నాటకంలో వీటిలో కొంత తీసివేసి, ఒక క్రమంతో కూర్చుకొని, అవసరమైతే మార్పులతో, ఆ స్థితిని దృష్టిలో పెట్టుకొని రూపొందించుకోవచ్చు. ఇది యథార్థమైందీ, ఎన్నిక చేసిందీ పునరుక్తులులేందీ. ఏ మార్పులయినా వాటి ఉపయోగంలో రచయిత ఆశించే ప్రయోజనాన్ని ఆశ్రయించి ఉంటుంది. యథార్థ జీవితంలోని సంభాషణను రచనలో మొత్తం మీద యథాతథంగా స్వీకరించడం కుదరదు. అయితే ఒక్కొక్కపుడు ఒక సంఘటనను పురస్కరించుకొని పాత్ర చిత్రణంలో ప్రత్యేకతను నిలిపేందుకు అక్కడక్కడా ప్రయుక్తం కావచ్చు. ఇది వాస్తవికతకు దూరం కాకుండా, కళాదృష్టితో ఆకర్షణ కోల్పోకుండా, నిర్వహించడంలో రచయిత నైపుణ్యం తలపుకు వస్తుంది. సహజత్వానికి భంగం రాకుండా, చదవడానికి యోగ్యంగా, ఆకర్షణీయంగా ఆసక్తిని పెంచుతూ రచనలో సంఘటన కనుగుణంగా పాత్రకు సముచితంగా సంభాషణ నడపడం నవలలో ఒక కళ. ఇది సంపూర్ణమైన రచనాశిల్పంలో భాగం. దీనికి నిర్దేశకమైన సూత్రాలేమీ లేవు. కేవలం రచయిత వివేచన, ఔచితీదృష్టిపై ఆధారపడింది.



పాత్ర తీరును బట్టి సంభాషణ మారుతుంది. ఇది ప్రవర్తనాపరంగా మనస్తత్వ పరంగా ఉంటుంది. బాహ్యమైన వర్తనంలో పాత్ర సామాజిక స్థితి, పరిసరాలు, సందర్భంలో అభివ్యక్తి ధోరణికి సంబంధించిన లక్షణం ఉంటుంది. స్థానిక గుణంతో మాండలిక భేదంతోనూ ఉండవచ్చు. ఇంకా ఆంతరమైన మనస్తత్వంతో, పాత్ర మానసిక స్థితి, ఆలోచనా ధోరణి, ఆవేశ రూపం, సంస్కారం, అనుభవ శక్తికి సంబంధించిన లక్షణంతోనూ ఉంటుంది. ఇందులో అవ్యక్తచేతన సామూహిక ఆవ్యక్త చేతనల పాత్ర కూడా ఉండవచ్చు.

పాత్ర మానసికంగా కలత చెందినపుడు రచనలో సంభాషణ చెదరు చెదరుగా ముక్కలు ముక్కలుగా సమన్వయం లోపించీ సాగవచ్చు. ఆవేశాన్ని పొందినపుడు వేగాన్ని పొందుతుంది. ఉద్రేకంలో దైర్ఘ్యాన్ని వహిస్తుంది. ఉల్లాసంలో కాల్పనికతను పొందుతుంది. అనుభూతి గాఢత్వంతోపాటు సాంద్రత చేకూరుతుంది. ఒక్కొక్క సందర్భంలో సంభాషణలో పాట లేదా పద్యం చోటు చేసుకోవచ్చు. వివిధ పాత్రలు ఒకే సందర్భంలో ఒక్కొక్క విధమైన సంభాషణ ధోరణుల్ని అందుకోవచ్చు. ఒకే పాత్ర వివిధ సందర్భాల్లో భిన్నమైన ధోరణుల్ని అవలంబించవచ్చు. ఈ విధమైన వైవిధ్యవిలసితమైన సంభాషణ, నవలలో వాస్తవికతపై శిల్పంపై దృష్టితోనే ప్రవేశపెట్టబడుతుంది. జీవితం ప్రధానమైన నవలలో సందర్భానికి తగినట్లుగా పాత్రల్ని ఆశ్రయించే సంభాషణ వాస్తవ సదృశంగా రూపొందడం అవసరం.

నవలలో సంభాషణ ఎన్నో విధాలుగా ఉపయోగానికి వస్తుంది. 1) కథను ముందుకు నడిపేందుకుగాను కావలసిన వేగాన్ని సాధిస్తుంది. 2) పాత్రల మధ్య జరిగే సంభాషణం అడుగున చర్య కదలుతూఉంటుంది. ఇది కథను నడిపించడమే కాకుండా పాత్రలతో సంఘటనలతో ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధం కలిగి ఉండి, పాత్ర వికాసానికీ ఇతివృత్త పరిణామానికీ ఉపకరిస్తుంది. 3) పాత్ర ఆవేశాన్నీ మనోభావాన్నీ స్పందననూ ఉద్దేశాన్నీ ప్రకటించడంలో తోడ్పడుతుంది. 4) క్లిష్టమైన పరిస్థితు లెదురైనపుడు పాత్ర ఎదుర్కొనే సమస్యలో చర్య, ప్రతిచర్య ఏవిధంగా వర్తించేదీ చక్కగా ప్రదర్శిస్తుంది. 5) పాత్రల ప్రభావం ఒకదానిపై మరొకటి ప్రసరించే తీరును వివృతం చేస్తుంది. 6) సంఘటనలు ఒకదానితో మరొకటి అంచెలు అంచెలుగా

అనుసంధితం కావడానికీ, పాత్ర ప్రవేశానికీ నిష్క్రమణానికీ బాగా తోడ్పడుతుంది. 7) పాత్రలు, సంఘటనను బట్టి కథలో నిశ్చయమైన భావానికభిముఖంగా ప్రవర్తింపజేస్తుంది. 8) కథనాన్ని ప్రకాశవంతం చేస్తుంది. 9) రచయిత నాటకీయతను అవలంబించినపుడు ఎంతో వేగయుతంగా ప్రభావశీలంగా కథనదృష్టితో ఆకర్షణీయమైన అభివ్యక్తికి తోడ్పడతుంది. 10) నవలలో కథలో అవయవ సంబంధమైన వివిధాంశాల సంయోజనంలోనూ ఎంతో ఉపకరిస్తుంది. 11) మానవ స్వభావం తీరును ఆవిష్కరిస్తూ సమాజంలోని జీవన యాథార్థ్యాన్ని తలపిస్తుంది. 12) నవలలో పరిపూర్ణతను సిద్ధింపజేయడానికి తనదైన పాత్రలో బాగా తోడ్పడుతుంది.

ఒక్కొకపుడు పాత్ర వివిధ సందర్భాల్లో వివిధ రీతుల్లో ఎన్నో సామాజిక శ్రేణుల్లో వాడుకలో ఉన్న సంభాషణ సాగించవలసి ఉంటుంది. రచయిత భాషను సూటిదనంతో, వ్యంగ్యంతో ఎన్నో అర్థచ్ఛాయలతో సూక్ష్మ సూక్ష్మమైన భేదాలతో వైవిధ్యాన్నీ వైచిత్రినీ ప్రదర్శిస్తూ ఆకర్షణీయంగా ఉండే విధంగా తీర్చవలసి ఉంటుంది. రచయిత నిశితమైన లోక పరిశీలనం చేత, శిల్పదృష్టి చేత సాధ్యమవుతుంది. ఈనాడు మారుతూన్న సమాజంలో పల్లెల్లో పట్టణాల్లో నగరాల్లో గడిపే జీవన ప్రపంచంలో వివిధ వలయాలు, అంతస్థులు, ఇంకా వైయక్తిక, జాతి వృత్తి పరిసరాల పరంగా ఎన్నో ధోరణులను బాగా పరిశీలించవలసి ఉంటుంది. వీటిని తప్పించుకోవడం వల్ల రచనకు న్యాయం చేకూరదు. కాబట్టి రచయిత తప్పనిసరిగా శ్రద్ధతో పరిశీలించి, వివేచనతో గ్రహించి, కళాదృష్టితో నిర్వహించవలసి ఉంటుంది. నవల జీవిత స్వరూపం యొక్క ప్రతిబింబమూ, చిత్రమూ వ్యాఖ్యానమూ వివరణమూ దర్శనమూ అవడం చేత, వాస్తవ సాదృశ్య స్థితిని బట్టి జీవితంలో వలె నవలలోనూ సంభాషణ ప్రమేయం అనివార్యమౌతుంది.

సంభాషణ పాత్ర వ్యక్తిత్వాన్ని నిలిపేదిగా, సంఘటనకు స్థితి చేకూర్చేదిగా, ఇతివృత్తాన్ని వికసింపచేసేదిగా, ఉద్దేశాన్ని ప్రకాశమానం చేసేదిగా ఉండాలి. దీనితో పాటు పాఠకునిలో అభిలాషను నిలుపుతూ, ఉత్సుకతను పెంపొందిస్తూ, కథనంలో సంభాషణ నిర్వహించినపుడే నవల పఠన యోగ్యంగా ఉంటుంది. నవల ఉన్నతమైన ప్రమాణాలతో ఆకర్షణీయమైన స్వరూపాన్ని పొందుతుంది.



# 8. శైలి

పాశ్చాత్య సాహిత్య ప్రభావంవల్ల సిద్ధించిన విమర్శనాంశాలలో శైలి ఒకటి. ఇంగ్లీషు పద్యం, 'స్టైల్'కు సమానార్థకంగా వాడబడుతూంది. ఆవేశాన్నీ ఆలోచనల్నీ లేదా ఆవేశమూ మరియు ఆలోచనల క్రమ పద్ధతిని సరిగ్గా (చక్కగా) వ్యక్తం చేసే భాషా లక్షణం శైలి. ఇది రచయిత భాషా ప్రత్యేకతకు సంబంధించింది.

ఇందులో శబ్దాలు, వాటి అమరిక, ఆవేశమూ, ఆలోచన, వీటి క్రమ విధానమూ, రచయిత వ్యక్తిత్వం అనే అంశాలున్నాయి. ఇది భాషనూ, మనఃప్రపంచాన్నీ, అక్షర పదక్రమ విన్యాసాన్నీ, రచయిత స్వభావ రూపాన్నీ భావింపచేస్తుంది. ఈ లక్షణాల సమన్వయంతో అవతరించే శైలి మొట్ట మొదట నవల ఆరంభించగానే వాతావరంతోపాటు ఆకర్షిస్తుంది. ఇది భాషా నైపుణ్యాన్ని ఆశ్రయించి ఉంటుంది. శైలికీ భాషకూ గల సంబంధం విశిష్టమైంది. మొదట పేర్కొదగిందీ. ఇది ఆకర్షణ కళతో సిద్ధిస్తుంది. కళాత్మకమైన విశిష్ట రూపంలోనే రచయిత వ్యక్తిత్వమూ ప్రదర్శితమౌతుంది. సృజనాత్మక రచనా ప్రక్రియలో ఇది ప్రత్యేకంగా గుర్తింపబడుతుంది. ఇంచు మించు శైలికి సమాంతరంగా భారతీయ సాహిత్య శాస్త్రంలో వృత్తి పాకము రీతి మొదలయిన పదాలు కొంచెం అర్థ భేదాలతో కనిపిస్తాయి.

నవల మొత్తం వచన రూపం కావడం చేత, పద్యంలో వలె వైవిధ్య ప్రదర్శన కెక్కువ అవకాశం ఉండదు. ఉన్నంతలో రచయిత శిల్ప విన్యాసం చేత కథనంలో సంభాషణలో వర్ణనలో వివరణలో, ఆసందర్భాన్ని బట్టి పాత్రను బట్టి సముచితమైన ధోరణిని అవలంబించడం జరుగుతుంది. ఒక్కొక్క రచయిత శైలి మొత్తం మీద ఒక్కొక్క విధంగానూ రూపొందుతుంది. ఒకరితో పోలిన వ్యక్తిత్వం మరొకరికి ఉండదు. ఎక్కడన్నా క్వాచిత్కంగా ఏవో కొన్ని సామ్యాలు ఉండవచ్చు. ఒకే రచయిత తన

+ Style is a quality of language, which communicates precisely emotion and thoughts or a system of emotion or thoughts peculiar to the author.
- Middleton Murray - The Problems of style.

వ్యక్తిత్వంలో ఉండే వివిధ పార్శ్వాల్లో భిన్న రీతులుగా రచనలు చేయవచ్చు. ఇది అతని నైకముఖ వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. అయినప్పటికీ ఒక సాధారణ లక్షణం అంతర్నిహితంగా సర్వత్రా విలసిస్తూ ఉంటుంది. అది పైకి స్పష్టంగా కన్పించకపోవచ్చు. కాని కళాత్మక విధానంలో రచయిత వ్యక్తిత్వాన్ని స్ఫూర్తికి తెస్తుంది. స్థూలంగా శైలి స్వరూపం ఇది. ఎవరి పద్ధతి వారిది, ఎవరి శైలి వారిది, వ్యక్తిత్వవలెనే, నడతవలెనే.

వ్యక్తి – ఆకృతి, మాట, నడక, స్పందన – ఆలోచన, దృక్పథం, ప్రవర్తన, అన్నీ లేదా కొన్ని ఒక చోట సమాహార భూతంగా కలసిన బహ్యాంతర రచనా విధి విధానం, శైలి – సాహిత్య రచయిత వ్యక్తిత్వాన్ని భావింపజేసి మనలో ఒక అభిప్రాయాన్ని ముద్రితం చేస్తుంది. ఈ ముద్రలో గాఢత, స్పష్టత, విశిష్టత, వ్యక్తిత్వాన్ని బట్టీ ఒక ఆకర్షణీయతను కలిగి ఉంటాయి. నవలలో శైలి రచయిత ప్రత్యేకమైన సాహిత్య వ్యక్తిత్వాన్ని ఆవిష్కృతం చేస్తుంది. ఒక్కొక్కపుడు నవల అపూర్వ విజయానికీ అపజయానికీ శైలి కీలకమైన పాత్ర వహించింది. శైలిపై అధికారం ఉన్న రచయిత నవల విస్తృత పరిధుల్నీ, వైవిధ్య పార్శ్వాల్నీ, ఏ విషయాన్నైనా తనలో ఇముడ్చుకొనే లక్షణాన్నీ ఎంతో నిపుణంగా అవసరాన్ని బట్టి వినియోగించుకుంటాడు. ఇతివృత్త నిర్మాణం పాత్ర చిత్రణం వాతావరణ పరికల్పనం అభిప్రాయ ప్రకటనం మొదలైన అపరిహరణీయమైన అంశాలకు ఆవిష్కార రూపమైన శైలికి. భాష ఆశ్రయసాధనం. కవిత్వంలో సంక్షిప్తత గుప్తత వ్యంజకతతో సారభూతమైన చిక్కని సౌందర్యాకృతి వెలుగుతూ ఉంటుంది. నవలలో దీనికి భిన్నంగా వైపుల్యం, స్పష్టత, వివరణంతో చక్కని అల్లికతో, సౌందర్య రూపం పరచబడి ఉంటుంది. ఎక్కడన్నా ప్రత్యేకమైన ప్రయోజనాన్ని మనస్సులో పెట్టుకొని, వ్యంగ్యస్ఫూర్తి ఉండవచ్చు. ప్రతీకాత్మనూ పొందవచ్చు. ఒక పద్ధతిలో, సులభంగా అవగాహనకు వచ్చే విధంగానే తీర్చబడుతుంది. అసలు నవల ప్రక్రియా స్వరూపంలోనే ఎక్కడి కక్కడ విప్పుకొని, అక్కడక్కడా అందుకొని, అల్లుకొని పోయే సంశ్లిష్ట లక్షణం ఉంది. ఈ మౌలికమైన రచనా తత్త్వం శైలిలో మిగతా ప్రక్రియల నుండి ఎంతో భేదాన్ని కలిగిస్తుంది. అందువల్ల నవలలో శైలిని పరిశీలించే అంశం వేరుగా పరిశీలించవలసి వస్తుంది. కవిత్వం లేదా నాటకం కొలమానాలు దీనికి పూర్తిగా అన్వయించవు.



## II

మంచి నవలలోని శైలి అనువాదంలో తీసుకొని వచ్చే వీలుందా? అని ప్రశ్న! అనువాదంలో మూల రచనలోని శైలి నిస్సందేహంగా లోపించే మాట నిజం. 1) శబ్దాల సహయోగం – వాక్య విన్యాసం 2) ఆలోచన – ఆవేశం 3) ఒక క్రమ విధానంలో ఆకర్షకమైన అభివ్యక్తి విశేషం రచనలో శైలి అనుకుంటే, మొదటిది, భాషాగతమైంది. బాహ్యస్వరూపానికి సంబంధించింది. అనువాదాలలో తీసుకొని రావడం కష్టమైనపనే. రెండోది అంతస్తత్వానికి సంబంధించింది కొంత సులభం. ఇది శైలిలో భాగమేనన్న సంగతి మరచిపోకూడదు. మూడోదిపై రెండిటి యొక్క కలయిక చేత ఏర్పడిన ఆవిష్కార రూపమే. విధాన పరమైంది. శైలి విజయం వీటిపై ఆధారపడింది. అభివ్యక్తి సుందరతను భావింపజేస్తుంది. అనువాదంలో కూడా కొంత ప్రయత్నించి, మొదటిదాన్ని అనువాదం చేసే భాషా మర్యాదల్ని బట్టి కొంత వరకు సాధించవచ్చు. అది సోదర భాషలైతే అవకాశం ఎక్కువ. సృజనాత్మక రచనల అనువాద విషయంలో అనువాద రచయిత తన వ్యక్తిత్వాన్ని పరిహరించుకోవడం ఉ పసంహరించుకోవడం కుదరదు. అతడూ రచయిత అయితే, సృజన శక్తి ఉద్గమనాన్ని నిరోధించలేడు. ఏ మైనా, మూల రచన లోని భాషాగతమైన సంపూర్ణ శక్తినీ, శైలీ రామణీయకతనూ అదే ప్రమాణంలో, అదే విధంగా అనుభవానికి అందించలేకపోవడం, వాస్తవం. దీని వెనుక నున్న అంతస్తత్త్వం ఆవిష్కృతమైన అల్లిక (texture) లోని క్రమా (pattern) న్నీ అందుకొనే వీలుంది. తాను అనువాదం చేసే భాషానుగుణంగా, తన వ్యక్తిత్వం తొంగిచూచే విధంగా శైలి సంపాదితమౌతుంది. ఇది అనివార్యం. అనువాదకుడు అనువాద సందర్భంలో రచనాపరమైన నిమగ్నతవల్ల, అనుబంధంవల్ల తనకు తెలియకుండానే, తన వ్యక్తిత్వంతో రచిస్తాడు. ఇది ప్రత్యేకంగా నవలా లక్షణాలతోనూ ముడివడి ఉంటుందన్న విషయాన్ని మరవకూడదు. విక్టర్ హ్యూగో (ఫ్రెంచి) టాల్‌స్టాయ్, డ్రాస్టావస్కీ (రష్యన్) మహా రచయితల రచనలు ఒక భాష నుండి మరో భాష లోకి, అందులో నుండి తిరిగి ఇతర భాషల్లోకి పరివర్తితం అయ్యేప్పుడు శైలీగతమైన మౌలికతను యథాతథంగా నిలపడం సాధ్యం కాదు. ఆలాంటప్పుడు ఎట్లా ఆనందిస్తున్నాం? అంటే నవలలో శైలి కన్న భిన్నమైన ఇతర

లక్షణాల సంవిధానం దీనికి దోహదం చేస్తుంది. రచనలో ఇతివృత్తం పాత్రచిత్రణం. జీవిత దర్శనంతోపాటు స్పందన, ఆలోచన మొదలైన లక్షణాల సహకారం, అనువాదంలో నవల పరిపూర్ణమైన స్వరూపానికి ఎంతో అవసరమౌతాయి. మరో వైపు నుండి చూస్తే అనేక విషయాలచేత యోజితమయ్యే, నవలలోని శైలి ఏకదేశం మాత్రమే. ఒక్కొక్కపుడు, అనువాదంలోని శైలిలోని లోపాలు ఇతరమన వాటి చేత అనువాదం చేసే భాషా సౌందర్యం రచనా నైపుణ్యం చేత పూరింపబడవచ్చు. సాహిత్య కళకు అవసరమన మౌలిక లక్షణాల్లో ఒకటైన శైలి, కనీస స్థాయిలో రామణీయకతను సంతరించుకోకపోతే రచన పఠన యోగ్యంగా ఉండదు. విసుగు పుడుతుంది. చివరి దాకా చదివే అభిలాష సన్నగిల్లుతుంది. దీన్ని స్థిరంగా నిలపడం మూల రచయిత వలెనే అనువాద రచయిత కర్తవ్యం.

## III

నవలలో శైలికి సంబంధించిన మరికొన్ని అంశాలున్నాయి. ఒక విషయాన్ని గురించి వ్రాసేటప్పుడు దానికి సంబంధించిన సాంకేతిక, లేదా ప్రత్యేకమైన శబ్ద జాలం – భాష ఉపయోగించవలసి ఉంటుంది. తత్త్వం – శాస్త్రం లేదా ప్రత్యేకంగా వృత్తికీ, సమాజంలో అంతస్థులకూ సంబంధించింది. ఇది ఆ సాంస్కృతిక వాతావరణంతో ముడివడింది. మాబీడ్ (మెల్‌విలె)లో తిమింగలాల వేట గురించి వ్రాసేటప్పుడు రచయిత ప్రత్యేకమైన శ్రద్ధను కనబరుస్తాడు. తత్త్వశాస్త్రం నుండి భూగర్భశాస్త్రం దాకా విజ్ఞానాన్ని ప్రదర్శిస్తాడు. సముద్రంపై జీవితం గడిపే వృత్తికారులకు సంబంధించిన సహజమైన వాతావరణంతో కొత్త ప్రపంచాన్ని దర్శింపజేస్తాడు. ఇది ఆ పదజాలంతో శైలితో సంబంధం కలిగింది. ఇది ప్రతీకాత్మంకా (Symbolic) నిర్వహింపబడింది. ఇది వేరే విషయం.

ఒక్కొక్కపుడు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికీ, ఒక దేశం నుండి మరో దేశానికీ కథారంగం మారినపుడు ఆ ప్రాంతం, ఆ దేశంలోని స్థానికమైన చిత్రణాన్ని పురస్కరించుకొని భాష–శైలి సంపాదితమౌతుంది. మరొకపుడు రచయిత విజ్ఞాన ప్రదర్శకమైనశైలి– నవలలో కథనం, పాత్ర చిత్రణం, కేవల వర్ణనలోనూ



కన్పిస్తుంది. వేయి పడగలులో వర్ణనలు కల్యాణోత్సవాల సందర్భంలో ఆయా విషయ విజ్ఞాన వివరణంలో శైలి ప్రౌఢంగా, ప్రజ్ఞా సమర్పకంగా ఉంది. ఇదే విధంగా మాలపల్లిలో రామదాసు తత్త్వచింతనంలోనూ కన్పిస్తుంది. చివరకు మిగిలేది నవల్లో కోమలి పాత్రతో స్ఫూర్తిమంతంగా ఉన్న ప్రకృతి వర్ణనమూ పరిశీలింపదగింది. ఇదే నవలలో మరో చోట మరో ప్రయోజనాన్ని నిర్వర్తించే విధంగా ఉంది. అది వేరే విషయం. పైన పేర్కొన్న రచనల్లో భాష, శైలికి సంబంధించినంతవరకు కొన్ని విశేషాంశాలున్నాయి. ఇది వాతావరణం కల్పనలో స్థగితంకావడంతో పరిధి విస్తృతమౌతుంది. అలాగే ఇతివృత్తం, పాత్రతో సంబంధం కలగడంతో మరో పార్శ్వంలో భాగమైపోతుంది. అందువల్ల అన్యోన్యాశ్రయం, పరస్పర సంబంధం చేత సంపూర్ణస్థితిని పొందే నవలలోని శైలిని గురించి ఈ సందర్భంలో ఎంత వ్రాసినా అసమగ్రంగానే ఉంటుంది. నవల ఎన్ని విధాలో శైలి అన్ని విధాలుగా ఉంటుంది.

నవలలో శైలి వాస్తవికం, కాల్పనికం అని రెండు విధాలుగా విశ్లేషించవచ్చు. వాస్తవికం సహజమైన శైలికి, కాల్పనికం అలంకారికమైన శైలికీ దారితీస్తాయి. సామాజికమైన అంతస్థులు, ప్రాంతీయమైన వ్యత్యాసాలు ప్రసక్తమైనపుడు, సహజమైన శైలి సముచితం. ఎన్నో రచనలకు సంబంధించిన ప్రత్యేకతల్లో గమనించవచ్చు. కాల్పనికం రచయిత కల్పనాశక్తిని ప్రదర్శించేది. వర్ణనల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇందులో అలంకారికతకు ప్రాముఖ్యం అధికం. కొందరు రచయితలు ఈనాటికి వ్యవహారిక భాషలో ఆలంకారిమైన శైలిలో– కాల్పనికంగా వ్రాసేవారు ఉన్నారు. నవల– మౌలికమైన స్వరూప స్థితికి భంగం లేకుండా ఉన్నంత వరకు గుణాత్మకమైన శైలిని సాహిత్య సమాజం గౌరవిస్తుంది.

నవలలో శైలి విభాగం (unit)లో వాక్య నిర్మాణం సుదీర్ఘం, సంగ్రహం, మిశ్రమం అని మూడు విధాలుగా కనిపిస్తుంది. 1) కథనం, వివరణం, వర్ణనం మొదలైన సందర్భాల్లో దీర్ఘమైన వాక్యం, 2) కలత, ఆవేదన, బాధ మొదలైన అసాధారణ స్థితులూ, మనోభావాలు ప్రకటించేందుకూ, సంభాషణలో చిన్న వాక్యం; 3) ఈ రెండిటి మిశ్రమం కథనంలో వేగమూ పాత్ర ప్రవర్తనలో ప్రత్యేకతల్ని బట్టి ఉపయుక్త మౌతాయి. భాషా స్వరూపం, వాక్యవిన్యాసం ఈ రెండూ శైలిలో ప్రాథమికమైన

విభాగాంగాలు కావడం వల్ల, మొత్తం మీద బాహ్య సౌందర్యాన్ని అనుభవంలోకి తెచ్చేందుకు మొదటి ప్రయత్నం వీటి వల్లనే కలుగుతుంది. ఇది ఇలా ఉంచి ఇందులో ధ్వని (Sound) కి సంబంధించిన అంశమూ, ఈ సందర్భంలో పేర్కొనవలసి ఉంది. వివిధ సందర్భాల్లో ధ్వని (Sound) రీతులు (Patterns) వాక్య స్థాయిలో శైలిని ప్రభావోపేతం చేస్తాయి. నవలలో కొన్ని సందర్భాలో లయాన్వితమైన రచనలో ఇంచు మించు ఒకే విధంగా ధ్వనించే శబ్దాలు, ఒక దాని తరువాత మరొకటి లేదా కొన్ని నియతమైన స్థానాల్లో ఉండే విధంగా పునరావృత్తం జరిగి (అనుప్రాసయుతమై) అలంకారిత సిద్ధిస్తుంది. ప్రత్యేకమైన శబ్దగత ధ్వని రీతుల (Sound Patterns) చేత, లయాత్మకమైన విచిత్రగతులచేత ఏర్పడే నిబిడమైన శిల్పమూ శైలి నిర్మాణంలో భాగమే. మరో విధం ఒక ఆవేశంలో ఆవేగంతో భాషా ప్రసారం సాగుతుంది. రావిశాస్త్రి "అల్ప జీవి"రచనలో గమనించవచ్చు.

## IV

నవలలో శైలి రచయిత సహజమైన ధోరణితో పాటు కళాత్మకతనూ పొందిన నిర్మాణం చేత హృదయవర్జకంగా సౌందర్యమయంగా విలసిస్తుంది. శిల్ప వివేచన కనుకూలంగా ఉంటుంది. ఏమయినా ఆలోచనకు సహేతుకమూ సముచితమూ అనిపించడం అవసరం. ఒకొకపుడు ఉత్తమశైలి అనుభవ సమయంలో హేతువుకతీతమైన స్థితికి దారి తీస్తుంది. కవిత్వంలోకంటే నవలలో పరచబడి ఉంటుంది. కల్పన కంటే వాస్తవానికీ, జీవిత వాస్తవానికి దగ్గరగా ఉండటం వల్ల పాఠకుల కెంతో సన్నిహితమనిపిస్తుంది. సులభంగా అవగాహనకు వీలు కల్పిస్తుంది. మంచి శైలి, పాఠకునిలో చదివింపజేసే శక్తితో, చివరిదాకా అభిలాషను నిలపగలిగిన ఆకర్షణతో నవలకు ఖ్యాతిని చేకూరుస్తుంది.

నవలలో శబ్దాల సహయోగం వల్ల ఏర్పడే ప్రవాహకత వివిధ రీతులలో పాఠకుని ఆలోచనా ప్రవాహాన్ని నిరంతరాయంగా సాగిస్తుంది. రచయిత వ్యక్తిత్వాన్ని భావింపజేసే శైలి పాఠకునిలో ఆయా సందర్భాల్ని బట్టి కథనం (narration), వివరణం (explanation), వర్ణనం (description), సంభాషణం (conversation), వాదం



(argument), చర్చ (discussion), ఉపన్యాస (speech) ధోరణుల్లో బహుముఖాలుగా పొందుపరచబడి ఉంటుంది. వీటికి ఒక్కొక్కవిధమైన శిల్ప విధానం అవలంబింపబడుతుంది. ఇది ఇతివృత్తం పాత్ర మొదలైన అంశాలతో ముడివడి ఉంటుందని వేరే చెప్పనక్కర లేదు. సందర్భాన్ని బట్టి ఒక ప్రమాణంలో నిర్వహించ గల రచయిత శైలీ నిర్మాణంలో ఉన్నత ప్రమాణాలను ఆవిష్కరిస్తాడు. మరో మాట. ఇది నవలలో పాత్రల ప్రవర్తనంలో చక్కని హాస్యం, ఆనందం, విషాదం కరుణ ఉత్సాహం మొదలైన మనోభావ సమర్పకమైన విన్యాసం చేత ఎంతో ప్రకాశిస్తుంది. జాగ్రత్తగా పరిశీలిస్తే శైలి అనేది శబ్దం – భాష బాహ్య సౌందర్యం నుండి, భావం ప్రయోజనం ఆంతర రామణీయకత నుండీ కలిసిన ప్రసారాన్ని పొందడం అనుభవానికి వస్తుంది. ఇది విశిష్టమైన అనుభూతి కెంతగా ఉపకరించేదీ, సహృదయ లోకానికి సువిదితమైందీ.

నవలలో కళ – శిల్పం పేరిట ఏలాంటి సందర్భంలోనూ శైలిలో సాధారణమైన సంభాషణలోని సహజత్వాన్ని, అభివ్యక్తి విధానాన్నీ త్యాగం చేయకూడదు. అపుడే శైలి ఆ భాషా సౌందర్యాన్ని కలిగి ఉంటుంది. ఒక విశేషమైన దృష్టితో కళాభావనతో అనుభూతి సాంద్రతను పెంపొందించే గుణం దీనికి ఉంది. దీన్ని సాధించడానికి భాషలోని నిసర్గమైన లక్షణం ఆధారం కావాలన్నదే ప్రస్తుతాంశం. ఆ తరువాతనే శిల్పగతమైన విలువలకు ప్రాధాన్యం. గొప్ప రచయితలందరూ ఈ రెండిటినీ సందర్భోచితంగా ఎంతో సామరస్యపూర్వకంగా సమన్వయ ధోరణితో ప్రయోజనాన్ని సాధించడం గమనించవచ్చు. ఈ సందర్భంలో తెలుగు వచనంలో తీవ్రత, తీక్ష్ణత, వేగంతో కూడిన వ్యవహారిక వాక్య విన్యాసంతో చలం రచనలు మన దృష్టికి రాకమానవు. ఇందులో భావ స్పందన ఎంత వేగంగా ప్రవరిస్తుందంటే, దాని లయను పాఠకుడు అందుకునే లోపల దూర దూరం ప్రవహిస్తుంది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రచనలు మూటగట్టిన తెలుగు భాషా సౌందర్యాన్ని తలపిస్తాయి. తెలుగు పలుకుబడి సామెతలు జాతీయాలతో మన ముందు ప్రదర్శిస్తుంది. నవలా రచనలో వేయేండ్లుగా పరిణామాన్ని పొందిన తెలుగు కావ్యభాషలోని ప్రౌఢత్వాన్ని ప్రజల నాల్కలపై నర్తించే పలుకులోని చేవనూ భద్రపరచబడిన అమూల్యమైన శిల్ప సంపదనూ అందించే శైలీ

నిర్మాణానికి విశ్వనాథ వేయిపడగలు ప్రాతినిధ్యం వహిస్తుంది. శైలి నవలలో వస్తువునుబట్టీ, రచయిత దృష్టిని బట్టీ అనేకమైన రూపాలు పొందుతుంది. అయితే రచనలో సహజత్వంలో వాస్తవికతకు దగ్గరగా, రామణీయకతలో కళాత్మకమైన స్థాయిని పెంచేదిగా ఉండడంలోనే విశిష్టమైన ప్రమాణాలను సాధిస్తుంది. భాషా గౌరవానికీ దోహదం చేస్తుంది. ఒక రచనను మరో రచనతో పోల్చి చూడడంలో మొదట మన దృష్టికి వచ్చేది అనుకరింపరాని శైలి. నవల ఆరంభించగానే ప్రభావం నెరిపే అంశాల్లో శైలి పేర్కొదగింది. ఇది రచయిత వ్యక్తిత్వాన్ని బట్టి నిర్వహణంలోని శిల్పాన్ని బట్టీ రూపొందుతుంది. రచనలో శిల్పబంధురమైన శైలీ విన్యాసం కళాత్మకమైన విలువల్ని పెంచుతుంది.

ఇది సృజన శక్తిలోని స్వతంత్ర గుణాన్నీ నవత్వాన్నీ స్పందన శీలాన్నీ భావింపచేస్తుంది. ఈ విధంగా వివేచిస్తూపోతే, వ్యక్తుల్ని బట్టి వ్యక్తులెన్ని విధాలో, రచయితలనుబట్టి శైలి అన్ని విధాలన్న అభిప్రాయంలోని ఔచిత్యం, స్ఫూర్తికి వస్తుంది.



# 9. దృష్టి కోణం

ఒక కథ ఉంది. అది ఇంకొకరికి తెలియాలి. దాని అంతట అది వివరించలేదు. మరి ఎట్లా తెలుస్తుంది? ఎవరో ఒకరు చెప్పాలి. ఆ చెప్పే వ్యక్తి అంటే కథకుడన్న మాట. కథతో సంబంధం ఉండీలేనట్లుగా ఎక్కడో ఒక చోట నిలచి ఉంటాడు. అతడు ఎక్కడి నుండి దర్శిస్తున్నాడు? వివరిస్తున్నాడు? అనేది దృష్టికోణంలో ముఖ్యం. ఏ ఏ కోణాల నుండి లేదా స్థానాల నుండి కథ చెప్పబడుతోంది? పాఠకుని కే విధమైన అనుభవాన్ని కలిగిస్తోంది? ఇంకా ఏ విధంగా చెబితే బాగుంటుంది? అనేవి రచయిత స్వయంగా నిర్ణయం తీసుకోవలసినవి. దృష్టి కోణం అంటే కథకుడు (Narrator) ఎక్కడ నిలచి ఉండేదీ, దానికి సంబంధించిన అంశం. కథ చెప్పే వ్యక్తి ఉండాలి. ఎక్కడి నుండి దర్శిస్తే వివరిస్తే అందంగా ఉండేదీ ప్రయోజనం చేకూరేదీ, నిర్వహణంలో అవలంబించే దృష్టి కోణాన్ని బట్టి ఉంటుంది. ఒక ప్రత్యేక సందర్భంలో అతని కొక దృష్టికోణం అవసరం అవుతుంది. ఆ అవసరాన్ని బట్టి దృష్టి కోణాన్ని మారుస్తాడు. కథకుడు, కథకు సంబంధంతో ఎక్కడి నుండి దర్శించేదీ నవలలో సంవిధానానికి (technique) సంబంధించిన అంశం ఔతుంది. ఇది కథ చెప్పడానికి ఉపయోగించే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. ఇది కథనానికి సంబంధిన శిల్పం. ఇందులో ఎన్నో విధాలున్నాయి, పద్ధతులున్నాయి. రచయిత కథనంలో ఆవలంబించే తీరునుబట్టి ఉపయోగంలోకి వస్తాయి. కథనంలో వైవిధ్యంచేత, విశిష్టమైన తీరులో, పాఠకునిలో అభిలాషను, ఆకర్షణను నిలపడమే దీని లక్ష్యం.

దృష్టి కోణం కథన పద్ధతికి చెందిన అంశం. కథకుడు నవల (1) లోపలి నుండి కథను చెప్పవచ్చు. ఏదేని పాత్ర ద్వారా దీన్ని నిర్వహించవచ్చు. 2) బయటి నుండి అన్నీ తెలిసిన వ్యక్తిగా కథ సాగించవచ్చు. తానొక నిర్ణీతస్థానంలో ఉండి కథ చెప్పవచ్చు. ఈ సంవిధానాలన్నింటి ప్రయోజనమూ నవలలో చిత్రితమయ్యే వాస్తవసదృశమైన జీవితాన్ని శిల్పవంతంగా నిర్మించడానికి తోడ్పడమే.

దృష్టి కోణం ఎప్పుడూ ఎంతో కొంత పరిమితమైంది, స్థూల సూక్ష్మావకాశాలతో ప్రత్యేకత కలిగిందీ. బయటి తలుపు తెరచి గడప దాటి బయటికి దృష్టి ప్రసరిస్తే, లేదా కిటికీ నుండి తొంగి చూస్తే ముందు కొంత దూరంలో ఉన్న వస్తువులు కన్పిస్తాయి. ప్రక్కలకు చూపులు ప్రసరిస్తే ఆ వైపున ఉన్నవి చూడవచ్చు. వెనుక భాగం కన్పించదు. ఇందుకు వేరే దృష్టికోణం అవసరం. ఈ విధంగా ఈ అంశానికి ఎక్కడి కక్కడ కొన్ని పరిమితులు ఉంటాయి. ఆరు బయట నిల్చి దూర దూరం దృష్టి ప్రసారించి, చెట్లూ – వచ్చిపోయే మనుషులూ కొండలూ అవలోకించవచ్చు. ఒక్కొక వస్తువు దగ్గరకి వెళ్ళితే సూక్ష్మ సూక్ష్మంగా దర్శించవచ్చు. ఎత్తుకు వెళ్ళి పై నుండి చూస్తే, క్రిందికి నాల్గు దిక్కుల్లోని ప్రపంచం సమీక్షించవచ్చు. అయితే నేలపై ఉన్న వస్తువులు దూరం వల్ల విస్తృతమైన క్షేత్రంలో దృష్టికి చాలా చిన్న చిన్నవిగా ఎక్కువ సంఖ్యలో ఎన్నో కన్పిస్తాయి. వ్యక్తి నిలచిన స్థితిని బట్టీ, దృష్టి ప్రసారాన్ని బట్టీ దగ్గర నుండీ దూరం నుండీ ఎత్తు నుండీ లోతు నుండీ దృష్టి కోణంలో వస్తుస్వరూపం దృశ్యమానం అవుతుంది. అది బాహ్యమైంది. ఇక అంతరమైంది, భావ లోకానికి సంబంధించింది వేరే. ఇది ఎంతో సంక్లిష్టమైంది.

నవలలో రచయిత ఆశించే అనుకూలమయిన ప్రయోగ శిల్ప ప్రయోజనాన్ని బట్టి కథన పద్ధతిలో దృష్టి కోణం ఏర్పడుతుంది. దృష్టి కోణ విన్యాసాన్ని బట్టి విషయ పరిమితీ, దాని ప్రసార వైఖరిని బట్టి వస్తు పరిమితి స్వరూపమూ అవగతికి వస్తాయి. పూర్వ కాలపు నవలల్లో జీవిత క్షేత్రాన్ని స్థూలంగా పరిశీలించే దృష్టి కోణంలో రచయితే కథకుడుగా చాలా భాగం చెప్పేవాడు. రాను రాను ఈ పద్ధతిలో మార్పు వచ్చింది. కథనంలో కొత్త పోకడలు మొదలైనాయి. స్థూలం నుండి సూక్ష్మ సూక్ష్మానికీ, బాహ్యం నుండి అంతఃస్థితికీ మొగ్గు కన్పించడంతో గుణాత్మకమైన మార్పు వచ్చింది. మనస్తత్వ లోకంపై ఆలోచనతోనూ కొత్త దనాన్ని సంతరించుకుంది. కథన శిల్పంలో కొత్త పార్శ్వాలు ఆవిష్కృతమైనాయి.

ఏ దృక్కోణం నుండి కథనం జరగాలో, మొత్తం మీద ఏలాంటి ప్రభావాన్ని కలిగించదలచిందీ, ఏ ప్రత్యేకతను సాధించడానికి ఏ విధానం అనుసరిస్తే బాగుండేదీ, ఏ విధంగా అభిలాషను అవిచ్ఛిన్నంగా నిలిపే శిల్పైక్యాన్ని కోరేదీ రచయిత జాగ్రత్తగా



నిర్ణయించుకోవలసిన విషయం. సాధారణంగా నవలల్లో అవలంబించే దృష్టికోణంలో విధాలు :–

1. నిర్మాణంలో నిర్మాణం (Frame within the frame): ఈ విధంలో ఒక కథా నిర్మాణంలో మరో కథా నిర్మాణం ఉంటుంది. నవలలో కథనం ఉత్తమ పురుషలో ఉంటుంది. ఎవరో ఒకరు కథ మిత్రులకో శ్రోతలకో చెబుతారు. పాత్ర నిర్మాణ రూపమూ ఇందులో ఒదిగి ఉంటుంది. రచయిత ప్రమేయానికి అవకాశం ఎక్కువ. కథకుని దృష్టికోణం పరిమితమై ఉంటుంది. విశ్వనాథ "మా బాబు" నవలలో ఈ లక్షణాన్ని గుర్తించవచ్చు.

2. తటస్థం (objective): ఇందులో రచయిత తప్పనిసరిగా బయటనే ఉంటాడు. నవలలో పైకి ఎక్కడా కన్పించకుండా, ఎక్కడా లేనట్లు విశ్వసింపజేస్తూ తటస్థంగా ఉంటూ పాత్రల చర్యల్ని ఆవిష్కరింపజేస్తూంటాడు. రచయిత వైపు నుండి ఏ అభిప్రాయమూ వివరణమూ ప్రకటితం కాదు. వాస్తవమైన సమాచారంతో, వస్తుగతమైన ఆలోచనతో కథ సాగుతుంది. ఈ విధంలో ఎంతో ప్రభావయుతంగా కథనాన్ని నిర్వహించడానికి అవకాశం ఉంది. ఈ విధంగా దీనికొక విశిష్టత ఉంది.

3. విన్యస్తం (Assigned): నవలలో ప్రతిదీ మార్గదర్శకమైన విధంలో కథనం సాగుతుంది. కథలో జరిగేదంతా ప్రధానపాత్ర చైతన్యం (conscious) పై దృష్టితో రూపొదింపబడుతుంది. కథ ప్రథమ పురుష (III person) లో సాగుతుంది. గోపీచంద్ "అసమర్థుని జీవ యాత్ర"లో ఈ లక్షణాన్ని గమనించవచ్చు.

4. సర్వజ్ఞం (omniscient): కథకుడు సర్వజ్ఞుడుగా కన్పిస్తాడు. అన్నీ తనకు తెలుసునన్న భావంతో ప్రతి పాత్రపై బాహ్యాంతర్వీక్షణం కలిగి ఉంటాడు. తాను ఉత్తమం అనుకున్న నిర్ణయాన్ని చెబుతాడు. తాను కోరిన సందర్భాల్లో వాఖ్యానిస్తాడు. ఒకే పాత్రకు ఎక్కువ భాగం వినియోగింపబడుతుంది. తక్కిన పాత్రలు ఆ పాత్రను అనుసరించేట్లు చేయబడుతుంది. ఒక్కొక్కపుడు రచయిత పాత్రలను అనుసరించకుండా, వెనుక నుండి పరిశీలిస్తూ కథనం కొనసాగిస్తాడు. పాత్ర ఉద్దేశాన్ని పూనుకొని తానే వివరిస్తాడు. ఒక్కొక్కపుడు ఒక విధమైన పరిస్థితుల్లి పాత్రల్ని మనకు తెలీని, అందని

సామాజిక చారిత్రక వాతావరణంలో నిలుపుతూ, తన సామాజిక నైతిక విశ్వాసాలను స్పష్టంగానో సూచనగానో ప్రకటిస్తాడు. ఈ అపరిమితమైన స్వాతంత్ర్యం వల్ల దీనిలో విస్తృతమైన కోణ కటకం (wide-angled lense) దృష్టి ఉంటుంది. పాఠకుడూ పాత్ర తరువాత పాత్రకు, రచయితను అనుసరిస్తూ మెల్లగా పయనిస్తాయి. ఒక చైతన్య (conscious) స్ఫూర్తి నుండి మరో చైతన్య స్ఫూర్తికి రచయిత పాఠకుణ్ణి లాక్కొనిపోతాడు. ఇందులో రచయిత ప్రదర్శించే అసాధారణమైన వైవిధ్యాన్ని గుర్తించక తప్పదు. పాఠకుడింతకూ దూరంగానే ఉండవలసి ఉంటుంది. అంటే పాఠకుని ఆలోచనకు అవకాశం ఉండదు. పాఠకుడు, పాత్ర మధ్య రచయిత నిలచి ఉంటాడు. పాత్రల చర్యలకు సంబంధించిన కీలకమైన స్థానాలపై వశం కలిగి ఉంటాడు. వివరణం చేస్తూ ఉంటాడు. పాత్ర ముఖతః లేదా ఏదో సందర్భాన్ని పురస్కరించుకొని తన విజ్ఞానాన్ని ప్రదర్శించడం ఇందులో మరో విశేషం. ఇదంతా కథకునిలో సరజ్ఞత్వాన్ని భావింపజేసేవి. ఒక్కమాటలో చెబితే రచయిత ప్రమేయం ఏదో ఒక రూపంలో అపారంగా ఉంటుంది. అన్ని పాత్రల మానసిక స్థితులపైనా ఈ సర్వజ్ఞత్వం, చివరకు ఒక విధమైన బలవంతపు ప్రవేశంగానూ ఉంటుంది. ఒక పాత్రలో రచయిత ఎప్పుడూ స్థిరంగా ఉండదు. ఇది చాలా కాలం నుండి వస్తూన్న కథన కోణమే.

ఈనాడు రచయిత కథనం చేస్తూ ఉంటే, పాఠకుడు తన ఆలోచననూ హేతువునూ నిర్ణయాన్నీ కొనసాగిస్తూనే ఉంటాడు అందువల్ల విన్యస్తం, సర్వజ్ఞ దృష్టి కోణాలకన్నా మరోదృష్టి కోణం బహు ముఖీనం Multiple అనుసరింపబడుతూంది బహుముఖీనం: విన్యస్తం మరియు సర్వజ్ఞ దృష్టికోణాల ఉపయోగాలు ఇందులో సమ్మేళభం పొంది, ప్రత్యేకతతో కలిగింది ఈ కారణం చేత ఇది ఆదరణకు పాత్రమవుతూంది. పూర్వ కాలం నవలలు సర్వజ్ఞ దృష్టి కోణం లోనే సాగాయి. ఇది పాత పద్ధతి కిందే లెక్క. రచనా శిల్పంలో పాత్రల పట్ల సమన్యాయం నవ్యత్వాన్నీ ఆకర్షణనూ ఆపేక్షించే కారణంగా బహు ముఖ దృష్టి కోణం ఈనాడు ప్రచారంలోకి వచ్చింది. ఇందులో ఒకే పాత్రను అంటి పెట్టుకొని కథనం జరిపే అవకాశమూ ఉంది. ఇది ఉత్తమ పురుష (I person) ఉపయోగించి లేదా మరో దృష్టి కోణంతోనూ ఉండవచ్చు. ఇది కుతూహలాన్ని రేకెత్తించే గుణం కలిగి ఉంటుంది. ఈ సందర్భంలో



రచయిత ఎంతో నైపుణ్యాన్ని ఉపయోగించవలసి ఉంటుంది. పాత్ర చిత్రణను వివిధ పార్శ్వాల్లో విస్తృతీకరించి, వైవిధ్యాన్ని కూడా చూపడానికి అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రతి నాయకుడు ఉన్న కథల్లో పరస్పర విరుద్ధమైన అభిప్రాయాల ప్రసారం జరిగే సందర్భాల్లో దీని ఉపయోగం ఎంతగానో కన్పిస్తుంది. అనుకూలం, ప్రతికూలం చిత్రణం సమగ్రంగా లేకపోతే సంఘర్షణలో బలం ఉండదు. నవల ఉద్దేశానికీ, పాత్రలకూ ఉన్నతి చేకూరదు కాబట్టి ఈ దృష్టి కోణంలో ఈనాడు ఆలోచనలో, హేతువు బలంగా పనిచేస్తున్న సందర్భంలో అనుసరణీయమౌతుంది. పాత్ర చిత్రణకు సమన్యాయం కల్పించే అవకాశం ఎక్కువగా ఉండడంతో సమ దృష్టిని కలిగి ఉండడంతో ఈ కోణానికి ప్రాముఖ్యం కలిగింది. ఇందులో రచయిత సృజన క్రియలో పాత్రల్ని వాటి స్వతంత్రమైన వ్యక్తిత్వాలతో సాగనిస్తాడు. అవసరమైన చోట మాత్రమే అదీ పరిమితంగా పరోక్షంగా రచయిత పాత్ర ఉంటే ఉంటుంది, లేకపోతే లేదు.

ఏక ముఖ (Single) దృష్టికోణంలో సూక్ష్మమైన పరిశీలనకు కొంత అవకాశం ఉండేమాట నిజమే కాని క్షేత్ర పరిధి నియమితమౌతుంది. మహుముఖీన దృష్టి కోణంలో కథనం జరగడం వల్ల సర్వజ్ఞం, విన్యస్తంలోని ఉత్తమ లక్షణాలు సమన్వయాన్ని పొంది అన్నీ బాగా ఆవిష్కరించడానికి వీలుంది. జీవితం యొక్క సంక్లిష్టతనూ, వైవిధ్యాన్నీ వాస్తవ దృశ్యం (Verisimilitude)గా చిత్రించడానికి ఆధునిక యుగంలో ఎంతో తోడ్పడుతూంది. దృష్టికోణం ఒక్కొక్కపుడు మానవేతరపరంగానూ ఉండవచ్చు. పశుపక్ష్యాదుల కథల్లో, సైన్సు ఫిక్షన్‌లో ఈవిధమైన కథన కోణం చోటు చేసుకుంటుంది. విశ్వనాథ "పులుల సత్యాగ్రహం" నవలను పేర్కోవచ్చు.

## II

నవలలో కథ చెప్పడంలో పూర్వ జ్ఞాపకాల పద్ధతి, ఉత్తర ప్రత్యుత్తరాల పద్ధతి ప్రత్యేకంగా పేర్కొవలసినవి.

పూర్వ జ్ఞాపకాలు (Memories): జీవన రంగంలో విశాలమైన అనుభవం గల అనేక కార్యాలొనరించే వ్యక్తి కథలో స్వీయ స్మృతులు ఆధారంగా కథనం సాగుతుంది. వివిధ స్మృతుల పరంపరలో పై నుండి క్రిందికి దిగే మెట్ల వలె కథ

మలచబడుతుంది. ఇది విషయాలపట్ల ఎంతో ఆసక్తిని కలిగించేదిగా, హృదయాని కెంతో దగ్గరగా, వాస్తవమైన జీవితానుభవంతో చిత్రితమౌతుంది. 1) ప్రధాన పాత్ర సంఘటనల నెదుర్కొనేప్పుడు ఎలాంటి మనోభావాలను పొదిందీ 2) కథ చెప్పేటప్పుడు ఎలాంటి మనోభావాలకు లోనైందీ 3) కథలో ఉత్సుకత తగ్గాక, సందేహం తీరాక ఎలాంటి మనోభావాన్ని పొందేదీ. రచయిత గుర్తు పెట్టుకోవలసి ఉంటుంది. పూర్వ జ్ఞాపకాల ప్రసారంతో కథనం జరిగేటప్పుడు, వాటి అనుభవ ప్రాధాన్యాన్ని బట్టి అక్కడక్కడా పాత్ర వైయక్తికమైన శిఖర భావాన్ని పొందడం జరుగుతుంది. దీనివల్ల వైయక్తికమైన పరిధి ఏర్పడి, క్షేత్ర విస్తృతి పరిమితమయ్యే అవకాశం ఉంది. చారిత్రక సామాజిక వైయక్తిక పార్శ్వాలతో కథ నడపబడుతుంది.

ఉత్తర ప్రత్యుత్తరాలు (Epistolory correspondance): నవలలో పాత్రల మధ్య జరిగే ఉత్తరాల రూపంలో కథనం జరుగుతుంది. ఇందులో రచయిత ఒక్కొక్క స్థితిలోని మనోభావాన్ని చిత్రిస్తూ ఉత్తరాల కాల క్రమంలో లేదా హేతు క్రమంలో కథాసూత్రాన్ని ఆవిష్కరించడం జరుగుతుంది. ఇతివృత్త నిర్మాణమూ పరిణామం ఉ ండదు. పాత్రలు తమ తమ వ్యక్తిత్వాల్లో మాట్లాడుతూ, రచన కొంత నాటకీయ ధోరణి కలిగి ఉంటుంది. కాల క్రమంలోని ఒక ఉత్తరం మధ్యలో చదవడం మానేస్తే ఏదో వెలితిగానూ ఉండే అవకాశం ఉంది. రచయిత ఉత్తరాలను జాగ్రత్తగా అమర్చవలసి ఉంటుంది. ఈ పద్ధతిలో వాస్తవికతకు దగ్గరగా జీవిత చిత్రణం ఉంటుంది. అన్నిటి కంటే మనో రాగానికి (Sentiment) ప్రతిబింబమై ఆకర్షిస్తుంది. పాత్రల జీవితంలో కాలమంతా ఉత్తర ప్రత్యుత్తరాలతోనే కథ నడుస్తుంది. ఉత్తరాల అమరికలో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఇది కథనాన్ని సాగించే ఆసక్తికరమైన సంఘటనల క్రమంలో పూర్వాపరమైన ఔచిత్యాన్ని దృష్టిలో ఉంచుకొనీ ఉంటుంది. ఇదొక పద్ధతి. కథనం జరిపేది పాత్రలే. ఏ ఉత్తరానికది విడిగా ఉంటుంది. వీటిలోని కథాసూత్రాన్ని మెలకువతో లాక్కొనిపోవాలి. దీని అల్లిక వేరు. సాధారణమైన నవలకూ ఈ పద్ధతిలో ఉండే నవలకూ నిర్మాణంలో భేదం ఉంది. పాఠకుడు పొందే అనుభవమూ విచిత్ర,గా ఉంటుంది. ఉత్సుకతను నిలపాలిసిన బాధ్యత పెరుగుతుంది. అందువల్ల రచయిత ప్రజ్ఞతో శిల్ప దృష్టితో ఆసక్తికరంగా నిర్వహించగలిగినపుడే రచన విజయవంత మౌతుంది.



ఫ్రెంచి రచయితలు ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగించారు. దీనికి కారణం ఫ్రెంచి భాష దీనికి బాగా తగి ఉంటుందని ఒక అభిప్రాయం ఉంది. చెకోవ్ మొదలైన రచయితలు దీని పట్ల అంత సద్భావాన్ని కలిగిలేరు. ఈ పద్ధతిలో సంపూర్ణంగా నవల వ్రాయడం వల్ల ఎన్నో ముఖ్యమైన అంశాలు కోల్పోవడం జరుగుతుందని ఒక అభిప్రాయం ఉంది. దీన్ని నవల ప్రక్రియలో ఒక భేదంగా గుర్తించడం జరిగింది. దీని స్థానం దీనికి ఉంది.

ఇది రచయితను ఒక చట్రంలో బిగించి వేస్తుంది. ఇది దీని లోని బలహీనతగా పేర్కోవడం జరిగింది. థామస్ హార్డి వంటివారు దీని పట్ల సదభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. దీని ఉపయోగాలూ పేర్కొన్నారు. నవల మొత్తం మీద దీన్ని అవలంబించినపుడు సిద్ధించే శిల్పరూపం వేరు. ఈపద్ధతిలో 1) ముందు ఒక వైపు నుండి చెప్పేది వినడం 2) తరువాత అవతలి వ్యక్తి ఏమనుకునేది భావించడం 3) ఆపైన తాను అనుకున్నదే ఐతే తృప్తి, ఆనందం పొందడం 4) లేకపోతే కారణాలు వెదకడం, సందేహంపడడం సమాధానపడడం, నిర్ణయానికి రావడం, మొదలైన ప్రత్యేకమైన స్థితులేర్పడతాయి. పాఠకుని మేధకు పని ఎక్కువ అవుతుంది. కథనంలో అనుభవ ప్రసారం ప్రధానంగా ఉంటుంది. ఇదొక విశిష్టమైన ధోరణిలో సాగే సృజనాత్మక శిల్పంగానూ పరిగణించడం జరిగింది. ఈ పద్ధతిలో నవల మొత్తం మీద ఈ సంవిధానం అవలంబించినపుడే రచయిత నేర్పును ప్రదర్శించడానికి, ఒక ప్రత్యేకమైన అనుభవ సమగ్రతగల కళారూపాన్ని సాధించే ప్రయత్నానికీ అవకాశం ఎక్కువ.

ఈ పద్ధతులన్నీ ఎప్పటి కప్పుడు రచనలో నవ్యత కోసం పాఠకునిలో అనుభవ విశిష్టత కోసం రచయితలు చేసే ప్రయత్నాలే. నవల మొత్తంగా కాక రచనలో అక్కడక్కడా ఉత్తర ప్రత్యుత్తరాల పద్ధతి నవలంబించడమూ జరిగింది. ఇదొక విధం.

## III

ప్రతి విధంలో దేని కది ప్రత్యేకంగా స్వీకరించి కథనం చేయవచ్చు. ఇందులో కొన్నింటి కలయికతోనూ సాగించవచ్చు. కాల గతిలో అనేక కారణాలవల్ల ఒక్కొక్క

విధం పాతబడిపోవచ్చు. అయినా కొందరు సమర్థిస్తూ ఉండనూవచ్చు. కొందరు రచయితలు రచనలో తమ అనుభవాల్ని అణచుకోలేక మధ్య మధ్య ప్రకటిస్తారు. పాఠకుల్ని సంబోధిస్తారు. ఇంకా ఏదో వివరణకూ పూనుకుంటారు. పూర్వ కాలపు నవలల్లో ఈ లక్షణం స్పష్టంగా చూడవచ్చు. ఈనాటి దృష్టివేరు. రచయిత దీనికి వ్యతిరేకం. పాఠకులకే ఇదంతా వదిలివేయడం జరుగుతుంది. ఆ విధంగా పాఠకులు తయారు కావాలనే రచయిత ఉద్దేశం. పాఠకులూ దీన్ని సహించే స్థాయిని దాటిపోయారు. అయితే దీనిపై ఒక విమర్శ కూడ ఉంది. రచయిత పాఠకులకు అనుభవంలోకి రావాలనే వ్యాజంతో సంక్షిప్తతను, సందేహాన్ని సృష్టించి తప్పుకుంటున్నాడనేది. ఈ కారణంగా రచయిత ప్రత్యక్షంగా జోక్యం లేకుండా కథన సందర్భంలో జాగ్రత్తగా సూచన చేయవచ్చుననీ మరో అభిప్రాయం. ఏమైనా రచయిత ప్రమేయం చాలా వరకు తగ్గిపోయి పాత్రలు స్వయం వ్యక్తిత్వాలతో ప్రవర్తించడం ముఖ్యమన్న అంశాన్ని గుర్తించారు. ఈ సూచన ఎన్ని విధాలుగానో శిల్పంలో భాగంగానూ పరిణమించింది.

ఏ విధంగా కథనం చేయవచ్చు, వీటిలో ఏ ప్రణాలికకు ఏది మంచిది అనేది రచయిత నిర్ణయించుకోవలసిందే. ఏ దృష్టికోణమైనా నవలలో మొత్తం మీద ఎంత సముచితంగా, ఎంత ప్రయోజనవంతగా ఎంత ఉపయుక్తమైందన్నదే ముఖ్యం.

రచయిత ఎంతో లోకాన్ని చూస్తాడు. ఎంతో భావిస్తాడు. ఎందరో వ్యకుల్ని పాత్రల రూపంలో మలచి కథనం సాగిస్తాడు. ఇందులో వైవిధ్యం కోరడం సహజం. ఏదేని పాత్ర ద్వారా ఉత్తమ పురుష లేదా ప్రథమ పురుషలో కథనం సాగడం విన్యస్త లక్షణం. ఉత్తమ పురుషలో కథనం ప్రత్యేకమైందైనా దీని పరిధి పరిమితమైంది. అయితే పాత్ర ఎంతో సన్నిహితంగా మాట్లాడుతూన్న భావం కలుగుతుంది. ఒక్కొక్కపుడు ఉత్తమ ప్రథమ పురుషల సమీకరణం ప్రత్యేకమైన ప్రభావం కోసం నవలలో జరగవచ్చు. పూర్వ స్మృతులతో చిత్రితమౌతూ ప్రతీకాత్మకంగానూ నాటకీయంగానూ ఆవిష్కృతం కావచ్చు. వివిధ పాత్రలు వివిధ కోణాల నుండి తమ తమ అనుభవాల్ని పురస్కరించుకొని కథనం సాగించవచ్చు. రచయితలో కొత్తను అన్వేషించే లక్షణం,



కొత్త కొత్త కథన విధానాలను ప్రవేశపెట్టేందుకు, ప్రయోగం చేసేందుకు దారితీస్తుంది. ప్రజ్ఞ వల్ల శ్రద్ధ వల్ల, అనుభవం వల్ల సంవిధానంలో సమగ్రత సిద్ధిస్తుంది. కళాదృష్టి వల్ల శిల్పంలో విశిష్టత చేకూరుతుంది. ఏ విధానాన్ని అవలంబించినా మొత్తం మీద నవల పాఠకుల్లో ప్రభావాన్ని ప్రకాశవంతం చేయడం, అనుభవాన్నీ ఆలోచననూ విస్తృతం చేయడంలో భాగంగా పరిణమించడమే చరమ లక్ష్యం.

దృష్టికోణం (పాయంట్ ఆఫ్ వ్యూ) నవలలో కథకుని దర్శన కేంద్ర స్థానం. రచయిత అవలంబించే కథన శిల్పంలో ఆకర్షణీయమైన కథన స్థానాన్ని భావింపజేసే కళావిధం.

## 10. ప్రతీక

సాహిత్యంలో ప్రతీకల ప్రయోగం ఈ కాలంలో విరివిగా కన్పిస్తోంది. ప్రతి సృజనాత్మక ప్రక్రియలోనూ ఎక్కడో ఒక చోట అంతో ఇంతో చోటు చేసుకొంటూంది. ముఖ్యంగా కవిత్వంలో నవలలో ఆధునికతకు చిహ్నంగా ఉంది. శిల్ప పరిధిని కళాత్మకంగా విస్తృతం చేసే అంశంగానూ గుర్తింపుకు వచ్చింది. ఆధునిక యుగంలో మనస్తత్వ శాస్త్రంలో విస్తారమైన పరిశోధన వల్ల ఎన్నో రహస్య విషయాలు బహిర్గతం కావడంతో విజ్ఞానం పెరగడంతో ప్రతీక విశిష్టమైన స్థానాన్ని పొందింది.

ప్రాచీన సాహిత్యంలోనూ అక్కడక్కడా ప్రతీకల వాడుక లేకపోలేదు. పౌరాణిక తాంత్రిక మంత్ర శాస్త్రాలకు సంబంధించిన ఆనేక సందర్భాల్లో ప్రతీక ప్రయోగం కన్పిస్తుంది. మానవుని సంస్కృతిలో మత ప్రస్థానంలో, ప్రతీకల కెంతో ప్రాముఖ్యం ఉంది. పురా గాథల్లో సముద్రం చేతన (కాన్షియస్‌నెస్)కూ, సర్పం ఒకప్పుడు శక్తి (భౌతిక) రూపానికీ మరోకప్పుడు ఆధ్యాత్మిక దశలోకి పరివర్తనంచెందే మానసిక శక్తికీ, ఇంకొకప్పుడు ధర్మానికీ, ప్రతీకగా ఉంది. చంద్రబింబం మనస్సుకూ ప్రతీక ఉంది. ధ్యాన శక్తి కేంద్రాలుగా మంత్ర శాస్త్రంలో ఎన్నో తటస్థపడతాయి. వీటిని గురించి పరిశీలిస్తూ పోతే ఆది మానవ సంస్కృతీ గర్భంలోకి ప్రయాణం సాగుతుంది. సమాజ శాస్త్రం, నృశాస్త్రం, జానపద సాహిత్యంలో దీని ప్రాముఖ్యాన్ని అందరూ గుర్తించిందే. ఈ సందర్భంలో ప్రజల విశ్వాసాలకూ ఆచారాలకూ సంబంధించిన ఆసక్తికరమైన అంశాలెన్నో బయటికి వచ్చాయి. టోటమ్, టాబూ, పురాతన సంస్కృతికి సంబంధించిన చిహ్నాలు సంప్రదాయ పురాణ ప్రతీకలుగా నిలిచిపోయాయి.

ఆధునిక యుగంలో నవలలో ప్రతీకల ప్రవేశం కళాత్మకమైన పాత్రను నిర్వహిసోర్తింది. ఇందులో నేరుగా చెప్పే దాని కన్నా విశిష్టమైన అభివ్యక్తి పద్ధతిలో ఆవిష్కృతం అవుతుంది. రచయిత శిల్ప దృష్టిని ప్రకటిస్తూంది. ఇది ప్రతీకల నాశ్రయించి జరగడం వల్ల, అదీ ఉద్యమ రూపం దాల్చడం చేత ప్రతీక వాదం గానూ వ్యాప్తిలోకి వచ్చింది. ప్రతీక విశిష్టమైన అభివ్యక్తి విధానానికి సంబంధించిన సంవిధానం (టెక్నిక్)గా విమర్శితమౌతూంది. అయితే ప్రత్యక్షంగా కాక పరోక్షకంగా అభివ్యక్తం చేసే కళారూపంగానే, సృజన క్రమంలో అంతర్లీనమై భాసించే తత్త్వమూ దీనికి చేకూరుతుంది. రచయిత తనలో అవహించిన భావ ప్రపంచాన్నీ, ఆవేశ రూపాన్నీ యథాతథంగా అనుకున్న ప్రమాణంలో అందించడానికి ఆశక్తంగానూ, అందింపగలిగినా అసంపూర్ణంగానూ ఉంటుందనుకోవడం వల్ల, కాల్పనికాన్ని ఆశ్రయించడం జరుగుతుంది. ఈ ప్రయత్నమే ప్రతీకను ఉద్గమింపజేస్తుంది. దీన్ని సముచితంగా యోజితం చేయడం చేత రచయిత తాను భావించింది. కొంత వరకైనా సాధించిన తృప్తితో పాటు రచనకూ గుణాత్మకమైన రూపం సిద్ధిస్తుంది.



పందొమ్మిదవశతాబ్దిలో ఫ్రాన్సులో ఇదొక ఉద్యమంగా విలసిల్లింది. ఈ ఉద్యమంలో ప్రముఖంగా పేర్కోదగిన రచయిత బాద్‌లేర్. దీన్ని కొనసాగించినవారు రిమ్‌బాడ్, వెర్‌లేన్, మలరెమ్‌తో బాదర్‌లేర్, అసుయాయులు.[1] కవిని ఋషి స్థాయికి తీసుకుని వెళ్ళారు. కవి వాస్తవ ప్రపంచానికి వెనుక నున్న అతీతమైన దాన్ని చూడగల శక్తికలవాడుగా భావించారు. ఆదర్శ స్థాయిలో అంతటి లోకాన్నీ, ఆలోచనారూపాన్నీ సూక్ష్మ సూక్ష్మంగా రచనలో ప్రవర్తితం చేయడానికి ప్రతీక ఎంతో సహాయపడుతుందనీ విశ్వసించారు. వీరి రచనల్లో వైయక్తికమైన ప్రతీకలు గొప్ప చమత్కృతితో ఆకర్షణీయంగా రూపొందాయి. ఈ రచయితల ప్రభావం ఇంగ్లీషు అమెరికన్ కవులపై బాగా ప్రసరించింది. మొదటి ప్రపంచ యుద్ధం (1914–18) తరువాత కాలం అంతా ప్రతీకవాదమయంగా విలసిల్లింది. సాహిత్యానికి విలువ చేకూర్చే కొన్ని ఉత్తమ లక్షణాల వల్ల ఆ తరువాతనూ కవిత్వం, నవలలో వాటి ఉన్నతికి దోహదం చేసేదిగా నిలిచింది. ప్రాచీనంగా వస్తూన్న సంప్రదాయ ప్రతీకలతోపాటు, పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల భారతీయ సాహిత్యంలో అందునా తెలుగు నవలలో ప్రతీకాత్మకత విశిష్టమైన

1. 'Le Poete. Voyant' (The Poet - seer). Rimbaud.

గుణాధానానికి దారి తీసిందనడంలో అనుమానం లేదు. పురాణ గాథలు, మతమూ, తత్త్వంతో కూడిన సంస్కృతి నా(శయించిన సం(ప్రదాయ (ప్రతీకలతో పాటు, ఆధునిక యుగ (ప్రభావంతోనూ కాల్పనిక వాతావరణంతో వాస్తవ స్ఫూర్తితోనూ సాగింది. సృజనాత్మక శక్తి (ప్రసారం కలిగిన వైయక్తికమైన (ప్రతీకల (ప్రయోగం సమృద్ధంగా కన్పిస్తుంది.

సాహిత్యంలో (ప్రతీక కళాత్మకమైన విలువల్ని అధికం చేసేదిగానే రాణిస్తుంది. పూర్వం నవలలో ఎక్కడో అక్కడక్కడ, తెలీకుండానో, తెలిసో చోటు చేసుకునేది. ఈనాడు (ప్రయోజన తత్పరతతో విస్తృతంగా (ప్రయుక్తమౌతూంది. దీన్ని సమర్థించేందుకు మానవుల (క్రియాకలాపమంతా (ప్రతీకాత్మకమే[3] నని సాధారణీకృతం చేసే ఆలోచన కూడా జరిగింది. నవల మానవ జీవితాని కత్యంత సన్నిహితమైంది. కాబట్టి అంతర్గతంగా (ప్రతీకను పర్యవసింపచేసే యోచన ఇందులో స్పష్టం. సాహిత్యమంతా ఒక విధంగా (ప్రతీకాత్మకమే. అదే విధంగా భాష కూడా అనీ అనడడం జరిగింది. సాహిత్యం భాషాగతమైంది. మానవులు పరస్పరమూ మనోభావాలను (ప్రకటించేదుకు ఉపయోగించే సాధనం భాష. ఇది ఒక (క్రమంతో కొన్ని గుర్తుల ఏర్పాటు వల్ల రూపొందింది. ఇది భాషాగతమైన మౌలికమైన అంశాన్ని స్పృశిస్తుంది. భాషా పరమైన దృష్టికీ, సాహిత్యపరమైన దృష్టికీ ఈ సందర్భంలో భేదాన్ని గుర్తించడం అవసరం. (ప్రస్తుతం సాహిత్యపరంగానే అభిలషణీయం. (ప్రతీక సాహిత్యానికి అవశ్యకమైన స్థితిగానూ పరిగణించడం విశేషం. నవలలో ఇది అనివార్యమైందిగానూ స్పష్టం చేయడమైంది.

1) గుర్తు 2) (ప్రతీక – ఈ రెండూ సందర్భాన్ని బట్టి పరస్పరం పరివర్తనం చెందుతాయి. మొదటి దాని విస్తరణ రూపంగా రెండోది పరిణమించడమూ ఉంది. ఈ స్థితిలో గుర్తునూ, (ప్రతీకనూ వేరు వేరుగా స్పష్టంగా గుర్తించవచ్చు. గుర్తు (సైన్) పరంపరంగా వచ్చేది. అందరూ అంగీకరించే ఒక నిర్దిష్టమైన భావాన్ని జ్ఞాపకం చేస్తుంది. బాణం ఒక దిశను సూచించేందుకు గుర్తు. ఒక్కొక్కపుడు ఒక విషయంపై (ప్రత్యేకంగా దృష్టిని నిలిపేందుకు గుర్తించడానికి ఉపయోగిస్తుంది. గుర్తుకు నిర్ణీత (ఆర్బిట్రరీ) లక్షణం ముఖ్యం. (ప్రతీక విషయంలోనూ చాలా కాలంగా ఒక అర్థం వాడుకలో ఉండవచ్చు. అది సం(ప్రదాయ (ప్రతీకగా స్థిరపడింది. అయినప్పటికీ సాహిత్యంలో ఆపైన ఇంకా ఊహకు అవకాశం కలిగిస్తూనే ఉంటుంది. మరో సందర్భంలో వేరే అర్థాన్ని స్ఫురింపజేసే అవకాశం తప్పకుండా ఉంటుంది. ఒకే (ప్రతీక ఆ తరువాత మరొకరి చేత వాడుకలో సందర్భాన్ని బట్టి కొత్త అర్థాన్ని ఉద్దేశించవచ్చు. ఈ భేదాన్ని స్పష్టంగా గుర్తించి, మొదటి దాన్ని నిర్ణీత (ఆర్బిట్రరీ) (ప్రతీక అనీ, రెండో దాన్ని సాహిత్య (లిటరరీ) (ప్రతీక అనీ పేర్కొనడం జరిగింది.

ఒకప్పుడు నిర్జీవమై, స్థిరపడిన గుర్తు లేదా చిహ్నం, ఆ తరువాత ఆ పరిధిని దాటి విస్తృతిని పొంది సాహిత్య (ప్రతీకగా (ప్రతివర్తనం పొందవచ్చు. ట్రాఫిక్‌ను నిలిపే ఎరుపు రంగు అపాయానికి గుర్తు. ఇది సాహిత్యంలోనూ (ప్రయుక్తమై నిర్దిష్ట పరిధిని దాటి సంఘర్షణకూ విప్లవానికీ (ప్రతీకగా విస్తృతదశను పొందింది. అదే విధంగా ట్రాఫిక్‌ను ముందుకు సాగించే క్షేమానికి (నిరపాయానికి) గుర్తు అయిన ఆకుపచ్చ రంగు సమృద్ధికీ, సౌభాగ్యానికీ యోజితమైంది. గుర్తు, (ప్రతీక రెండూ ఉపయోగించే సందర్భం, ఆశించే (ప్రయోజనాన్ని బట్టి వేరు వేరు లక్షణాలతో మనకు అవగతికి వస్తాయి.

గుర్తు ఒక దానికి బదులు మరొకటి 1:1 (ప్రాతిపదికపై ఉంటుంది. (ప్రతీక ఎప్పుడూ ఒక దాని బదులు మరొకటిగా ఉండదు. (ప్రకృతార్థం వీడకుండా ఆపైన మరో విశిష్టమైన భావాన్ని స్ఫురింపచేస్తుంది, ఆలోచింపచేస్తుంది. ఇది బహ్వర్థకం. గుర్తుకు పూర్తిగా భిన్నమైన స్థితిని పొందుతుంది. వివిధ వ్యక్తుల ఆలోచనా శక్తిని బట్టి ఎన్నో విధాలైన అర్థాలనో భావింపచేసే శక్తినీ కలిగి ఉంటుంది. ఒకే (ప్రతీక, అర్థ సముచ్చయాన్ని ఏకాలంలో స్ఫురింపజేసే శక్తినీ కలిగి ఉంటుంది.

(2) 1890 తరువాత డబ్ల్యు బి. ఏట్సు, టి. ఎస్. ఇలియట్, డిలాన్ థామస్, ఇ. ఇ. కమింగ్స్, వెలేస్ స్టీట్స్.

(3) Virtually all human activity is symbolic. Tindall.

ప్రతీక వాస్తవికం అనీ, ఆదర్శకం అనీ రెండు విధాలు, వాస్తవికం మానవ జీవితంలో భౌతికమైన ప్రాపంచిక వాస్తవాన్ని ఆశ్రయించింది. కోట రాచరికానికీ రక్షణకూ భద్రతకూ ప్రతీక. రెండోది ఆదర్శకం పరం, దివ్యం, శ్రేయం మొదలుగా ఉత్కృష్టమైన అతీత లక్షణాలు కలిగింది. భూమి మాతృ శక్తికీ, ఆకాశం ఆదర్శానికీ హంస ఆత్మకూ శాంతికీ ప్రతీకలు. మరో విధంగానూ సందర్భాన్ని బట్టి ఉంటుంది. ఎంతో కాలం నుండి ఉపయోగంలో ఉంటూ స్థిరపడినవీ, సంస్కృతిలో భాగంగా నిలచినవీ పూర్వ గాథా సంపన్నమైనవీ సంప్రదాయ (ట్రెడిషనల్) ప్రతీకలు. ఉదయించే సూర్యుడు కొత్త జన్మకూ, అస్తమించే సూర్యుడు మృత్యువుకూ, వెలుగు జ్ఞానానికీ, చీకటి అజ్ఞానానికీ, ఆదిశేషుడు విద్యకూ, పాము సంతానానికీ ఇలా ఎన్నో ఉన్నాయి. ఇవే వివిధ సందర్భాల్లో వేరే అర్థాలను భావింపజేస్తూ రచనకు దీప్తిని కలిగిస్తాయి. సందర్భాన్ని బట్టి నవలలో కవిత్వంలో విశేషార్థాల్ని ప్రకాశింపజేస్తాయి.

ఇవి రచయిత ప్రతిభ చేత స్వతంత్రమైన వ్యక్తిత్వాన్ని బట్టి ఎంతో కాల్పనికతనూ, ఆలోచనా స్ఫూర్తినీ సంతరించుకున్నాయి.

వైయక్తిక లేదా వ్యక్తిగత (పర్సనల్) ప్రతీకలు. ఇవి మొదట్లో రచనలో కష్టంగా తోచినా కాలం గడిచే కొద్దీ వాడుకలో సుగమత్వాన్ని పొందుతాయి. షెల్లీ, కీట్సు మొదలైన కాల్పనిక కవుల రచనల్లో వ్యక్తిగత ప్రతీకలు చాలా ఎక్కువ. ఒక భావ చిత్రంలో పుష్పం బహ్వర్థకంగా జీవితానికీ, స్త్రీకీ, సౌందర్యానికీ ప్రాణానికీ ప్రతీకయై ఉండవచ్చు. మెల్‌విలె నవల మాబిడిక్‌లో తిమింగిలం బహ్వర్థకమైన ప్రతీకగా నిలిచింది. 1. తిమింగలం అంటే కేవలం జల జంతువు. 2. తెల్ల జాతి రక్త మాంసగతమైన భౌతికరూపం. 3. ఆత్మ యొక్క ప్రస్థానం (దీన్ని చాలా మంది నిరాకరించారు.) 4. నృశాస్త్ర – సాంఘిక – మనస్తత్వపరమైన అర్థాలు. 5. ముఖ్యంగా ఫ్రాయిడ్, యుంగ్ మనస్తత్వపరమైన సిద్ధాంతాల అన్వయంతో సందర్భాన్ని బట్టి వివిధార్థాలు. ఈ విధంగా అనేకమైన అర్థాలు వెలువడినాయి. విశ్వనాథ – వేయిపడగలు



1) పరిపూర్ణ సనాతన ధర్మానికీ 2) అవ్యక్త సామూహిక చేతనలోని పురా రూపానికీ (అర్కిటైపు) 3) అధర్మాన్ని సహించని ఆత్మశక్తి కలిగిన భౌతిక రూపానికీ 5) కర్మసాక్షి భౌమాకృతికీ, ఈవిధంగా అనేకమైన వాఖ్యానాలకు అవకాశ మిచ్చే ప్రతీకగా నిలచింది. ఈ ప్రతీకలు వాస్తవానికి దూరమై నిత్య జీవితం నుండి తప్పించుకునే ప్రయత్న పర్యవసానాలనే అభిప్రాయమూ ఉంది. ఇది నిజం కాదు. సాహిత్యంలో అందులోనూ నవలలో జీవితం ఆధారంగా, వాస్తవ స్ఫూర్తితోనే ఇది వాడబడుతూందన్న విషయం మరచి పోకూడదు. జీవితంలోని అనేక ముఖాలను స్పృశించే లక్షణం దీనికి బాగా ఉంది. రచనను శిల్పవంతం చేసే గుణమూ కలిగింది. రచనకు బృహదాకృతినిస్తుంది. చింతనలో గాఢతకూ అనుభూతిలో సాంద్రతకూ అవకాశమిస్తూంది.

## II

అదృశ్యమానమైన ఏదేని వస్తువుకో భావానికో దృశ్య రూప సంకేతమే, ప్రతీక. మనిషి మనసులోని ఆలోచనలు, ఆవేశాలు నేరుగా వర్ణించకుండా మూర్తమైన (కాంక్రీట్) భావ రూపాల పోలికతోనో సూచనతోనో వ్యక్తీకరించే కళారూపం – ప్రతీకవాదం. పాఠకునిలో ప్రకృతంతో పాటు మరో భావ ప్రపంచాన్ని భావింపజేస్తుంది. ప్రతీక నిర్మాణంలో వాస్తవాన్ని వీడ కుండానే, అతీతమైన భావ ప్రపంచంలోకి ప్రవేశింపజేసే లక్షణం ఉంది. ఒక్కొక్కప్పుడు మూర్త లక్షణానికి భిన్నంగా వర్ణించే వస్తు సామ్యంలో నిబిడమైన భావన చేత అమూర్త (ఎబ్‌స్ట్రాక్ట్) మైన లక్షణం చోటు చేసుకోవచ్చు. ప్రతీకలో అర్థం అవగతికి వచ్చే ముందు దాని రూపం అనుభవంలోకి వస్తుంది. అనుభవాన్ని బట్టి ఆపైన హేతువు పనిచేస్తుంది. రచయిత సాధారణంగా సమగ్రంగా వ్యక్తం చేయలేని లేదా గుప్తంగా ఉంచదలచుకున్న భావం, వాస్తవాన్ని స్పృశిస్తూనే మరో రూపాన్ని అందుకోవడం ఇందులో ముఖ్యం. గాఢత్వమూ. గభీరత్వమూ మొదలైన విశిష్ట గుణాలు ఒక ప్రమాణంలో ఆలోచనాస్థానీయాలై ఉంటాయి. రచనలో భావం లేదా ఉద్దేశం పరోక్షంగా అర్థవంతమూ విశిష్టమూ అయిన కళాత్మక రూపంలో ఆవిష్కృతమవుతుంది. పాఠకుల మనస్సును ఆకర్షిస్తుంది,

ఆలోచింపచేస్తుంది. ఇది రచయిత మనస్సులో దాగి ఉన్న భావ లోకాన్ని వ్యక్తం చేస్తుంది. నవలలో సాధారణ కథాజగత్తుకు కళాత్మకను సిద్ధింపజేసే ఉద్దేశంతోనూ, పాఠకుల్ని ఆలోచింపచేయాలన్న అభిలాషతోనూ ప్రతీక అవతరిస్తుంది. వాస్తవ జగత్తు నుండి భావనా జగత్తులోకి లేదా ఆదర్శ లోకంలోకి చొచ్చుకొనిపోయేందుకు చేసే ప్రయత్నమే ఇది. అయితే, దీని నిర్మాణ రూపం సాధారణంగా నవలలో వాస్తవతలం పైనే స్థిరంగా ఉంటుంది. దీని అస్తిత ఇతివృత్తం పాత్ర అభిప్రాయ సంఘటనలు వాతావరణం మొదలైన అంశాలకు సంబంధించి ఉంటుంది. నవలలో దేన్నైనా మరచిపోవచ్చు కానీ ప్రతీకను సులభంగా మరచిపోలేరు. దీని ప్రభావం ఎంతో శక్తివంతమైంది. నవల ఆరంభం నుండి సమాప్తి దాకా, ఆఖరికి పేరు పెట్టడంలోనూ ఏ స్థానంలోనైనా ప్రతీక ఉండవచ్చు. రచనకు ఆకర్షక రూపాన్ని ఇస్తుంది.

ప్రతీక పూర్వం నుండీ అంతో ఇంతో వాడుకలో ఉన్నా దాని ప్రమేయం చాలా పరిమితమైంది. కాల్పనిక యుగంలో మనస్తత్వ శాస్త్ర పరిచయంతో, నవ్యత కోసం అన్వేషణలో, బహువిస్తృతమైన పరిధినీ వైవిధ్యాన్నీ సంతరించుకుంది. దీనితో ప్రతీకాత్మక నవల వాస్తవం నుంచి కాక కాల్పనికం నుండి అవతరించిదన్న అభిప్రాయం వ్యాప్తిలోకి వచ్చింది. ఇందులో కొంత నిజం లేకపోలేదు. శిల్ప విషయంగా చూస్తే ఒక్కొక్కపుడు వాస్తవ భూమి నుండి భావ లోకానికి మలుపు తిరిగేటప్పుడు, భావ రూపాలు కొంత అస్పష్ట ధోరణినీ, అమూర్త స్థితినీ పొందే వీలుంది. అపుడు ప్రతీక బాగా తోడ్పడుతుంది. మెలరమ్ పేర్కొన్నట్లు ఈ సందర్భంలో అమూర్తానికీ, మూర్తానికీ మధ్య రెండిటినీ కలిపే ఒక బంధం అవసరం. ఇది కవిత్వానికి ఎక్కువగా అన్వయిస్తుంది. నవలలో ఈలాంటి సందర్భాలు తక్కువగా ఉంటాయి.

కవిత్వంలోనే మొదట దీని ప్రవేశం జరిగింది. వ్యాప్తి పొందింది. ఇటీవల నవలలోనూ ప్రాముఖ్యం లభించింది. ఉన్నత స్థాయిని ప్రకాశమానం చేసే అవసరమైన లక్షణంగానూ భావితమవుతూంది. పూర్వ కాలంలో గొప్ప రచయితలు టాల్‌స్టాయ్, విక్టర్ హ్యూగో, బాల్జాక్ మొదలైనవారు ప్రతీకపై దృష్టి లేకుండానే రచనలు చేశారు. ప్రతీకపై అంతగా దృష్టిలేనివీ, తటస్థమైన దృష్టితో ప్రాముఖ్యం ఇవ్వకుండా వ్రాసినవీ,



ఎన్నో ఉత్తమ రచనలు లేకపోలేదు. వాటిలోనూ ప్రతీకను గుర్తించవచ్చు. తెలుగులో ఉన్నవ, బాపిరాజు మొదలుగా పేర్కోవచ్చు. జీవితంలో అన్ని రంగాల్లో మార్పులు వచ్చినట్లే సాహిత్యంలోనూ ఎన్నో వచ్చాయి. ఈ మార్పులు రాకపూర్వం జీవితం సుఖంగా లేదా? అని ప్రశ్నించవచ్చు. అయితే ఈ మార్పుల ప్రభావానికి దూరంగా ఉంటూ ఇప్పుడు జీవితం గడపగలమా? అదనపు సుఖాన్ని వదలుకోగలమా? అనే ప్రశ్న. మొట్ట మొదట అవసరాలకు తగిన ప్రయోజనాల్లో ఈ మార్పులను కాదని దూరంగా ఉండలేం. అవి జీవితంలో భాగమయినాయి సృజన రచన విషయంలోనూ ఇదే వర్తిస్తుంది.

ఆధునిక యుగంలో ప్రతీకవాదం ఒక ఉద్యమంగానూ విలసిల్లడంతో, సాహిత్యంలో దీని ప్రభావం తప్పనిసరిగా పరిణామంలో భాగమై నిలిచింది. పోను పోను మార్పును కోరే లక్షణంతో కళాత్మకతనూ సంతరించుకోవడం విశేషం. ప్రతీక నవలలో ముఖ్యంగా ఆసక్తి దాయకమైన ఆధునిక లక్షణంగా పరిశీలనార్హమైన ప్రశస్తిని పొందింది. ప్రతీక అనేది శాస్త్ర పరిచయంతో, పరిజ్ఞానంతో ఏ విధంగా ప్రయుక్తమైనా, కళాత్మకమైన కారణాల వల్ల అనివార్యమయిందీ. వచ్చే మార్పుల్ని తనలో విలీనం చేసుకొని ప్రస్థానం సాగించే సాహిత్యంలో. గుణాత్మకమైందీ, ఉన్నతమైన విలువలకు దోహదం చేసేదీ. తప్పకుండా ఆహ్వానించదగిందీ అవుతూంది, అయింది.

## III

నవలలో ప్రతీక కథా పరిధి లోనే భావితం కావాలి. కథా పరిధికి భిన్నంగా లేదా ఏ మాత్రం సంబంధం లేకుండా యోజితం కాకూడదు. ఇది సాధారణ నియమం. ప్రతీకపై మోజుతో ప్రయోగించడం అసలు ప్రయోజనం దెబ్బతింటుంది. అస్పష్టతకు దారితీస్తుంది. పాఠకుల్లో వైముఖ్యాన్ని కలిగిస్తుంది. ఇక విమర్శకులు ప్రతీక కెన్నో అర్థాలు అన్వేషించి ఏదో విధంగా సమన్వయం చేయాలనే డొంక తిరుగుడు ప్రయత్నమూ చేయకూడదు. రచనలో ఉపయోగించినవి రచనలో ఎంతవరకు సముచితంగా నిలబడేదీ జాగ్రత్తగా వివేచించి, ఆ పరిశీలనకు పూనుకోవడం మంచిది.

అధివాస్తవిక కవిత్వంలో ప్రతీక నిర్వహించే పాత్ర స్పష్టమే. హేతువు కన్నా అనుభూతికీ, చేతన (కాన్షియస్) కన్నా ఉపచేతన (సబ్ కాన్షెయస్)కూ ప్రాముఖ్యం ఎక్కువ. ఈ ధోరణి ఎంతో సాంద్రమైందిగానూ వేగవంతమైందిగానూ ఉంటుంది. నవలలో అనుభూతి గుణాన్ని పెంచుతుంది ఆలోచకు వేగాన్నీ చేకూరుస్తుంది. నవలలో ప్రతీక వస్తువు – ఇతివృత్తం – పాత్ర – సంఘటనలు మొదలైన అంశాల సంబంధంచేత రచన స్థాయి పెరగడానికీ అవకాశం ఎక్కువ. ఈ దృష్టితో చూస్తే వస్తువుకో, భావానికో ప్రాతినిధ్యం వహించే ప్రతీక, నవలలో కళాత్మతమైన శోభనిస్తూంది. సమాజంలో మానవీయ సంబంధాలు, మనస్తత్వాలు, ప్రవర్తనలు – ప్రభావితం చేసే పరిసరాలు, రచయిత సిద్ధాంతాలూ ఆవిష్కారంలో ప్రతీక ఎంతో రమణీయమైన పాత్రను నిర్వర్తిస్తూంది. సాధారణం నుండి గహనమైన విషయాల దాకా దీని ఉపయోగం వ్యాప్తమైంది. విశిష్టమైన సంక్లిష్టమైన స్థితుల్లో దీని వినియోగంలో రచనకు కలిగే ఉత్తమ కళారూపంలో ఉన్నతంగా కనిపిస్తుంది.

దీన్ని సంగ్రహంగా చెబితే, ఒక ప్రతీక అర్థం ఇదమిత్థమని తేల్చి ఆలోచనల్ని పరిమితం చేయడం కుదరదు. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధమైన అర్థాన్ని రచయిత ఉద్దేశాన్ని కథా సందర్భాన్ని, పాత్ర చిత్రణల్ని సంఘటన తీరునూ, వాతావరణ పరికల్పనల్ని బట్టి, అనేక విధాలుగా స్ఫూర్తికి వస్తుంది. ఇది పాఠకుని అనుభవ శక్తిపైనా, ఆలోచనా వైఖరి పైనా ఆధారపడి వుంటుంది. ఇది నియతమైన స్థితికి ఒదిగిపోయి, సంకుచితం కాకపోవడం వల్ల ఎప్పటికీ నవ్యత, ఆకర్షణ కలిగి ఉంటుంది. దీని అన్వయం సందర్భోచితంగా చేయవలిసి ఉంటుంది. ఇది రచన ప్రయోజన విస్తృతిని పెంచుతుంది.

మనస్తత్వశాస్త్రంలో ఫ్రాయిడ్, ఆడ్లర్, యుంగ్– పరిశోధనల వల్ల మానవ జీవితాన్ని గురించి ఎన్నో ఆశ్చర్యకరమైన ఆసక్తికరమైన అంశాలు బయటికి వచ్చాయి, ఫ్రాయిడ్ సైకో – ఎనాలిస్‌లో అణచివేతలు, ప్రతిఘటనలు, లైంగిక ప్రవృత్తులు, కలలు గురించి – అవ్యక్త చేతనలో మారు వేషాలపై క్షుణ్ణంగా శాస్త్రీయమైన చర్చలు జరిగాయి. ఈ రహస్య విశేషాల శోధనలో అన్వేషణలో ప్రతీకల పట్టిక కూడా సిద్ధం



చేయడం జరిగింది. ఇది ప్రతీక వాదానికి మనస్తత్వపరంగా శాస్త్రీయంగా బలమైన ఆధారాన్ని కలిగించింది. ప్రతీకల నిర్మాణానికి మార్గం సులభమైంది. దీని పట్ల ఆసక్తిని పెంచింది. దీన్ని గురించి మరింతగా ఆలోచనకు దారి తీసింది. ఆడ్లర్ నుండి ఇండివిద్యువల్ (Individual) సైకాలజీలో వైయక్తికమైన మనస్తత్వ ప్రకాశనం ప్రవర్తనం (బాల్యం – పరిసరాల ప్రభావంతో రూపొందే) ఆత్మన్యూనతా భావం, ఆత్మాధిక్యతాభావం, నవలలో పాత్ర చిత్రణపై గొప్ప వెలుగును ప్రసరించింది. పాత్ర చిత్రణంలో వైయక్తిక స్థాయిలో మనస్తత్వపు లోతుల్ని ఆవిష్కరించడానికీ ప్రతీకల సహాయం తీసుకోవడమూ జరిగింది.

యంగ్ సాముహిక అవ్యక్త చేతన (కలెక్టివ్ అన్‌కాన్‌షెస్‌నెస్)లో, పరిశోధన వల్ల ప్రతీక వైయక్తిక పరిధి నుండి సామూహిక పరిధి లోకి వెళ్ళడం జరిగింది. సమస్త మానవ జాతి మానసికమైన విచిత్రాకృతులకు – సామూహిక అవ్యక్త చేతనలో నిక్షిప్తమైన కీలకాంశాల్ని గుర్తించడంతో ప్రతీక పరిధి చెప్పరానంతటి విస్తృతినీ గభీరతనూ పొందింది. వైయక్తిక దశ నుండి సామూహిక దశకు తీసుకుని వెళ్ళడంతో, ఇతర మానవ శాస్త్రాలతో పరిచయమూ అనివార్యమయింది. చేతన – ఉపచేతన – అవ్యక్త చేతన – సామూహిక అవ్యక్త చేతన స్థాయిలో ప్రతీక ప్రవర్తనం ఎంతో వైవిధ్య విలిసితమైంది. ఉపయోగమూ పెరిగింది. దీనితో సామాజిక చిత్రణంలో వివరణంలో ప్రతిఫలనంలో పరిమితమైన సమాలోచనంలో కొత్త లోకం ప్రత్యక్షమయింది.

ప్రతీక మనిషిలో చేతనకూ – అవ్యక్త చేతనకూ మధ్య వంతెన అయింది. ఈ రెండింటినీ ఒక విధంగా కలిపే చక్కని రూపంగానూ భావితమైంది. ఆధునిక యుగంలో కేవలం అభివ్యక్తి సాధనంగానే కాక సృజన వికాసంలో అంతర్భాగమై, నవల స్థాయి పెరిగింది. ఇది సరిగా ఉపయోగం లోకి రావడం రచయిత ప్రజ్ఞపై ఆధారపడి ఉంటుంది. కొత్తను అన్వేషించే మనస్తత్వంతో విశిష్టమైన కళాదృష్టితో మనస్తత్వ ప్రకాశనంపై అభిలాషతో నవలను గాఢం సీరియస్‌గా తీసుకొనే ఆలోచనలో ప్రతీక ఎప్పటికీ ప్రాముఖ్యం కలిగే ఉంటుంది.

# 11. చైతన్య స్రవంతి

చైతన్య స్రవంతి విధానం మనస్తత్వ శాస్త్ర ప్రభావం వల్ల సృజనాత్మక సాహిత్యంలో బాగా ప్రచారాన్ని పొందింది. కొత్త ప్రపంచాన్ని దర్శించే అవకాశమూ కలిగింది. పాశ్చాత్య సాహిత్యంతో పరిచయం వల్ల కొత్తదనాన్ని ఆన్వేషించే లక్షణంతో సుప్రసిద్ధ రచయితలు శ్రీశ్రీ, బుచ్చిబాబు, గోపీచంద్, రాచకొండ తమ రచనల్లో దీన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఇటీవల చండీదాస్, నవీన్, మొదలైన ఆధునిక రచయితలు ఈ సంవిధానాన్ని అవలంబించి ఉత్తమ నవలలు వ్రాశారు. దీన్ని నిర్వహించడానికి ఎంతో కొంత మనస్తత్వ పరిజ్ఞానం అవసరం. దీని వల్ల సమగ్రత చేకూరుతుది. సాధికారత ఏర్పడుతుంది. దీనితో ఎంత బాగా పరిచయం ఉంటే, అంత చక్కగా పరిమితులు అర్థమవుతాయి. లక్ష్యమూ బాగా సిద్ధిస్తుంది. పాత్ర చిత్రణలో లోతునూ వేగాన్నీ కలిగిస్తూ కొత్త దనాన్ని భావింపజేసే స్థితీ చేకూరుతుంది. ఫ్రాయిడ్, ఆడ్లర్, యుంగ్ మనస్తత్వ శాస్త్రవేత్తల గొప్ప పరిశోధనల కృషి ఫలంగా మనోజగత్తుకు సంబంధించిన చైతన్య రూపం గురించి ఎన్నో రహస్యాలు బయటికి వచ్చాయి. జీవితాన్ని వెనుక నుండి నడిపే అదృశ్యంగా ఉన్న చైతన్య శక్తుల పాత్ర గురించి తెలిసింది – మనిషిని గురించి అవగాహనలో సంపూర్ణమైన మార్పు వచ్చింది. మనస్తత్వ శాస్త్ర పరిచయం ఆధునిక సాహిత్యానికి పరిహరింపరాని ఒక లక్షణంగానూ నిలిచింది.

'చైతన్యం' అనే మాట ఇక్కడ కాంషస్‌నెస్‌కు అనువాదం. దీనికి అనేకమైన అర్థాలున్నాయి. ఇందులో కొన్ని – అనుభవ పూర్వకమైన జ్ఞాన రూపం అనీ, మెలకువ అనీ, వ్యక్తిలో కోరికల ఆలోచనల అనుభూతుల సమాహార రూపం అనీ, ఒక విషయాన్ని గురించి మనస్సుకు గల జ్ఞానం అనీ, ఆలోచనలకూ అనుభూతులకూ సంబంధించిన స్ఫూర్తి అనీ, మనస్సు యొక్క క్రియాత్మకమైన స్థితి అనీ, ఇలా అర్థాలెన్నో. వీటి వివరణలో ఎంత చెప్పినా ఎంతో కొంత మిగిలే ఉన్నట్లు అనిపిస్తుంది. ఏమైనా



సంగ్రహంగా ప్రస్తుత విషయాన్ని బట్టి మనో వ్యాపారం యొక్క శక్తి రూపంగా భావించవచ్చు. దీని ప్రభావం జీవితంలో కొంత తెలిసీ కొంత తెలియకనూ ఉంటుంది. కాంషస్‌నెస్ అంటే చైతన్యం అనీ దీనికి సంబంధించిన సంవిధానంలోని ఉద్దేశాన్ని దృష్టిలో పెట్టుకొని, తెలుగులో శ్రీశ్రీ, బుచ్చిబాబు వంటి ప్రముఖులు స్ట్రీమ్ ఆఫ్ కాంషస్‌నెస్ అంటే "చైతన్య స్రవంతి" అనీ తెలుగులో ప్రయోగించడం జరిగింది. ఒక వ్యక్తి చైతన్యంగా ఉన్నాడంటే అతనిలో మానసికమైన గతి క్రమం (మెంటల్ ప్రాసెస్) జరుగుతూందని అర్థం. ఒకరు అచేతనంగా (అన్– కాంషస్) గా ఉన్నారంటే ఈ గతిక్రమం విరామాన్ని పొందడమో లేదా నిరోధింపబడడమో జరుగుతుంది. మిక్కిలి గాఢమైన నిద్రలోనూ, స్పృహ తప్పినపుడూ ఇది సంభవిస్తుంది. వ్యక్తి చైతన్యంగా ఉన్నాడంటే అతనికి మానసికమైన స్థితి గురించిన జ్ఞానం లేదా ఎరుక (ఎవేర్‌నెస్)ను కూడా తలపిస్తుంది. అప్పుడు తాను ఆలోచిస్తున్న, అనుభవిస్తున్న జ్ఞానమూ ఉంటుంది. బాగా తెలివిలో ఉన్నదానికీ, అసలే తెలివిలో లేని దానికీ మధ్య ఎన్నో దశలున్నాయి. నిద్ర పొందిన వ్యక్తి పూర్తిగా అచేతనంగా ఉండాలని లేదు. ఎందుకంటే అతడు కనే కలలు, వాటిని గురించిన అనుభవ ముద్రలు, నిద్రనుండి మేల్కొన్న తరువాత పొందిన అనుభవ జ్ఞానం తలపుకు వస్తుంది. అందువల్ల చైతన్యం అంటే వ్యక్తిలో తాను పొందిన మానసికంగా జరుగుతూన్న, సరిస్తూన్న జ్ఞాన ప్రసార రూపమన్నమాట.

ఫ్రాయిడ్ సిద్ధాంతాన్ని బట్టి చైతన్య స్వరూపం మూడు విధాలు. 1. కాంషస్ – మొదటి చైతన్య స్థాయి. 2. ప్రి–కాంషస్ – చైతన్యం క్రిందిస్థాయి. చైతన్యం వెనుకనే ఉండేది. వ్యక్తికి ఆ సమయంలో ఒక విషయం జ్ఞప్తికి ఉండకపోవచ్చు. కాని వెంటనే దాన్ని స్మృతి పథానికి తెచ్చుకోగల ఆలోచనకు స్థానమైంది. 3. అన్–కాంషస్– ఇది చైతన్యం అట్టడుగునకు చెందింది. ఎంతో లోతైంది. సాధారణ పరిస్థితుల్లో బయటికి రాని విషయాలు, ఎప్పటివో ఇందులో పడి ఉంటాయి. ఈ రివయ్యి చాలా ముఖ్యమైంది. సాహిత్యంలో ఇది సముద్రం గానూ, సరస్సు గానూ, లోతైన లోయ, లోయలో సరస్సుగానూ ప్రతీకాత్మను పొందింది. నవలలో సందర్భాన్ని బట్టి రచయిత ఆశించే

ప్రయోజనాన్ని బట్టి ఇది ఎంతో కళాత్మకంగా నిర్వహింపబడడాన్ని గమనించవచ్చు. నీరు సాధారణంగా అవ్యక్త చేతనకు ప్రతీకగా కన్పిస్తుంది. లోయలో సరస్సు, చేతనలో లోతైన పొరలో దాగి ఉన్న పురాభావ (ఆర్కిటయిప్) రూప సంచయాన్ని సూచిస్తుంది. ఇది సామూహిక అవ్యక్త చేతన స్థాయి (level) కి చెందింది. ఇది నిస్సందేహంగా పైకి కన్పించని గభీరతతో లోలోన పడివున్న అనేకమైన పురా భావజాలం నమూనాల (పాటర్న్స్, మాడల్స్)తో నిండి ఉందీ, ఎంతో మహనీయమైందనీ మనస్తత్వశాస్త్ర వేత్తల అభిప్రాయం. ఆధునిక కాలంలో సృజనాత్మక రచనలతో ఫ్రాయిడ్ – మనస్తత్వ విశ్లేషణం, అడ్లర్ – న్యూనతాభావం, యుంగ్ – సామూహిక అవ్యక్త చేతనం సిద్ధాంతాల ప్రభావం బాగా కనిపిస్తుంది. జీవితంలో ఇంతకు ముందు కన్పించని, తాము చూడని మానసిక లోకంపై దృష్టి ప్రసరించి ఎన్నో రహస్యాలు కనుగొనడమూ జరిగింది. ఇంకా మనస్తత్వపరమైన సాహిత్య విమర్శలో ఇటీవల ప్రత్యేకంగా పురా భావ రూపాలకు సంబంధించిన వివేచన కూడా చెప్పదగిన స్థానాన్ని పొందింది.

ఫ్రాయిడ్ దృష్టిలో అవ్యక్త చేతన విస్మృతమైన, అణచబడిన, అనేక విషయాల సంచయస్థానం. ఈతని సిద్ధాంతం ప్రకారం అవ్యక్త చేతన ప్రత్యేకంగా వైయక్తిక (పర్సనల్) గుణోపేతమైంది. యుంగ్ తన పరిశోధనలతో దీనిపై మరికొంత అభివృద్ధిని సాధించాడు. ఈతని సిద్ధాంతం ప్రకారం అవ్యక్త చేతన యొక్క పైపొర నిస్సందేహంగా వైయక్తికమైంది. అయితే దీన్ని ఇతడు వైయక్తిక చైతన్యం (పర్సనల్ కాంషియస్) అంటాడు. ఇది లోతైన పొరపై నిలిచి ఉంది, ఈ లోతైన పొర గల స్థాయిని సామూహిక అవ్యక్త చేతనగా కనుగొనడం జరిగింది. ఈ ఆలోచన ఈతని సిద్ధాంత యొక్క ఆయువుపట్టు. ఇది వ్యక్తిగతం కాదు. అందరిలోనూ ఉండేదీ, సర్వసాధారణమైందీ, ఇందులో నిల్చి ఉండేవన్నీ పురా భావరూపాలు.[1] ఇవి బహుపురాతనమైనవి. ఎన్నో యుగాల నాటివి. అసంఖ్యాకమైనవి. ఈ ప్రతి రూపాలు స్వతంత్ర్యమైనవీ. ఇవి కలలో సాక్షాత్కరిస్తాయి. దైనందిన జీవితంలో మనిషి ప్రవర్తనలోనూ, జీవన పద్ధతుల్లోనూ ఏదో ఒక రూపంలో ప్రతిఫలిస్తాయి.

1. Arche typel (arche) 1. Chief type or model; original type or pattern; Premordial image. దీన్ని పురా(భావ) రూపం అనడమైంది.



చైతన్యం యొక్క వివిధమైన పొరల్లో, నిహితమైన దృశ్యా దృశ్య జీవిత ప్రపంచం ఎంతో కొంత – 'చైతన్య ప్రవంతి' రచనలో నియతమవుతుంది. ఇది అనేకమైన స్థితులతో కూడింది. కాలం ఒక ప్రవాహంగా రూపొందుతుంది. ఆలోచనా తరంగాలతో భావ లయతో విశిష్టమైన గతిలో దర్శనమిస్తుంది. ఈ కారణంగా ప్రవంతి అన్న మాట సార్థకమవుతుంది.

స్ట్రీం ఆఫ్ కాంషస్‌నెస్ తెలుగులో చైతన్య ప్రవంతి అనే పదబంధం మనస్తత్వ శాస్త్రపరమైంది. దీన్ని విలియమ్ జేమ్స్ తన 'ప్రిన్సిపల్స్ ఆఫ్ సయికాలజీ' అనే గ్రంథంలో మొదట రూపొందించాడు.[2] ఇది డోరోతీ రిచర్డ్‌సన్ చేత సాహిత్యంలో ప్రయుక్తమైంది. ఈ సంవిధానానికి మార్గదర్శకురాలుగా ప్రశస్తి వహించింది.[3] హెన్రీజేమ్స్ ద్వారా ప్రవేశ సౌగమ్యాన్ని పొందింది.[4] వర్జినియావూల్ఫ్ రచనలతో ఒక స్థిరమైన స్థితిని పొందింది.[5] ఈమెలో సుకుమారమైన ప్రవృత్తితో సాగే అన్వేషణలో చైతన్య సీమల్ని దర్శించే శక్తి కన్పిస్తుంది. "సామాన్యమైన రోజునీ సాధారణమైన మనస్సునూ సూక్ష్మంగా పరిశీలిస్తే – ప్రకాశవంతమైన పరివేషం కన్పిస్తుంది. చైతన్యం ఆరంభం మొదలు చివరిదాకా స్వచ్ఛమైన కాంతి సంప్రసారం గల పొరతో చుట్టూ వ్యాపించి ఉంటుంది."[6] అన్న మాటలు దీన్ని గురించి చెబుతాయి. 'వేవ్స్'లో వాస్తవికత

2. William (James) (1842-90) అమెరికన్ తత్త్వవేత్త. ఇతడు తత్త్వ శాస్త్రం మనస్తత్వ శాస్త్రం వ్యాసంగంలో జీవితమంతా గడిపాడు. ఇతని రచనలు – 1) Principales of Psychology 2) Varieties of religion 3) The meaning of truth.

3. Dorothy Richardson; Novel. Piligirmage - Dorothy Richardson invented the fictional depiction of the flow of consciousness – Bowling. It is a psychogical autobiography – Bowling.

4. Henry James (1843-1916) ఆంగ్లో– అమెరికన్ నవలారచయిత: ఇతని నవలలు: 1) Federick Hudson 2) Portrait of lady 3) The Golden Bowl.

5. Virginia woolf: Novels. 1) Mrs. Dolloway 2) The light house 3) Waves.

6. "Examine an ordinary mind on an ordinary day... Life is a luminous halo, a semi-transperant envelope, sorrounding us from the beginning of Consciousness to the end." waves.

యొక్క వైయక్తిక దర్శనం బాగా కన్పిస్తుంది. జేమ్స్‌జాయ్స్ కృతుల్లో,[7] ఈ సంవిధానం ముఖ్యంగా యులిసెస్ మహాగ్రంథంలో ఒక శక్తివంతమైన రూపంగా కళాత్మకమైన విలువలతో తన వైశిష్ట్యాన్ని నిలుపుకుంది. రచయిత నవలను చైతన్యంతో ఉజ్జీవింపజేశాడు. యులిసెస్ మానవ జీవితం యొక్క వంగ్య చిత్రణం. ఇందులో అనుభవంతో పాటు ఎక్కువగా మానసికమైన భూమికల్లో జీవితం యొక్క స్థూలమైన సూక్ష్మమైన అనుభవ రూపాలు ఎంతో వివరంగా విశ్లేషితమైనాయి. జీవితంలో ఎదురయ్యే సమస్యలు – మానసికమైన భ్రాంతి, సంఘర్షణ, ఆదర్శాలూ, వాస్తవానికి కల్పనకూ మధ్య అంతరం రెండూ (వాస్తవమూ కల్పన) కలిసే స్థానాలూ చైతన్యం యొక్క వివిధ స్థాయిల్లో ఎంతో నిశితంగా దర్శితమైనాయి. మానవ మనస్తత్వ పరిశీలనంలో విస్తృతీ వైవిధ్యమూ వైచిత్రి గల గొప్ప రచన యులిసెస్ చైతన్య ప్రవంతి విధానానికి ఆదర్శంగా నిలచింది. ఆ తరువాత విలయమ్ ఫాక్‌నర్ మొదలైన రచయితలు దీనికి కొత్త కొత్త పార్శ్వాలతో చిరమైన కీర్తిని ఆర్జించి పెట్టారు. ఫాక్‌నర్ రచనల్లో[8] పాత్ర యొక్క అంతర్దర్శనం ముఖ్యం. లిబిడో[9] యొక్క అవ్యక్త చైతన్యా విష్కారం, స్వప్న విధాన రూపం మొదలుగా మనస్తత్వ ప్రకాశనం అధికంగా కనిపిస్తుంది. సాహిత్య విమర్శలో మే సిం క్లియర్, దీన్ని మొదట డోరోతీ రిచర్డ్‌సన్‌పై ఒక వ్యాసంలో వివేచన చేసింది.[10] ఆధునిక సాహిత్య రంగంలో ఈ సంవిధానం బాగా ప్రశస్తిని పొందింది. తెలుగు నవల – కథ పై బాగా ప్రభావాన్ని నెరపింది.

---

7. James Joyce: Novels 1) Ulysses 2) A Portrait of the artist as a young man. రెండో రచనలో పాత్ర స్టీపెస్ ముసుగులో రచయిత కళారూప యొక్క పరిణామ సిద్ధాంతాన్ని వ్యక్తం చేశాడని – హెరాల్డ్. ఇ. టాలివర్ అభిప్రాయం.
8. William Faulkner: Novels 1) The sound of fury 2) As I lay dying.
9. Libido. లైంగిక వాంఛారూపం (ఫ్రాయిడ్).
10. మే సింక్లేర్, Dorothy Richardson వ్యాసంలో "There is no drama, no situation, not a set sense. Nothing happens, it is Just life going on and on. It is Mirriams Stream of Consciousness going on and on Egoist. April 1918.



## II

చైతన్య ప్రవంతి విధానం నవలలో పాత్రల మానసికమైన క్రమగతి (మెంటల్ ప్రాసెస్)కి సంబంధించిన మనస్తత్వపరమైన అంశంతో నిర్మితమౌతుంది. దీని వల్ల పాత్ర అంతరంగ దర్శనం సిద్ధిస్తుంది. దీని వల్ల ఇంతకు ముందు తెలీని బయటపడని, స్పష్టం కాని, ఎన్నో సూక్ష్మమైన విషయాల పరిశీలనకూ అవకాశం కలిగింది. పాత్రల మనస్తత్వ పరమైన అనేక పార్శ్వాలు, ఒకటొకటీ ప్రకాశమానం కావడంతో దీని ప్రాముఖ్యం బాగా పెరిగింది. ఇందులో స్మృతి (మెమరీ)లో అంతరంగం ప్రవహించే చైతన్యంగా రూపొందుతుంది. స్మృతి కీలకమైన పాత్రను నిర్వహిస్తుందని చెప్పవచ్చు. పాత్రల మానసికమైన క్రమ గతిని స్మృతి నియమించడం చేత, పాత్ర నిర్మాణంలో సంప్రదాయ నవలలో కన్నా, ప్రత్యేకమైన రూపాన్ని పొందుతూంది. ఈ విధమైన రచన చేసే రచయిత, పాత్ర స్మృతి పరంపరా సమయంలో, కాలంతో ప్రవహించే వ్యక్తిత్వాన్ని సృష్టించే ఉద్దేశం కలవాడవుతాడు. ఇందులో చైతన్యం యొక్క పై పొరలను ఛేదించుకొని వివిధ స్థాయిల్లో, అనేక దశల్లోని రహస్యాలను ఆవిష్కరించే ప్రయత్నం జరుగుతుంది. ఇవి అనంతమైనవీ. మనం సాధారణంగా ఊహించలేనివీ. ఇవి ధరించే ఆకృతులు ఆశ్చార్యాన్ని కలిగిస్తాయి, ఉత్సుకతను పెంపొందిస్తాయి. ఈ జీవితంలో ఉంటూ, దీని వెనుక నున్న, కొత్త ప్రపంచంలో తిరుగుతూన్న మానసిక స్ఫూర్తి కలుగుతుంది. కాబట్టి మనస్సు యొక్క బాహ్యామైన ఆవరణలు క్రమిస్తూ, లోపల అడుగున నిహితమైన రూపాల పైనే పాత్ర వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుంది. చైతన్య రూపం వస్తు విన్యాసానికి స్థానమవుతూంది. చైతన్యం క్రింది స్థాయి నుండి పై స్థాయి వరకూ, పాత్ర మనస్తత్వ సమర్పంగా చిత్రించడంలో, రచయిత సందర్భానికి తగిన విధంగా వివిధాంశాలు ఎన్నుకునే వివేచనతో అమర్చే శిల్పంతో కూడిన ఉపజ్ఞ ఎంతగానో అవసరమవుతుంది.

చైతన్య రూపాన్ని రెండు భాగాలు చేస్తే, ఒకటి కింది స్థాయిలో, ఉండేదీ మరొకటి పై (ఉన్నత) స్థాయిలో ఉండేది. కిందిది మసక మసకగా అస్పష్టంగా

ఉంటుంది. పైది ప్రకాశవంతంగా ఉంటుంది. మొదటిది వాక్కుకు పూర్వమైన దశ (ప్రీ – స్పీచ్‌లెవెల్). ఇది సాధారణంగా మన కందదు. రెండోది వాక్‌దశ (స్పీచ్‌లెవెల్)కు చెందింది. మన కందుబాటులో ఉండేదీ. చైతన్య స్రవంతి రచనలో అందని కింది స్థాయిలో అస్పష్టంగా మసక మసకగా, ఇంకా కిందికి పోతే విస్మృతమై ఎప్పుడో, లోతుగా చీకటిలో ఉన్న మనస్తత్వపరమైన, జాతికీ సామూహాలకూ చెందిన ఎన్నో విషయాలుంటాయి. ఇవి విచిత్ర రూపాల్లో అనేక విధాలుగా ఆవిష్కారాన్ని పొందుతాయి.

ఇవి రచనలో ఉద్గమనంలో ఆఫ్ స్ప్రింగ్‌లో ఏ కత్తిరింపులకూ లోను కాకుండా నియతమూ కాకుండా, యథాతథంగా మనస్సు నుండి అవలీలగా పైకి ప్రసరిస్తాయి. రచనలో కళాత్మకమైన విలువలతో సంవిధాన శిల్పం చేత క్రమబద్ధం చేయబడతాయి. ఇది నిర్వహణం క్రిందికి వస్తుంది. వివిధ స్థాయిల్లో ప్రసరించే చైతన్యంతో పాత్ర క్రియాత్మకమైన మనో రూపాన్ని పొందుతుంది. మనస్సు బాహ్యమైన అనేకా వరణలు దాటి, చైతన్యం లోపల ఉన్న పొరల్లోకి ప్రవేశించి, అందులో దాగిన వ్యక్తిత్వ రూపాల్ని బయటికి లాగడం జరుగుతుంది. ఇది సృజన శక్తి పని. మొదటి నుండీ చివరి వరకూ రచయిత ఈ పనిలో కేవలం నిర్వాహకుడు (స్టేజి మేనేజరు)గా మాత్రమే ఉంటాడు. ఏ విధంగానూ పాత్రలను నిర్దేశించడు. ప్రవర్తనను నియమించడానికి పూనుకోడు. ఎంతో తటస్థంగా ఉంటాడు. ఈ కారణంగా పాత్రలు స్వేచ్ఛగా ప్రవర్తించే అవకాశం ఎక్కువ. – నీతి నియమాలకూ కట్టుబడవు. ఎంతో నిర్భయంగా అభిప్రాయ ప్రకటనం కావిస్తాయి. నేరుగా రచయిత ప్రభావం ఏ మాత్రమూ లేని స్వతంత్రమైన వ్యక్తిత్వాలతో ప్రవర్తించడం దీని లోని విశేషం. భాష కూడా సాధారణ సూత్రాలకూ నియమాలకూ కట్టుపడదు. సహజమైన ప్రసంగ ధోరణిని కలిగి ఉంటుంది. కొత్త పదబంధాలూ, పదరూపాలు కొత్త, కొత్త వాక్య విన్యాసాలూ సిద్ధిస్తాయి. ఒక్కొక్కపుడు వాక్యాలు దీర్ఘ దీర్ఘంగానూ, ఖండఖండాలుగానూ ఆకర్షణీయంగానూ సహజమైన శిల్ప గుణాన్ని కలిగీ ఉంటాయి. రచన ప్రవాహ సదృశంగా ఆలోచనా తరంగాలతో



భావలయతో సాగుతుంది. గతం నుండి వర్తమానంలోకీ, వర్తమానుండి గతంలోకీ, పాత్రలు వస్తూ పోతూ ఉంటాయి. కాలం ఒక క్రమంలో ఉండదు. అయినప్పటికీ రచన మొత్తం మీద, పాత్ర స్వరూపంలో పైకి కనిపించని ఒక ఏర్పాటూ, ఒక పద్ధతి పర్యాప్తమై ఉంటుంది.

కాలానికి సంబంధించినంత వరకు ఈ ప్రక్రియలో రెండు రకాలైన రచనలు కన్పిస్తాయి. 1) మొదటిది కొన్ని రచనల్లో కథ. ఒక రోజులో లేదా కొన్ని గంటల్లోనో సమాప్త మౌతుంది. ఒక రోజులో లేదా కొన్ని గంటల వ్యవధిలో ఎంతో కాలానికి చెందిన స్మృతులతో కూడిందీ. అనుభవ పరంపరలో అనేకమైన సంఘటనలతో ఏర్పడే ఇతివృత్తం కలిగిందీ. నిర్దిష్టమైన కాల పరిమితిలో అన్నిటినీ తనలో ఇముడ్చుకొని పూర్ణమైన ఆకృతిని పొందుతుంది. ఇది మానసికంగా చాలా క్లిష్టమైనపని. సజీవ మయిన దర్శన శక్తితో చైతన్య స్థితుల్ని ప్రతిఫలింపజేసే పాత్రలతో రచన పూర్తి స్థాయిలో సాధించడం సామాన్య విషయం కాదు. ఇది రచయితలో సృజన ప్రతిభతో పాటు కళాత్మకమైన నిర్వహణ శిల్ప దృష్టి పైన ఆధారపడింది.

2) రెండోది – ఇపుడున్న పద్ధతిలోనే ఇతివృత్తం సాగుతుంది. నవలలో మధ్య మధ్య చైతన్య స్రవంతికి చెందిన భాగాలు వీలును బట్టి ఉంటాయి. ఇది అటు సంప్రదాయ పద్ధతి ఇటు నవీన పద్ధతి రెండూ కలిసిన రూపం. ఈ పద్ధతిని చాలా మంది అనుసరించారు. బాగా ప్రచారంలోనూ ఉంది. మొదటి దాని కన్నా సులభమైందీ. పాఠకుల్ని సులభంగా ఆకట్టుకునేదీ.

'చైతన్య స్రవంతి' అనేది రచయిత నుండి ఏ వ్యాఖ్యానమూ విశ్లేషణమూ లేకుండా పాత్ర మనసులో నుండి నేరుగా ఉద్గమించే (ఆవిష్కృతమయ్యే) బయటికి వచ్చే కళాత్మకమైన విధాన రూపం[11] నవలలో ఇది రచయిత శిల్ప దృష్టిని బట్టి నిర్మాణ రూపంలో ఏ విధమయిన కళాత్మక విధాన్ని అయినా పొందవచ్చు.

11. Stream of consciousness is a menthod, which gives us a direct quotation from the mind without the author's comment or analysis - Bowling: Stream of consciousness.

## III

ఒక వేళ రచయిత స్వయంగా ఎక్కడయినా కాస్త వివరించడానికీ లేదా వ్యాఖ్యానించడానికీ ఉపక్రమిస్తే అది అంతర్విశ్లేషణం (ఇంటర్నల్ ఎనాలిసిస్) అనే పద్ధతికి చెందుతుంది.[12] రచయిత ప్రమేయంతో విభజన రేఖ స్పష్టం. ఎందుకంటే రచయిత ప్రమేయ స్పర్శతో పాత్ర రూపొందే వ్యక్తిత్వమే వేరవుతుంది. ఇందులో పాత్ర ఆంతరమైన జీవిత రూపం నేరుగా ఆవిష్కృతం కావడానికి బదులు పాత్రకూ పాఠకునికీ మధ్య రచయిత చోటు చేసుకుంటాడు. ఇది పాత్ర నిర్మాణంపైనే కాక పాఠకుని మనస్సుపైనా ఏదో ఒక విధమైన ప్రభావాన్ని నెరపుతుంది. ఇది పాత్రలపై మన కొక అభిప్రాయాన్ని కలిగించేదిగా ఉండవచ్చు పాత్రలను రచయిత తన అభిప్రాయాని కనుగుణంగా ప్రవర్తింపజేసేదిగానూ ఉండవచ్చు. ఇంకా అనేక విధాలుగా ప్రభావం ఉండవచ్చు. ఇది అభిప్రాయాలకూ సిద్ధాంతాలకూ చెందినది కావచ్చు. ఇది సూచనగానూ ఉండవచ్చు. క్రమంగా ప్రమేయంగా మారి చివరకు పాత్రలపై అధిప్యం వహించి వాటిని "కీలు బొమ్మలు" చేయడం జరుగుతుంది.

అయితే అభిప్రాయభేదం ఎప్పుడూ ఉంటుంది. రాచకొండ "అల్పజీవి" నవలలో, రచయిత ఎంతో తటస్థంగానూ, ఏ విధమైన జోక్యం లేకుండా నిర్వహించే ప్రయత్నం జరిగింది. దీనివల్ల రచనకూ ఎంతో సహజత్వం, సజీవమైన వాస్తవ గుణంతో కూడిన మనస్తత్వ లక్షణం చేకూరుతుంది.[13] అందువల్ల ఈ నవల తక్కిన వాటి కన్నా ఏదో విలక్షణంగా మనల్ని ఆకర్షిస్తుంది.

చైతన్య స్రవంతి రచనలో పాత్రల మనస్సు నుండి నేరుగా ఉద్గమన రూపం (డయిరెక్ట్ కొటేషన్) పొందిన రచన నాటకీయతను కలిగి ఉంటుంది. ఇందులో

12. If the author himself intervenes to intepret, analyse or comment, however he employes a different method which shall he labelled as internal analysis - Bowling.

13. Verisimilitude: (జీవిత) సత్యాన్ని పోలిన రూపం నవలలో వాస్తవికతకూ రూపకల్పనకూ గల స్థానాన్ని గూర్చి చర్చకు ఆధారమైంది. ఈ సత్యం జీవితంలోని యథార్థస్థితికి సంబంధించింది. ఇది భౌతికం కావచ్చు, మానసికమూ కావచ్చు.



సంభాషణకు ప్రాముఖ్యం హెచ్చుగా ఉండడమూ ఒక కారణం కావచ్చు. వాచికంతో పాటు అంగికమైన వర్ణనం, హేతు క్రమంలో సంఘటనల ఏర్పాటు, శ్రవ్యంతో పాటు దృశ్యానుగుణమైన ప్రత్యక్షీకరణ పద్ధతి మొదలైనవి వేరే కారణాలూ ఉండవచ్చు. ఒక్కొక్క రచయిత ఒక్కొక్క విధంగా సాధిస్తాడు. ఈ సంవిధానంలో ప్రత్యేకమైన మూర్త (కాన్‌క్రీట్) లక్షణం ప్రముఖంగా ఉంటుంది.

ఇంతకు ముందు చెప్పినట్లు గ్రంథ మంతా ఈ విధానమే ఉండకపోవచ్చు. కొంత భాగం లేదా మధ్య మధ్య ఖండ ఖండాలుగా చైతన్య స్రవంతి చోటు చేసుకోవచ్చు. అంతర్విశ్లేషణంలో రచయిత ప్రమేయం ఉంటుంది. చైతన్య స్రవంతి లక్షణం స్పృశింపబడుతుంది. ఇందులో అమూర్త (అబ్‌స్ట్రాక్ట్) లక్షణానికి కవకాశం ఎక్కువ.

ఈ సందర్భంలో పేర్కోదగింది మరొకటి – అంతర్భాషణం (ఇంటర్నల్ మోనోలాగ్). ఇది స్వగతం కాదు – ఏకాంత భాషణమూ కాదు. దీన్ని చైతన్య స్రవంతిగా భావించే అవకాశమూ ఉంది. ఇందులో పాత్ర మనసులో కదలికను బట్టి, ఒక భావం తరువాత మరొకటి. వెలువడుతుంది. మనసులో అది వచ్చినది వచ్చినట్లుగా పాత్ర సాధారణ సంభాషణగా రూపొందుతుంది. ఈ సమయంలో బుద్ధి చాలా వేగంగా పనిచేస్తూ అంటుంది. మూర్తమైన ఇంద్రియాను భవ ముద్ర నుండి అమూర్తమైన ఆలోచనలు, భావరూపాలు ప్రసరిస్తూ ఉంటాయి. ఇది చాలా పరిమితమైన పరిధి కలిగింది. పాత్ర తీవ్రమైన అనిర్దిష్టమైన (అన్‌డయిరెక్టెడ్) ఆలోచనాగతికి గురైనపుడూ, ఇంకా స్వప్న స్థితిలోనూ, కాల్పనిక ధోరణిలో ఇంద్రియానుభవాన్ని వ్యక్తం చేసేప్పుడూ ఈ విధానం ఉపయుక్త మౌతూంటుంది. పాత్ర మనస్సు ఒక లక్ష్యంతో విశ్లథమైన (లూజ్) ధోరణిలో పని చేస్తూ ఉంటుంది. అంతర్భాషణమూ, చైతన్య స్రవంతి ఒకటి కాదు. దీనిలో దశా క్రమం (పిరియాడిక్ మానర్) లేక పోవడం వల్ల, అప్పటి స్థితిని బట్టి రచయిత అంతర్భాషణాన్ని ఎంతో మెలకువతో ఉపయోగించవలసి ఉంటుంది. ఇదొక శిల్ప సంవిధానమనీ అనడం సముచితమనీ కొందరు సమాధానమూ ఇవ్వడం జరిగింది.

ఇదీ స్థూలంగా "చైతన్య స్రవంతి" స్వరూపం. నవలా రచనలో రచయితను బట్టి ఒక్కొక్క విధంగా రూపొందడం జరుగుతూంది. రచయితకూ రచయితకూ, రచనకూ రచనకూ ఆచరణంలో భేదాన్ని బట్టి ఉంటుంది.

ఆధునిక కాలంలో రచయితకు మనస్తత్వ శాస్త్రంతో అంతో ఇంతో స్థూలమైన పరిచయం అవసరం. "చైతన్య స్రవంతి" విధానం మనోజగత్తును దర్శించే, పరిశోధించే సాధనం. జీవితంలో లోపలి పార్శ్వాలను గురించిన విశ్లేషణమూ, వివేచనమూ, దీని సహాయంతో చేయబడుతుంది. ప్రత్యక్షమైన జీవితం నుండి అప్రత్యక్షమైన చైతన్యం వరకూ అంతా అనుభవ లోకమే. "అనుభవం ఎప్పుడూ మితం కాదు. అది ఎన్నటికీ సంపూర్ణం కాదు."[15].

మనిషిలో కోర్కెలు, ఆలోచనలు, ప్రవర్తనలతో సంబంధం గల చర్యలు అను చర్యలు ప్రతి చర్యలు కలిసి ఏర్పడిన సంఘటనల క్రమం జీవితం. దీని అనుభవం చైతన్యం ఉపరితలం పైని సామాన్యమైన పొర నుండీ, అట్టడుగున ఉన్న మహనీయమైన లో పొర వరకూ వాస్తవమైంది. ఈ కారణంగా చైతన్య పుటర (ఛాంబర్ ఆఫ్ కాంషస్‌నెస్)ను అనుభవపుటర (ఛాంబర్ ఆఫ్ ఎక్స్‌పీరియెన్స్)గా పేర్కొనడం జరిగింది. సామాన్య వ్యక్తిగా సంఘ సభ్యుడుగా, కుటుంబ సభ్యుడుగా, మానవుడుగా, ఇలా ఇందులో ఇంకెన్నో! దేన్ని కదిలించినా ఒక తరంగం వలె ఎగసిపడుతుంది. వీటిని ఒక క్రమంలో అమర్చి ఒక పద్ధతిలో నడిపించడానికి రచయితలో సామాజికతతోపాటు కళాత్మకత అవసరం.

స్మృతులు, ఆలోచనలు అనుభవాల వెనుక నున్న మానవ మనోజీవితాన్ని యథార్థ జీవిత తలంపై చైతన్యాత్మకంగా ప్రవహింప జేయడంతో ఇతర ప్రక్రియల కన్నా నవలలో చైతన్య స్రవంతి విధానం ఒక మంచి సంవిధానం బాగా విజయవంతమైంది. ఈ విధమైన నవలలకు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానమూ

14. Wallace M. Bacon.

15. "Expereience is never limited and it is never complete"- Henry James.



ఉంది. పాఠకునికీ దీని పరిచయం వల్ల రచనా విశేషాల్ని ఇంకా బాగా అనుభవంలోకి తెచ్చుకొని, ఆనందించగలడు. ఆపైన ఆలోచనకూ అవకాశం ఉంది. దీని వల్ల అతడు రచన చదివి పొందే అనుభవానికీ, చేసే ఆలోచనకూ ఎంతో ప్రయోజనకరమైన ఉపయోగం కలుగుతుంది.

ఇంకా వ్యక్తి పర,గానూ సమాజపరంగానూ, మానసికమైన అవలక్షణాల తొలగింపుకూ, విషమ స్థితుల్ని సరిచేయడానికీ ఉపకరిస్తుంది. వ్యక్తుల్లో దాగిన ఎన్నో రహస్య రూపాలనూ దర్శింపజేస్తుంది. మొత్తం మీద గుప్తమైన మనిషి స్వస్వరూపం అవగతికి రావడం వల్ల మానసికంగా ఆరోగ్యకరమైన వాతావరణానికి దారితీస్తుంది. అయితే చివర ఒక మాట – సృజనాత్మక సాహిత్యంలో కళాత్మక వివేచనలో, మనస్తత్వపరమైన పరిశీలనకూ కొన్ని పరిమితులు లేకపోలేదు. సాహిత్య దర్శనంలో ఇదీ ఒక పరిహరింపరాని భాగంగా మాత్రమే గుర్తించి సమాలోచనం జరపడం అవసరం.

# 12. ఉద్దేశం - నిర్దేశం

నవల మానవ జీవితం నుండి ఉద్గమిస్తుంది. అనేక సంఘటనల చేత స్థితుల చేత పోషితం అవుతుంది. జీవితం లోని ఆవేదనను స్పందిస్తుంది. చింతనను అనురణిస్తుంది. జీవితం గురించి ఆలోచింపజేస్తూ జీవితాన్ని నిర్దేశిస్తుంది. రచయిత బాధ్యతనూ అనుక్షణం గుర్తుకు తెస్తుంది. మనిషికి ఎదురయ్యే అనేక సమస్యల్ని పరిశీలిస్తుంది. విశ్లేషిస్తుంది. వ్యాఖ్యానిస్తుంది. ఒకొక్కప్పుడు విస్తృతమైన ప్రాతిపదికపై పరిష్కారాన్నీ ఆన్వేషిస్తుంది, కొత్తవి ప్రతిపాదిస్తుంది. ఈ అన్వేషణం ఎంతో కొంత విజయ రూపం అక్షరాకృతి ధరించడంలో రచయిత అభిప్రాయాలూ సిద్ధాంతాలూ దర్శనమిస్తాయి.

ఈ ఆలోచనా రూపం రచయిత ఉద్దేశాన్ని నిర్దేశించేది. జీవితంపై ఉత్సాహం, ఆశ, అభిప్రాయం, ప్రయత్నం, విజయంతో ఒక సిద్ధాంతాన్నీ, వ్యవస్థనూ, ఆదర్శాన్నీ కలిగి ఉంటుంది. ఇందులో సాంఘిక నీతి, తత్త్వం, రాజకీయ స్థితీ, ధోరణీ వివిధ పార్శ్వాలలో ప్రవృత్తమై కన్పిస్తాయి. ఇవి కాలక్రమేణ మారుతూ ఉంటాయి. జీవితంలో తప్పనిసరియైన మార్పుల్ని నవల ఎంతో వేగంగా అందిపుచ్చుకుంటుంది. మార్పు కోరే జీవితం యొక్క సజీవమైన అస్తిత్వానికి చిహ్నం. సమాజం మూడు స్థితుల్లో ఎప్పుడూ ప్రవర్తిస్తూ ఉంటుంది. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్కటి ప్రముఖంగా కన్పించవచ్చు. ఇవి మొదటిది సంప్రదాయం, రెండోది సంస్కరణం, మూడోది పరివర్తనం అనేవి. ఈ మూడూ సంపూర్ణంగా సమాజానికి సంబంధించినవీ, జీవితంలో విడదీయరాని సంబంధం కలవీ. అయితే ఒక్కొక్క రచయితలో ఒక్కొక్క నిష్పత్తిలో ఇవి రూపొందుతాయి. వీటిని ఏ రచయిత సంపూర్ణంగా పరిహరించలేడు. రచయిత వ్యక్తిత్వాన్ని బట్టి, విశ్వాసాలు సిద్ధాంతాలు నవలలో ప్రతిఫలిస్తాయి. ఎప్పటి కప్పుడు కొత్త దృక్పథంతో దర్శితమౌతూనూ ఉంటాయి. నిరంతరం ప్రవహించే మానవ సంస్కృతిలో భాగమై కదలిపోతూ ఉంటాయి.

నవలలో ఉద్దేశం కథకు ప్రయోజనాన్ని కలిగిస్తుంది. దీనికి తగిన బలమైన సంఘటనలు పాత్రల నిర్మాణం అవసరం. ఈ అంశాలన్నీ విడివిడిగా కన్పిస్తున్నా



రచనలో పరస్పరం అనుబంధతోనే విలసిస్తాయి. వివిధాంశాలు పరస్పరం స్థిలకు అనుగుణంగా యోజితం కావాలి. అన్నీ సమైక్యభావంతో ఒక విశిష్టమైన అనుభవ సమగ్రతను మనలో కలిగిస్తాయి. ఈ అనుభవ పరంపరలో ఆలోచనాభాగం తప్పనిసరిగా ఉంటుంది. అదే ఉద్దేశాన్ని స్పృశిస్తూ ఉంటుంది. ఇది అంతర్గతంగానూ ఉండవచ్చు – మధ్య మధ్య పాత్రల సంభాషణల్లోనూ రచయిత మాటల్లోనూ ప్రకటితం కావచ్చు. అయితే సృజన రచనలో అడుగడుగునా ఈ ఆధిక్యతను ప్రదర్శించ కూడదనే అభిప్రాయమూ ఉంది. దీని వల్ల కళాత్మకతను కోల్పోయే ప్రమాదం ఉందనే వారూ ఉన్నారు. దీని వల్ల రచనకు ఎక్కువగా ప్రయోజన తత్పరత సిద్ధిస్తుందనే వారూ ఉన్నారు. ఇంచుమించు లోకం లోని వ్యక్తుల ప్రతిరూపాలే పాత్రలు. కొందరు వ్యక్తుల లక్షణాల సమాహారం కావచ్చు. దీనిలో కొంత కల్పన ఉండవచ్చు కూడా. ఇతివృత్తమూ లోకంలోని అనేకమైన సంఘటనల ప్రతిరూపమే. రచయిత పాత్రల్ని మలచడంలో, సంఘటల్ని తీర్చడంలో, సంభాషణల ప్రయోగంలో, వాతావరణ పరికల్పనంలో, స్పష్టంగానూ, అస్పష్టంగానూ ఉద్దేశాన్ని భావింపజేయవచ్చు. దీనికి ఎన్నో విధాలైన మార్గాలున్నాయి. ఎంతో నేర్పుగా అన్ని అంశాలతోనూ రచన అల్లడంలో నేర్పే కళ. నవలలో ఉద్దేశం కళారూపంలో జీవిత దర్శనం చేత మహనీయత్వాన్ని పొందుతుంది. ఈ కారణంగా సమాజాన్ని, మనిషి జీవితాన్ని గురించిన ఆలోచన సహజమూ, అనివార్యమూ అవుతుంది.

## II

జీవితంలో ప్రత్యక్షంగా ఎక్కువ సంబంధం ఉన్న ప్రక్రియ నవల. స్త్రీ పురుషుల సంబంధాలు, మనుషుల ఆలోచనలు, అనుభవాలతో కూడిన భౌతిక – మానసికమైన ప్రపంచాల ప్రతిబింబం. రచయితకు మూల వస్తువు మానవ జీవితం – సమాజ రూపం. ఎప్పటి కపుడు మారుతూన్న పరిసరాలతో, ఇదమిత్థమనీ తేల్చి చెప్పలేని స్వభావగతులలో వివిధ మానసిక పార్శ్వాలతో వాస్తవ రేఖల్లో చిత్రితమౌతుంది. ఒకప్పటి జీవితం, మరొకప్పటికి ఎన్నటికీ నమూనాకాదు. అలాగే నవల కూడా జీవితం తనపై నెరపిన ప్రభావాన్నీ, జీవితంపై తనకు గల అభిలాషనూ రచయిత ఎన్నో విధాలుగానో చిత్రించే అవకాశం కలిగి ఉంటాడు. ఇది రచయితలో స్వేచ్ఛను విస్తృతం చేసే విధంగానూ ఉంటుంది. అతని లోని సిద్ధాంతాలకు ప్రత్యేకమైన

భావాలకూ ఇది వేదికగా ఉపయుక్తమౌతుంది. ఒక చిన్న కథ సైతం పరిశీలిస్తే, కోల్పోయే విలువల్ని సూచన చేసేదిగానో, మంచివీ, కావలసినవీ విలువల్ని ప్రతిపాదించేదిగానో ఉంటుంది. ఇది నైతికం కావచ్చు. తాత్త్వికం కావచ్చు. రాజకీయం కావచ్చు. సాంఘికం కావచ్చు. వైయక్తికం కావచ్చు.

వివిధ పాత్రల చర్యలు – ప్రతి చర్యలతో అల్లబడిన నవల ఏవో కొన్ని విలువల్ని కలిగి ఉంటుందనడంలో సందేహం లేదు. ఇవి ఎలాంటివి? సమాజాని కెలా ఉపకరించేవి? అనే చర్చ తరువాత అందుకుంటుంది. అన్నీ అందరికీ అంగీకారం కాకపోవచ్చు. రచయితలో కొన్ని సిద్ధాంతాలపై విశ్వాసం, అభిప్రాయాలపై అభిమానంతో – ఇవి అందరికీ తెలియజేయాలన్న ఆరాటం ఉంటుంది. ఏదో ఒక ఉద్దేశంపై నిశ్చయంతో జీవితాన్ని దర్శింపజేసే లక్షణం నవలకు ఉంది. ఏదో ఉబుసుకుపోకకై వ్రాసే నవలలో దీని కంత పట్టింపు ఉండదు.

గొప్ప నవలలో అనివార్యంగా కన్పించే అన్వేషణ చింతన కారణంగా జీవితాన్ని గురించి నిర్దిష్టమైన ఉద్దేశంలోని ప్రయోజనతత్పరత మనసును మేల్కొల్పుతుంది. సామాజిక స్పృహ గల పాఠకుడు చదివేప్పుడు ఏదో అదనంగా చేరిన అనుభవాన్ని పొందుతాడు. దీని కొరత వల్ల అనుభవంలో సంపూర్ణతకు లోపం కలిగే మాటలో నిజాన్నీ గుర్తిస్తాడు. నవల చదవడం ముగించగానే కళాత్మకమైన విలువలతోపాటు జీవితం గురించి మనస్సు ఆలోచనలో తప్పకుండా నిమగ్నమౌతుంది. ఇది జీవిత సత్యానికీ సాహిత్య రూపానికీ గల బలమైన బంధాన్ని స్పష్టం చేస్తుంది. దీన్ని నిర్దిష్టమైన మార్గంలో ఆలోచనల్ని పయనింపజేయడం రచయిత దర్శనశక్తికి గీటురాయి.

ఏదో దొరకిన అవకాశాన్ని తీసుకొని ఏవో నైతిక ప్రవచనాలతో, సిద్ధాంతాల చర్చలతో, అభిప్రాయాల వాదోపవాదాలతో నింపే ప్రయత్నం కొన్ని నవలల్లో కన్పించవచ్చు. అయితే సాహిత్య కళ తగ్గకూడదు. రచయిత జీవితాన్ని గురించి ఏమనుకునేదీ, జీవితాన్ని ఏవిధంగా చూసేదీ. ఎలా ఉండాలనుకునేదీ, దీనికవసరమైన స్థితి ఏది? అన్న ప్రశ్నకు సమాధానంగా నిర్దేశం! ఉంటుంది. ఏమైనప్పటికీ, రచయిత నైతికవాది. సిద్ధాంత ప్రచారకుడు కన్నా కళాకారుడుగా ప్రశస్తిని పొందడమే సాహిత్య జగత్తులో అభిలషణీయం, సమాదరణీయం. మానవ జీవితాన్ని గురించి పరిశీలనం,



వివరణం, చిత్రణం, దర్శనం, అన్నీ సృజనాత్మక ప్రక్రియయైన నవల్లో కళాపరంగా సాగడంలోనే విశిష్టత ఉంది. రచయిత ఎంతో ఉన్నతమైన శిఖరం నుండి జీవితాన్ని దర్శిస్తాడు. సాధారణ సత్యాలు వస్తుగతమైన దృష్టితో వ్యక్తం చేస్తాడు. మనస్తత్వ ప్రకాశనం గావిస్తాడు. సైద్ధాంతికంగానూ, విశేష భావ సమర్పకంగానూ పరిశీలిస్తాడు. ఏదైనా రచయిత అస్తిత్వం సృజన రూపంలో భాగంగా పరిణమించడమే కావలసింది. అపుడు రచన పాఠకుల మనస్సుపై శక్తివంతమైన ప్రభావాన్ని నెరపుతుంది, సాధారణ పరిధుల్ని దాటి, విశ్వజనీన లక్షణంతో ఆకర్షిస్తుంది.

## III

జీవితం నుండి వస్తువు ఎన్నుకోవడం దాని సరిదిద్ది అపూర్వంగా వివరించడం ఒక ఎత్తూ, దర్శనశక్తితో ఉదాత్తమైన ఉద్దేశాన్ని, నిర్దేశం చేయడం మరొక ఎత్తూ. వాస్తవానుభవాన్ని ఉద్దేశంతో నింపి నింపి, రచయిత నిర్దేశంతో చైతన్యవంతం చేస్తాడు. దిశాగతిని సూచిస్తాడు.

రచయిత జీవితం నుండి వస్తువు ఎన్నుకోవడం, దీన్ని తన పథకాన్ని బట్టి స్వేచ్ఛగా ఉపయోగించుకోవడం, తాను స్థాపించే భావ ప్రపంచం లేదా సిద్ధాంతాన్ని నిశ్చయించుకోవడం అనేవి రచయిత నవలా రచనలో క్రమించే వివిధ దశలు. జీవిత దర్శనాన్ని అవగాహన చేసుకోవడానికి 1) జీవిత వాస్తవం 2) నైతికత 3) సామాజిక దర్శనం 4) ఆదర్శం – అనేవి పరిశీలనార్హాలవుతాయి. నవలలో వాస్తవం జీవితం, కొన్ని విలువల చేత తీర్చబడి, నిశ్చయమైన ఉద్దేశం కేంద్రంగా సామాజిక దర్శన శక్తిని పొందాలనుకున్నపుడే రచయిత వ్యక్తిత్వానికీ సమగ్రత సిద్ధిస్తుంది. ఈ నిర్దేశంలో –

1) సంప్రదాయంలోని విలువల్ని గౌరవించడం 2) నైతికమైన విలువల్ని కాపాడడం 3) మానవతావాదాన్ని ఆవిష్కరించడం 4) సంస్కరణ దృక్పథాన్ని ప్రేరేపించడం 5) నిశ్చయమైన సిద్ధాంతాన్నీ వ్యవస్థనూ లక్షించడం – అవసరమవుతాయి.

మనిషికీ సంఘానికీ పరస్పర సంబంధం ఉన్నంత వరకూ, సంఘాన్ని గురించి మానవునికీ, మానవుని గురించి సంఘానికీ, ఆలోచనా ప్రసారం తప్పదు. వ్యక్తుల

సమాహారం సంఘమైతే, సంఘంలో ఒక శక్తివంతమైన బిందువు వ్యక్తి – సంఘం వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది, వ్యక్తి తన వైశిష్ట్యం చేత సంఘానికి గతి రూపాన్ని ఇస్తాడు, ఏ కాలమైనా ఏ వ్యవస్థఐనా మనుషులందరినీ కలిపేది మానవత. ఏ సాంఘిక వ్యవస్థలోనూ, ఏ రాజకీయ పరిస్థితిలోనూ ఇది పరిహరించరానిది. నవలా రచనలో ఏదీ మానవతా వ్యతిరేకమైందిగా ఉండటానికి వీలులేదు.

నవల ప్రధానంగా మానవ జీవిత విశ్లేషణం వివరణం చిత్రణం దర్శనం కావడం చేత మానవతాదృష్టి ఉండి తీరుతుంది. అయితే వ్యక్తి – సమజాల సుస్థితికి ఉద్దేశాన్ని నిర్దేశించడం అవసరం. జీవితంలో వలెనే, నవలలో సాంఘిక రాజకీయ నైతిక మనస్తత్వ ప్రభావాలు ఒక దానిపై ఒకటి ప్రసరిస్తూ ఒక్కొక్క నిష్పత్తిలో సమన్వయం పొందుతూంటాయి.

ఈనాటి నవలలో ఆధునిక భావ ప్రసారంలో రచయిత ఉద్దేశం అయిదు విధాలుగా కన్పిస్తుంది :– 1) ప్రాచీన సంస్కృతి – విలువల పునరుజ్జీవనం. 2) వ్యక్తి సంస్కరణం – సమాజ పరివర్తనం. 3) ప్రజాస్వామ్య భావనతో 4) సామ్యవాద భావన 5) మానవత – మానవీయ చింతనం

ఈ అయిదూ విడివిడిగానూ కొన్ని కలిసీ ఉన్న రూపాల్ని గమనించవచ్చు. రచయిత విశ్వాసాన్నీ సిద్ధాంతాన్నీ ఆదర్శన్నీ బట్టి నవలలో ఉద్దేశం నిర్దేశాన్ని పొందుతూంది.

### ఉపయుక్త గ్రంథ సూచిక


Aspects of Novel - E.M. Forster

The craft of fiction - Parcy Lubbock

The Theory of Novel - Philipstevick Editors

Rhetoric of fiction - W.E. Booth

Archetypal patterns - Maud Budkin

The Structure of the Novel - Edwin Muir


## మాదిరాజు రంగారావు కృతులు

(రచనా కాలం 1952 – 2013)

రసధుని–సాహితీ పరిషత్తు శాంతినగర్, హైదరాబాద్–500 028.

**A. స్వేచ్ఛా కవిత్వం – మొదటి భాగం రచనాకాలం 1952 – 2002**

1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం
3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం
5. యుగ సంకేతం 6. ఆవాహన
7. ముక్తకాలు 8. నాలో ప్రవహిస్తోంది నది
9. నాకు జ్ఞాపకముంది 10. కిర్మీరం 11. మనోభూమికలు
12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై
15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం
18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై 20. అగ్ని నుండి ఆనందానికి
21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం
23. డైరి దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం
26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య
29. కిరణ పథం 30. స్వేచ్ఛకు సిగ్నెల్

**స్వేచ్ఛా కవిత్వం – రెండవ భాగం రచనాకాలం 2003 – 2012**

31. అభిషేకం – 2003 32. ఆగమనం – 2005 33. ఎప్పటికీ కొత్తే – 2005
34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం
37. సమకాలీనం – 2007 38. అభినవ యానం 39. ఆత్మ బంధం – 2008
40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. సవారంభం
43. నవ దర్శనం –2009 44. గిఫ్ట్ ప్యాకెట్ 45. పునర్దర్శనం
46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి–2010
49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం–2011
52. అద్దంలో ప్రజాస్వామ్యం–2011 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం –2012
54. ఖడ్గం కన్నీరు కార్చదు– 2013

**B. పరిశోధన – సమాలోచనం**

55. కవిత్రయం సృజనకళ – నిర్వహణ శిల్పం
56. స్వేచ్ఛా కవిత్వం 57. నవల స్వరూపం 58. పరిశోధనా స్వరూపం
59. అధికార భాష 60. అనువాద కళ 61. దాశరథి కవితా సమాలోచనం
62. సమ దర్శనం – స్వేచ్ఛా కవిత్వం 63. ఆలోకనం (సాహిత్య వ్యాసాలు)
64. సృజన దృష్టి – మానవీయ భావన 65. సాహిత్య వ్యాసాలు
66. మహాప్రస్థానం – సమాలోచనం 67. Facets of T. Free-verse
68. సృజన చేతన 1వ భాగం రా. కల్పవృక్షం (తులనాత్మక – 2వ భాగం వ్యాఖ్యానం
69. స్వేచ్ఛా కవిత్వం – ప్రజాస్వామ్య / మానవీయ భావన
70. స్వేచ్ఛా కవిత్వం సహృదయ స్పందనం 71. గురజాడ – ఆధునిక చేతన – 2013

## సంక్షిప్త పరిచయం



మాదిరాజు రంగారావు జననం 1936 జనవరి 7, ఖమ్మం పట్టణానికి పదిమైళ్ళ సమీపంలో పండితాపురం గ్రామం. ఖమ్మంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం. తదుపరి నిజాం కాలేజి, ఆర్ట్స్ కాలేజి, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో M.A. (Sanskrit) 1960, M.A. (Telugu) 1962, Ph.D (Telugu) 1962-64 యు.జి.సి. రిసెర్చ్ స్కాలర్ గానూ సాగింది. తెలుగు మహాభాగవతం పరిష్కరణ సమితిలో, తెలుగు మహాభారతం పరిష్కరణ సమితిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ప్రవేశం. కాకతీయ విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ప్రొఫెసర్‌గా Chairman Board of Studies and Dean Faculty of Arts గానూ ఉన్నారు. పదవీ విరమణం తరువాత యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (న్యూ ఢిల్లీ) రిసెర్చ్ ప్రాజెక్టుల (1995–98, 1999–2002) ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ గానూ తరువాత హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ (న్యూఢిల్లీ) రిసెర్చ్ సీనియర్ ఫెలో (2003–2006)గానూ పనిచేశారు.

సాహిత్య క్షేత్రంలో 1952 నుండి స్వతంత్ర, నవత, భారతి, స్రవంతి, జయంతి, వాఙ్మయి, మూసీ, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమిలో కవితలు, సాహిత్య వ్యాసాలు ప్రకటితమయినాయి. స్వేచ్ఛా కవిత్వం (54), పరిశోధన – సమాలోచనం(17) మొత్తం 71 పుస్తకాలు 1952–2013లో ప్రచురితమైనాయి.

**స్వేచ్ఛా కవిత్వంలో** 1. ప్రజాస్వామ్య దృక్పథం 2. మానవీయ భావన 3. సామాజిక వాస్తవికత 4. వర్తమాన స్థితి చలనం 5. మనస్తత్వ చిత్రణంతో ఒక పార్శ్వమూ.

**సమాలోచనంలో** 1. కవి దృష్టి – వ్యక్తిత్వం – కృతి 2. సమాజమూ – ఆదర్శరూపం 3. మానవీయం – విశ్వభావన 4. మనస్తత్వ ప్రకాశనం 5. సృజన కళ – సంవిధాన శిల్పంపై వెలుగుతో మరో పార్శ్వమూ కలిగిందీ, కవి సాహిత్య వ్యక్తిత్వం.

సృజన రచనలో చారిత్రకం సామాజికం మరియు కవి మనోరూపం నేపథ్యంలో భిన్నత్వం అనివార్యమే కాదు, సహజమూ అన్న అభిప్రాయం కలిగిందీ.

1970 నుండి రసధుని సాహితీ పరిషత్తు వ్యవస్థాపకులూ, అధ్యక్షులూ.


నివాసం

# జ్యోతి సౌభాగ్య అపార్ట్‌మెంట్, 10–2–289/61,

ఫ్లాట్ నెం. 202, శాంతినగర్, హైదరాబాద్ – 500 028.

040–23398899